RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in



12 ఏప్రిల్ 2025 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:268

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. బాపూఘాట్లో నిర్మించ తలపెట్టిన గాంధీ సరోవర్తో పాటు మీర్ అలం ట్యాంక్ పై నిర్మించనున్న బ్రిడ్జి నమూనాలను సీఎం పరిశీలించారు.

మీర్ అలం ట్యాంక్పై బ్రిడ్జి నిర్మాణ పనులకు జూన్లో టెండర్లు పిలవాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈలోగా అందుకు అవసరమైన సర్వేలు, నివేదికలు, ప్రతిపాదనలు, డిజైన్లతో డీపీఆర్ను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

శుక్రవారం కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మూసీ పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, శ్రీనివాసరాజు, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిషోర్తో పాటు మూసీ రివర్ డెవెలప్మెంట్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, ఉన్నతాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మీర్ అలం ట్యాంక్ పై నిర్మించే బ్రిడ్జికి సంబంధించి కన్సెల్టెన్సీలు తయారు చేసిన నమూనా డిజైన్లను అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రదర్శించారు. రెండున్నర కిలోమీటర్ల పొడవైన ఈ బ్రిడ్జిని అద్భుతంగా నిర్మించాలని, అదే సమయంలో సందర్శకులు, ప్రయాణికుల రక్షణకు అత్యంత ప్రాధాన్యముండే డిజైన్లను ఎంచుకోవాలని సీఎం అధికారులను అప్రమత్తం చేశారు. ఈ బ్రిడ్జితో పాటు మీర్ ఆలం ట్యాంక్లో వివిధ చోట్ల ఐలాండ్లా ఉన్న మూడు ప్రాంతాలను పర్యాటకులను ఆకట్టుకునేలా అందంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.

సింగపూర్ లోని గార్డెన్స్ బై ది బే ను తలపించేలా బర్డ్స్ పారడైజ్, వాటర్ ఫాల్స్ లాంటివి ఉండేలా ఈ మూడు ఐలాండ్లను అత్యంత సుందరంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. వెడ్డింగ్ డెస్టినేషన్ కు వీలుగా ఉండే కన్వెన్షన్ సెంటర్లతో పాటు అడ్వంచర్ పార్క్, థీమ్ పార్క్, అంఫీ థియేటర్ను ఏర్పాటు చేసేందుకు వీలుగా డిజైన్లు ఉండాలన్నారు. బోటింగ్ తో పాటు పర్యాటకులు విడిది చేసేలా రిసార్ట్స్, హోటల్స్ అందుబాటులో ఉండాలని సూచించారు. ట్యాంక్ లో నీటిని శుద్ధి చేయటంతో పాటు ఐలాండ్ ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలతో డీపీఆర్ సిద్ధం చేయాలని చెప్పారు. పీపీపీ మోడల్లో ఈ ఐలాండ్ జోన్ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

మీర్ అలం ట్యాంక్లో నీటి లభ్యతను, వరద వచ్చినప్పుడు ఉండే నీటి ప్రవాహ తీవ్రతను ముందుగానే అంచనా వేసుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా ముందు చూపుతో డిజైన్లు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. ఈ ప్రాజెక్టుకు అవసరమైన హైడ్రాలజీ తో పాటు పర్యావరణానికి సంబంధించి నిపుణులు, లేదా ఆ రంగంలో పేరొందిన సంస్థలతో సర్వే చేయించాలని, ఆ నివేదికల ఆధారంగా అవసరమైన అన్ని అనుమతులు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు.మీర్ అలం బ్రిడ్జితో పాటు ఈ ఐలాండ్ జోన్ను పక్కనే ఉన్న జూ పార్కుకు అనుసంధానం చేయాలని సూచించారు. ఇక్కడి డెవెలప్మెంట్ ప్లాన్ను దృష్టిలో పెట్టుకొని జూ పార్కును అప్ గ్రేడ్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జూ అధికారులతో సంప్రదింపులు జరిపి, నిబంధనల ప్రకారం అప్ గ్రేడ్ చేసేందుకు ఉన్న అన్ని అవకాశాలను పరిశీలించాలని సూచించారు. పర్యాటకులను మరింత ఆకట్టుకునేలా అభివృద్ధి ప్రతిపాదనలు తయారు చేయాలని చెప్పారు.

## నేతన్నలు, రైతన్నల సంక్షేమం ప్రాధాన్యతగా ప్రభుత్వ పాలన:: రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు



వార్తా 3 లో



## పేదల కు మూడు రంగుల కార్డులు

### ఆపై వర్గాలకు ఆకుపచ్చ కార్డులు
### త్వరలోనే కొత్త రేషన్ కార్డుల జారీ



హైదరాబాద్ కేంద్రం ఇచ్చేది దొడ్డు బియ్యమే మేం సన్న బియ్యం ఇస్తున్నాం మంత్రి ఉత్తమ్దారిద్ర్య రేఖకు దిగువన ఉండే వర్గాల బీపీఎల్, కు మూడు రంగుల కార్డులు, ఎగువన ఉండేవారి ఏపీఎల్, కి ఆకుపచ్చ రంగు రేషన్ కార్డులు ఇస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు.

కార్డుల ముద్రణ కోసం టెండర్లు పిలిచామని, త్వరలోనే కొత్త కార్డులు ఇస్తామని తెలిపారు. రాష్ట్ర జనాభాలో 84 శాతం మందికి సన్న బియ్యం ఇవ్వడం దేశ చరిత్రలోనే గొప్ప కార్యక్రమమని అన్నారు. చేశారు. కేంద్రం మనిషికి 5 కిలోల దొడ్డు బియ్యం ఇస్తుండగా.. తాము 6 కిలోల సన్న బియ్యం ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో దొడ్డు బియ్యం ఇవ్వడానికి రూ.10,600 కోట్లు ఖర్చుకాగా, 3.10 కోట్ల మందికి సన్న బియ్యం కోసం రూ.13 వేల కోట్లను వెచ్చించనున్నామని ప్రకటించారు. గురువారం జల సౌధ నుంచి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ల ఛైర్మన్లతో ఉత్తమ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మార్కెట్లో రూ.40కి కిలో సన్న బియ్యం కొనుగోలు చేసి, పేదలకు ఉచితంగా ఇస్తున్నామని తెలిపారు. గతంలో ఇచ్చిన బియ్యం 80-90 శాతం దాకా పక్కదారి పట్టిందని.. ప్రస్తుతం ఇస్తున్న బియ్యం వంద శాతం సద్వినియోగం అవుతుందని చెప్పారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ఇక ఏ రాష్ట్రంలో పండనంత వరి ప్రస్తుతం రాష్ట్రంలో పండుతోందని. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో, ఉమ్మడి ఏపీలో కూడా ఈ స్థాయిలో ఉత్పత్తి రాలేదని ఉత్తమ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో వడ్ల సేకరణ కోసం 8,209 కేంద్రాలు పెట్టాలని నిర్ణయం తీసుకున్నామని, ఇప్పటిదాకా 2,573 కేంద్రాలు తెరిచామని వెల్లడించారు. ధాన్యంలో తేమ 17 శాతం పైన ఉంటే కొనుగోలు చేయబోమని చెప్పారు. రాష్ట్రంలో ఈ ఏడాది సన్నబియ్యం పంపిణీ కోసం 30 లక్షల టన్నుల ధాన్యం సిద్ధంగా ఉంచామని ఉత్తమ్ ప్రకటించారు. తెలంగాణ ఏర్పడే నాటికి 90 లక్షల మందికి తెల్లకార్డులు ఉండగా పదేళ్లలో కొన్ని రద్దు కాగా, కొత్తగా ఇచ్చింది 49 వేల కార్డులేనని చెప్పారు. ప్రస్తుతం 2.81 కోట్ల మందికి సన్నం బియ్యం అందుతుండగా, కొత్తగా రేషన్కార్డుల దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తయితే ఆ సంఖ్య 3.10 కోట్ల మందికి చేరే అవకాశం ఉందన్నారు. ఎన్నికల కమిషన్ అనుమతి ఇవ్వనందున హైదరాబాద్లో సన్న బియ్యం ఇవ్వడం లేదని, ఎన్నికలు పూర్తి కాగానే ఇస్తామని తెలిపారు.

### పూర్వ వైభవం తెస్తా: ఉత్తమ్

వాటర్ అండ్ ల్యాండ్ మేనేజ్మెంట్ అండ్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ వాలంతరి,కి పూర్వ వైభవం తీసుకువస్తానని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్లోని వాలంతరిని ఆయన సందర్శించారు. ఈ నెల

## ఆడ బిడ్డలపై సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా పోస్టులు పెడితే కఠిన చర్యలు సీఎం చంద్రబాబు నాయుడు




అమరావతి,సోషల్ మీడియాలో ఆడ బిడ్డలపై ఇష్టానుసారం పోస్టులు పెడితే వారికి అదే చివరిరోజు అని సీరియస్ వార్నింగ్ ఇచ్చారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఏలూరు జిల్లా ఆగిరి పల్లి జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమంలో సీఎం మాట్లాడారు.

సోషల్ మీడియా నేరస్థుల అడ్డాగా మారిపోయే పరిస్థితి వచ్చిందన్నారు సీఎం చంద్రబాబు.. ఎవరైనా సరే వ్యక్తిత్వ హననానికి పాల్పడితే అదే చివరి రోజు అని హెచ్చరిస్తున్నా అన్నారు. మహిళల ను గౌరవ ప్రదంగా బతక నివ్వాలని చేతనైతే విలు వలు నేర్పించాలన్నారు.

వైఎస్ భారతిపై చేసిన అసభ్య వ్యాఖ్యల సందర్భంలో చంద్రబాబు కామెంట్స్ చర్చనీయాంశంగా మారాయి. జ్యోతిరావు పూలే అందరికి ఆదర్శం సమానత్వం మానవతా విలువలు పూలే సొంతం అన్నారు చంద్రబాబు బీసీలు టీడీపీకి వెన్నెముక జిల్లాల వారీగా బీసీల అభివృద్ధికి ముందుకు వెళుతున్నామన్నారు.ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి నేను పవన్ కల్యాణ్ అభివృద్ధి పై దృష్టి పెట్టాం. జీరో పవార్టీ వినూత్న కార్యకమం. పి4 కోసం తెలుగులో పేరు వెతికాం. కానీ, దొరకలేదు సమాజం లో ఎంతో మంది గొప్పవా రు అయ్యారు ఆగిరిపల్లి లో 206 కుటుంబాలు పేదరికంలో ఉన్నాయి మార్గదర్శిలు వచ్చి ఈ కుటుంబాలను ఆదుకోవాలి.ఆగిరిపల్లి లో ఇల్లు లేని వారికి ఇల్లు కట్టించే బాధ్య త జిల్లా కలెక్టర్ యంత్రాంగం తీసుకోవాలన్నారు. విద్యుత్ మరుగుదొడ్లు మంచి నీరు. ఇలా అన్ని అంశాల్లో జిల్లా యంత్రాంగం బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఇక, ఆగిరిపల్లిలో పి4లో భాగంగా కొన్ని కుటుంబాల బాధ్యతలను నూజివీడు సీడ్స్ అధినేతకు ప్రభాకర్ కు అప్పగించారు సీఎం చంద్రబాబు..ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్ల మానులో పర్యటించారు సీఎం చంద్రబాబు కులవృత్తులు చేసుకునే వారి ఇళ్లకు వెళ్లారు.

కులవృత్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బీసీ వర్గానికి చెందిన నక్కబోయిన కోటయ్య ఇంటికి వెళ్లిన సీఎం కోటయ్య పశువుల పాకను పరిశీలించారు..గేదెల పెంపకం ద్వారా వచ్చే ఆదాయాన్ని అడిగి తెలుసుకున్నారు.

## అమెరికాలో ట్రాఫిక్ మేనేజ్ మెంట్ సెంటర్ ను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి



కాలిఫోర్నియా అమెరికా దేశ పర్యటనలో ఉన్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కాలిఫోర్నియా రాష్ట్రంలోని ఆరెంజ్ కౌంటీలోని శాంటా అనా ప్రాంతంలో కాలిఫోర్నియా డిపార్ట్మెంట్ ఆఫ్ ట్రాన్స్పోర్టేషన్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సెంటర్ను సందర్శించారు.ట్రాఫిక్ నియంత్రణ వ్యవస్థలను గురించి వారు అవలంబిస్తున్న విడివిధానాలను అక్కడ అధికారులను అడిగి తెలుసుకున్నారు.తెలంగాణలో రహదారి భద్రత మరియు ట్రాఫిక్ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి కాలిఫోర్నియాలో అవలభింస్తున్న టెక్నాలజీ తీరును వారు పరిశీలిస్తాం అని మంత్రి ట్విట్టర్ వేదికగా చెప్పారు

ప్రజాబలం

12 ఏప్రిల్ 2025 శనివారం

# ఇంజనీర్లకు స్ఫూర్తి ప్రదాత

నేడు మన దేశం సుభిక్షంగా పంట, పొలాలతో... వరద ముంపులేని ప్రాంతాలతో తులతూగడానికి కారణం ఓ మహామనిషి కృషి. ఊళ్లకు ఊళ్లనే తన గర్భంలో కలిపేసుకునే ఉగ్ర గంగను ఆపిన మహా శక్తివంతు డాయన. ఏడుకొండల వాడా... ఎక్కడున్నావయ్యా.. అంటూ అలసిసొలసిన భక్తునికి వేంకటేశుని పాదాల చెంతకు వెళ్లే అతి తేలికైన దారిని చూపించిన మహామేథావి. ఆయనే సుప్రసిద్ధ ఇంజనీర్, పండితుడు, ప్రముఖ అధికారి, మోక్షగుండం విశ్వేశ్వరయ్య. మూడు దశాబ్దాల క్రితం మోక్షగుండం నుంచి ఆయన కుటుంబీకులు మైసూరుకు వలస పోయినా, వారి జన్మస్థలి నామధేయమైన మోక్షగుండం మాత్రం వారి వెన్నంటే వెళ్లి, మోక్షగుండం వారి ఇంటిపేరు అయింది. మోక్షగుండం గౌరవార్థం, ఆయన పుట్టిన రోజుని ఇంజనీర్ల దినోత్సవముగా జరుపుతారు. మోక్ష గుండం విశ్వేశ్వరయ్య (సెప్టెంబర్ 15, 1861 ం ఏప్రిల్ 12, 1962), గొప్ప ఇంజనీరు, పండితుడు, రాజనీతిజ్ఞుడు. 1912 నుండి 1919 వరకు మైసూర్ దివాన్ గా పనిచేశారు. 1955లో ఆయనకు భారతదేశపు అత్యున్నత పురస్కారమైన "భారతరత్న" లభించింది. ప్రజలకు చేసిన సేవలకు గాను బ్రిటిష్ ప్రభుత్వం తరపున "ఐదవ కింగ్ జార్జి నైట్ కమాండర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్" బిరుదునిచ్చి సత్కరించాడు.

విశ్వేశ్వరయ్య 1861, సెప్టెంబరు 15న బెంగుళూరు నగరానికి 60 మైళ్ళ దూరంలోగల చిక్క బళ్ళాపూర్ తాలూకా, ముద్దెనహళ్ళి అనే గ్రామంలో జన్మించాడు. అతను తల్లిదండ్రులు మోక్షగుండం శ్రీనివాస శాస్త్రి, వెంకట లక్ష్మమ్మ. వీరి పూర్వీకులు ఆంధ్ర ప్రదేశ్, ప్రకాశం జిల్లా లోని మోక్షగుండం గ్రామానికి చెందిన వారు. మూడు శతాబ్దాల కిందట వారు మైసూరు రాష్ట్రానికి వలస వెళ్ళినా తెలుగు మాట్లాడ గలిగే వారు. ఆయన తండ్రి సంస్కృత పండితుడు, హిందూ ధర్మశాస్త్ర పారంగతుడే కాక ఆయుర్వేద వైద్యుడు కూడా. 12 ఏళ్ల ప్రాయంలో తండ్రిని పోగొట్టుకుని, విశ్వేశ్వరయ్య, తన ప్రాథమిక విద్యను బెంగళూరులోని చిక్కబల్లాపూర్‌లో పూర్తి చేశారు. 1881 సంవత్సరంలో మద్రాసు యూనివర్శిటీ నుంచి బీఏ పట్టా పొందారు. పూనేలోని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. తరువాత తన 23వ యేట బొంబాయి ప్రజా పనుల శాఖలో అసిస్టెంట్ ఇంజనీరుగా చేరగా, అనంతరం భారత నీటి పారుదల కమిషను చేర వలసినదిగా ఆహ్వానం వచ్చింది. 1906-1907 మధ్య కాలంలో ఆయనను భారత ప్రభుత్వం యెమెన్ లోని ఆడెన్ కి పంపించి అక్కడి నీటి పారుదల వ్యవస్థనూ, మురికి కాలువల వ్యవస్థను రూపకల్పన చేయమని కోరగా, నిర్దేశించిన పథకం ప్రకారం అక్కడ మంచి ప్రాజెక్టు విజయవంతంగా పూర్తి చేశారాయన. మైసూర్ చాంబర్ ఆఫ్ కామర్స్, 1917లో బెంగుళూరులో ప్రభుత్వ ఇంజనీరింగు కాలేజి, మైసూరు విశ్వవిద్యాలయం నెలకొల్పటంలో, తిరుమల తిరుపతి ఘాట్ రోడ్డు ఏర్పాటులో, హైదరాబాదులోని పత్తర్‌గట్టి నిర్మాణానికి డిజైన్లో ప్రధాన పాత్ర ఉంది. దేశంలోనే తొలిసారిగా 1903లో ఆటోమేటిక్ ఫ్లడ్ గేట్ల పద్ధతిని కనుగొన్నారు. ఈ సూత్రం విజయవంతం కావడంతో దేశంలో పలుచోట్ల ఇదే తరహా పద్ధతిని ప్రవేశ పెట్టారు. రిజర్వాయిర్‌లో భారీగా చేరే నీటిని నిలువ వుంచగలిగే సదుపాయంతో పాటు డ్యామ్‌కు ఎటువంటి హాని తల పెట్టకుండా చూడటంలో ఈ ఫ్లడ్ గేట్లు ఎంతగానో ఉపయోగ పడ్డాయి. 1908లో మూసి నదికి వరద రావడంతో హైదరాబాద్ నగరం ప్రమాదంలో చిక్కు కోగా హైదరాబాద్ ను వరద ముప్పు నుంచి రక్షించేందుకు అప్పటి నిజాం నవాబు, విశ్వేశ్వర్యను ఆహ్వానించి పరిష్కారం వెతకాలని కోరటంతో పటిష్టమైన నగర మురుగునీటి పారుదల పథకాన్ని రూపొందించారు. ఆ మూసీపై రిజర్వాయ ర్ నిర్మాణంలో హైదరాబాద్ నగరానికి వరద ప్రమాదం తప్పింది. విశాఖ పట్నం రేవును సముద్రపు కోత నుండి రక్షించే వ్యవస్థను రూపొందించడం లోనూ విశ్వేశ్వరయ్య పాత్ర ఉంది. ఆయన సలహా మేరకే గండిపేట్, హిమాయత్ సాగర్ జంట జలాశయాలను నిర్మించారు. మూసీ నుంచి తరలివచ్చే వరదకు అక్కడే అడ్డుకట్ట పడింది. ఈ జలాశయాల్లో నిల్వచేసిన నీళ్లే హైదరాబాదీల దాహార్తిని తీరుస్తున్నాయి. 1911లో కంపేనియన్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఇండియన్ ఎంపైర్గా నియమితుడయ్యాడు. 1927-1955 వరకు టాటా స్టీల్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా సేవలందించారు. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక 1955లో భారత దేశపు అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రధానం చేశారు. లండన్ లోని ఇంటర్నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సివిల్ ఇంజనీర్ గా బెంగుళూరు లోని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అతనుకు గౌరవ సభ్యత్వం, భారతదేశం లోని ఎనిమిది విశ్వ విద్యాలయాలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. నిండు నూరేళ్లు జీవించిన విశ్వేశ్వరయ్య... 1962 ఏప్రిల్ 14న ఆయన తుదిశ్వాస విడిచారు. ఆయన పేరు మీద భారతదేశ మంతా ఎన్నో విద్యా సంస్థలున్నాయి. విశ్వేశ్వరయ్యకు విద్యారంగం, ఇంజనీరింగ్ తదితర రంగాలలో విశేషమైన గుర్తింపు లభించింది. ఆయన జన్మశతి సంవత్సరంలో బెంగుళూరులో విశ్వేశ్వరయ్య పారిశ్రామిక, సాంకేతిక ప్రదర్శనశాల నెలకొల్ప బడింది. భారత దేశంలోనే అతిపెద్దదైన కృష్ణా నదిపై నిర్మించిన "కృష్ణరాజ సాగర్" నిర్మాణ సమయంలో ఛీఫ్ ఇంజనీర్‌గా పనిచేశారు. దేశంలో చాలా డ్యామ్‌లు నిర్మించారు. ఆయన స్వస్థలంలో విశ్వేశ్వరయ్య మెమోరియల్ ట్రస్టు వారు ఒక స్మారక చిహ్నాన్ని నిర్మించారు. ఇందులో అతను సాధించిన పతకాలు, బిరుదులు, అతను వాడిన కళ్ళద్దాలు, కప్పులు, వెబ్ స్టర్ డిక్షనరీ, అతను విజిటింగు కార్డును ముద్రించే పరికరం లాంటి వస్తువులు ప్రదర్శనకు ఉంచారు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి జాతి గర్వించే ఎన్నో సాంకేతిక కట్టడాలు అందించిన సర్ విశ్వేశ్వరయ్య ప్రతి ఇంజనీర్‌కు స్ఫూర్తిదాత. ఆ స్ఫూర్తి తోనే శాస్త్ర సాంకేతిక, నిర్మాణ, రవాణా రంగాల్లో పురోభివృద్ధి సాధిస్తోంది. ఏడాదికి లక్షల మంది ఇంజనీర్లు తయారవు తున్నారు. ఆయా విభాగాల్లో శిక్షణ ఇవ్వడానికి పలు యూనివర్సిటీలు సేవలు అందిస్తున్నాయి. తల్లి దండ్రులు తమ పిల్లలు వైద్యుడు, ఇంజనీరు కావాలని ఆకాంక్షిస్తున్నారు. ఇంతటి ప్రాచుర్యం కలిగిన ఈ విద్య కోసం పోటీ పడి చదువు తున్నారు. ఇంజనీరింగ్ సీట్ల కోసం విద్యార్థులు అహెూ రాత్రులు కష్టపడు తున్నారు. ఇంజనీరింగ్ విద్య పూర్తికాక ముందే నేడు స్వ, విదేశీ కంపెనీల క్యాంపస్ ఎంపికల పేరుతో ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నారు. వేల నుంచి లక్షల వరకు వేతనాల చెల్లిస్తున్నారు. గతంలో ఎంతో ఆదరణ చూరగొన్న సివిల్ ఇంజనీరింగ్ ప్రభుత్వ రంగంలో అవినీతిలో కూరుకు పోయిందనే ఆరోపణలున్నాయి. ఇదే ప్రయివేటు సెక్టార్‌లో ప్రతిభలో కూడిన కాసుల గల గలల కొలమానంగా మారింది. ప్రభుత్వ ఆధీనంలో అభివృద్ధిలో భాగంగా వేసిన రోడ్లు, కట్టిన భవనాలు, నిర్మించిన చెరువులు, ప్రాజెక్టులు, వేసిన పైపులైన్లు కూలిపోవడం, తెగిపోవడం, పగిలిపోవడం గమనిస్తూనే ఉన్నాం. కారణాలు ఏమైనప్పటికీ నాణ్యతకు ప్రతిభ తోడు కాకపోవడమే అని నిపుణులు అంటున్నారు. నాణ్యతకు రాజకీయం, అవినీతి అడ్డుగా నిలుస్తున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఇంజనీరింగ్ రంగ పితామహాలు మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్‌ల వలే ప్రజల మదిలో చిరకాలం నిలిచి పోయేందుకు ప్రతీ ఇంజనీర్ కృషి చేయాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

# విద్య ప్రాముఖ్యతను చాటి చెప్పిన మహనీయులుమహాత్మజ్యోతిబా పూలే

## జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్




జగిత్యాల ప్రజాబలం ప్రతినిది: చదువు తోనే జీవితంలో మార్పు సాధ్యమని విద్య ప్రాముఖ్యతను చాటి చెప్పిన మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే అని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.

శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బి. ఎస్ లత, కరీంనగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ లతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, గతంలో వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ కారణంగా దళితులు, బడుగు బలహీన వర్గాల పట్ల తీవ్ర వివక్షతకు గురయ్యేవారని అన్నారు. 1827 లో మహిళలను సమానంగా చూడటం అనే ఆలోచన కూడా చాలా కష్టమని, అటువంటి పరిస్థితుల్లో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులు పూలే అని కలెక్టర్ అన్నారు.

సామాజిక సమానత్వం సాధన కోసం జ్యోతి బా పూలే అప్పటి సమాజంలో పోరాటం చేశారని, ఆ స్ఫూర్తి మనమంతా తీసుకోవాలని, సామాజిక అసమానతలు దూరమయ్యేందుకు మన వంతు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాలికల విద్యపై పూలే దంపతులు చిత్తశుద్ధితో పనిచేశారని,

స్త్రీలు విద్యా వంతులు కావాలని ఆకాంక్షించారని తెలిపారు.

అట్టడుగు బడుగు బలహీన వర్గాలకు మంచి విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాల ఏర్పాటు, బీసీ స్టడీ సర్కిల్, ఎస్సి స్టడీ సర్కిల్ ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉచిత శిక్షణ అందించడం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు.

మహనీయుల జయంతి ఉత్సవాలలో వచ్చిన వక్తలు అడిగిన వివిధ అంశాలను అధికారులు సంపూర్ణంగా వివరించాలని, మహనీయుల ఆశయాల సాధన కోసం, సమాజంలోని వివిధ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను చివరి అర్హుల వరకు అందే విధంగా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు.

ఆనంతరం ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ ఒక రాత్రిలో అనూహ్యమైన మార్పులు రానప్పటికి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నిదానంగా స్పష్టమైన మార్పు కనిపిస్తుందని, మెరుగైన విద్యాబోధన అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి జి. సునీత , కలెక్టరెట్ ఏ ఓ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు హరి అశోక్ కుమార్, మానల కిషన్, వివిధ ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# భారతీయ సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే

## జ్యోతిరావు పూలే జన్మదిన వేడుకలు



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 11: మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం జాతీయ సంక్షేమ బీసీ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకల సందర్భంగా బీసీ సంఘం నాయకులు కలిసి సింగరేణి మనోవికాస్ పాఠశాలలో మరియు మార్కెట్లో ఆయన జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డా. నీలకంతేశ్వరరావు, సెకండ్ ఎస్ ఐ నూనె శ్రీనివాస్ లు కలిసి జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఆయన పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్ల పంపిణీ చేశారు. దాదాపు 200 మందికి మజ్జిగ కూడా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా మందమర్రి జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు సకినాల శంకర్ మాట్లాడుతూ. జ్యోతిరావు పూలే జన్మదిన కార్యక్రమానికి పురస్కరించుకొని బీసీ సంఘం నాయకులు కు బీసీ సంఘం కార్యకర్తలు కు



ప్రతి కుల సంఘ నాయకులకు పేరుపేరునా శుభాకాంక్షలు తెలిపారు. అతను అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషి చేసాడన్నారు. విద్య యొక్క విశ్వీకరణను సమర్థించిన మొదటి సంస్కర్త కూడా ఆయనేనని జ్యోతిరావు పూలే కు బిసి సంఘం తరపున ప్రభుత్వం ఆయనకు భారతరత్న బిరుదు ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నేరేళ్ల వెంకటేష్, ఉప అధ్యక్షులు పోల్ శ్రీనివాస్, బొలిశెట్టి రాజయ్య ,వర్కింగ్ ప్రెసిడెంట్ బీర వేణుగోపాలరావు, ముఖ్య సలహాదారుడు రామస్వామి, శేఖర్, ఎగ్జిక్యూటివ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్ల సారంగపాణి ,ఆర్గనైజింగ్ సెక్రటరీ గాండ్ల సంజీవ్, సతీష్ బాబు, పెంద్యాల గౌతం చారి, భోజన పెల్లి రవీందర్ ,పోల్ సంపత్, పవన్ కుమార్ ,మునిశెట్టి సత్యనారాయణ, మాడ గోని శంకర్, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేరెళ్ల ఘటనపై ఎస్సీ కమిషన్ నే తప్పు పడతారా..?

తక్షణమే అ దుష్ప్రచారాన్ని నిలిపివేయండి.
లేనిపక్షంలో చర్యలు తప్పవు.
జాతీయ ఎస్సీ కమిషన్ హెచ్చరిక.
నాటి ఘటనపై తీసుకున్న చర్యలను వివరించిన ఎస్సీ కమిషన్.
ప్రభుత్వానికి పంపిన ఎస్సీ కమిషన్ మధ్యంతర నివేదిక విడుదల.
బాధితులకు 5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశం.
సంబంధిత పోలీసులను సస్పెండ్ చేయాలని హుకుం.




రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, తంగళ్ళపల్లి,( ప్రజాబలం ), సరిగ్గా 8 సంవత్సరాల క్రితం (2017) లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల ఘటనలో కొంతమంది సోషల్ మీడియా వేదికగా జాతీయ ఎస్సీ కమిషన్ ను బదునం చేస్తున్నట్లు సమాచారం అందుకున్న ఆ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామ్ చందర్ ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించారు. దళితుల పక్షాన పని చేసే ఎస్సీ కమిషన్ను నిందించడాన్ని ఆయన తప్పు పట్టారు. తక్షణమే ఆ దుష్ప్రచారాన్ని నిలిపివేయాలని కోరారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా నేరెళ్ల ఘటనలో ఎస్సీ కమిషన్ జరిపిన విచారణతో పాటు ప్రభుత్వానికి పంపిన మధ్యంతర నివేదికను సైతం మీడియాకు విడుదల చేశారు. బాధితులకు న్యాయం జరిగేలా, బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేస్తూ ఆ నివేదికను రూపొందించిన అంశాన్ని గుర్తు చేశారు. ఆ నివేదికలో జాతీయ కమిషన్ పేర్కొన్న వాటిలోని కొన్ని ముఖ్యంశాలు....

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని నేరెళ్ల గ్రామంలో2017 జూలైలో దళితుల పైన, ఇతరుల పైన జరిగిన దాడి, వేధింపుల ఘటనలో జాతీయ ఎస్సీ కమిషన్ ప్రతిష్టను దిగదర్చే విధంగా కొంతమంది వ్యక్తులు మాట్లాడుతున్నట్లు ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్ దృష్టికి వచ్చింది. మెజిస్టీరియల్ అధికారాలు ఉన్న ఎస్సీ కమిషన్ దళితులపై జరిగే దాడులు, వేధింపులపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయడంలో అగ్ర భాగాన ఉంది.

2017 జూలైలో నేరెళ్ల గ్రామంలో జరిగిన ఘటనపై స్వయంగా ఎస్సీ కమిషన్ ఆ గ్రామంలో పర్యటించింది. బహిరంగ విచారణ జరిపింది. అధికారులకు, పోలీస్ సిబ్బందికి తెలుసు. ఆ విచారణ జరిగిన వెంటనే ఎస్సీ కమిషన్ కరీంనగర్ జైలుకు వెళ్లి నేరేళ్ల బాధితులను కలిసి స్టేట్మెంట్ రికార్డు చేయడం కూడా జరిగింది. తదుపరి జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులను విచారణకు పిలిచి వారి స్టేట్మెంట్లు కూడా రికార్డు చేయడం జరిగింది. అనంతరం అదే ఏడాది ఆగస్టు 7న అప్పటి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి మభ్యంతర నివేదికను పంపిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కమిషన్ ఆదేశించింది. ఈ విషయం కూడా మీడియాలో వచ్చింది. ఆగస్టు 7,2017 న ఫైల్ నెంబర్3/33/17 టి ఎస్ ఆర్ యు పేరుతో పంపిన ఆ మధ్యంతర నివేదికలో ప్రధానంగా ఈ క్రింది 5 అంశాలను ప్రస్తావిస్తూ చర్యలకు ఆదేశించింది.

1) ఈ ఘటనపై హై లెవెల్ కమిటీని ఏర్పాటుచేసి విచారణ జరపాలి.

2) నేరెళ్ల ఘటనపై విచారణ సాఫీగా జరగాలంటే సిరిసిల్ల జిల్లా ఎస్పీని బదిలీ చేయాలి,అ జ్యూరీ డిక్షన్ పరిధిలో ఉండకూడదు.

3) సంబంధిత డిఎస్పి, సీఐ, ఎస్ఐలను విచారణ పూర్తయ్యే వరకు సస్పెండ్ చేయాలి.

4) బాధితులకు పూర్తి వైద్య ఖర్చులను ప్రభుత్వం భరించాలి, చికిత్స అందించాలి.

5) బాధితులకు ఐదు లక్షల రూపాయల నష్టపరిహారం అందించాలి.

## ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 11:మహాత్మ జ్యోతిబాపూలే 119 వ జయంతి వేడుకలను మందమర్రి మార్కెట్ ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం మాదిగ హక్కుల దండోరా ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా మహాత్మా జ్యోతి రావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మందమర్రి పట్టణ కన్వీనర్ కోలుగురి విజయకుమార్ మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లోని ప్రజలు చదువుకునేందుకు పాఠశాలలను నెలకొల్పి విద్యావ్యాప్తికి కృషి చేసిన సామాజిక సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. ఈకార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాయబారపు కిరణ్, మాదిగ హక్కుల దండోరా నాయకులు దరిపెల్లి కనకయ్య, బత్తుల సరిత, వినోద, దాసరి సమత, చెన్నూరు దళిత యూత్ అధ్యక్షుడు మంతెన సుమన్, ముల్కల రమేష్, బీసీ సంఘాల నాయకులు రామసాని సురేందర్, సేవాదళ్ కార్యదర్శి దాసరి ఎల్లారం, నాయిని శంకర్, పోల్ కుమార్, బొజ్జ గణేష్, మొగిలిచర్ల రాజేష్, సాదుల చింటూ, కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థుల పాలిట ఆశాదీపం మహాత్మా జ్యోతి బాపూలే ఆర్ సి ఓ సేరు శ్రీధర్




ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 11 : పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థుల పాలిట ఆశాదీపం మహాత్మా జ్యోతిబా పూలే అని, మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలు,కళాశాలల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమన్వయకర్త సేరు శ్రీధర్ తెలిపారు.శుక్రవారం మహాత్మా జ్యోతిరావు పూలే జన్మదినాన్ని పురస్కరించుకొని గుడిపేట లోని గురుకుల పాఠశాలలో పూలే జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం ఆర్ సి ఓ మాట్లాడుతూ...నేడు పేద విద్యార్థులంతా చాలా సంతోషంగా పెద్ద చదువులు చదువుకుని రాణిస్తున్నారంటే దానికి కారణం మహాత్మా జ్యోతిబా పూలే గారని తెలిపారు. చదువుకోవాలని శ్రద్ధ ఉండి చదివించలేని స్తోమత లేని పేద ప్రజల పరిస్థితులను తెలుసుకొని,కుల మతాలకతీతంగా పోరాటం చేసి ప్రతి ఒక్కరికి విద్యను అందించాలని ఉద్దేశంతో ప్రాణాన్ని సైతం లెక్కచేయని మహనీయుడు పూలే అని ఈ సందర్భంగా కొనియాడారు. ఆయన సేవలకు గుర్తుగా ప్రభుత్వం సైతం నేడు బీసీ గురుకుల పాఠశాలలకు ఆయన పేరే నామకరణం చేసిందని పేర్కొన్నారు.2014 వ సంవత్సరంలో మహాత్మా జ్యోతిబా పూలే పేరిట బీసీ గురుకులాలను స్థాపించి గత 11 సంవత్సరాల కాలంలో ఎన్నో లక్షల మంది పేద విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించడం జరిగిందన్నారు. అంతేకాకుండా అందులో చాలామంది విద్యార్థులు రోజుల్లో ఉన్నత స్థాయిలో ఉండడం సంతోషించదగ్గ విషయం అన్నారు.ప్రభుత్వాలు సైతం వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ కార్పొరేట్ పాఠశాలలకు,కళాశాలలకు దీటుగా విద్యను అందించడంతోపాటు, పౌష్టికాహారం కూడా అందించడం జరుగుతుందన్నారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల్లో ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకొని పేద విద్యార్థులకు చేసిన సేవలను తెలియజేశారు. లక్షెట్టిపేట బాలుర గురుకుల పాఠశాలలో చిన్నారి విద్యార్థులు హర్యానా పాటను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమాలలో ఆయా గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాల్ లు, ఏటీపీలు,ఉపాధ్యాయ సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అసమానతలను తొలగించేందుకు విశిష్ట కృషి చేసిన మహోన్నత వ్యక్తి "మహాత్మా జ్యోతిభాపూలే" జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 10 : సమాజంలో అసమానతలను తొలగించడంతో పాటు బాలికా విద్యను ప్రోత్సహించి మహిళలకు సమాన అవకాశాల కొరకు పోరాడిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిభాపూలే అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిభాపూలే 198వ జయంతి వేడుకలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం,జిల్లా అధికారులు,కుల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై పూలే చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బడుగు, బలహీన,దళిత,గిరిజన ప్రజల సంక్షేమం కోసం, మహిళలు చదువు నేర్చుకోవాలనే సంకల్పంతో విశిష్ట కృషి చేసిన మహనీయుడు మహాత్మ జ్యోతిబాపూలే ఆచరించిన ఆశయాలను అందరం కొనసాగించాలని అన్నారు. బాలికా విద్యను ప్రోత్సహిస్తూ మహిళలు చదువుకున్నట్లయితే కుటుంబంతో పాటు దేశం అభివృద్ధి చెందుతుందని, సామాజిక,ఆర్థిక,రాజకీయ రంగాలలో మహిళల సమానత్వం కొరకు కృషి చేశారని తెలిపారు.ఆ కాలంలో బాలికా విద్య కోసం ముందుగా తన భార్య సావిత్రిబాయి పూలేకు చదువు నేర్పి దేశంలోనే మొట్టమొదటి ఉపాధ్యాయురాలిగా తీర్చిదిద్ది ఆదర్శంగా నిలిచారని అన్నారు. అణిచివేతకు గురవుతున్న బడుగు,బలహీన వర్గాల అభ్యున్నతి,సమాజంలో సమాన స్థానం అందించేందుకు తమ జీవితాన్ని అంకితం చేశారని అన్నారు.కుల వివక్ష, అసమానతలను అంతం చేయాలని ఆనాడే నిర్ణయించుకుని పోరాటాలు చేశారని తెలిపారు. మహనీయుల చరిత్రను భావితరాలకు అందించి సన్మార్గంలో నడిచేలా అందరం సమిష్టిగా కృషి చేయాలని,మహాత్మా జ్యోతిభాపూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు అనుసరించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బద్వేలులో 54 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం ఒకరి అరెస్టు

బద్వేలు పట్టణం ఆంజనేయ నగర్ లోని ఓ ఇంట్లో 54 బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు ఈ కేస్ కు సంబంధించి ఒకరిని అరెస్టు చేశారు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని ప్రభుత్వ గోడౌన్ కు తరలించారు అతనిపై పోలీసులు కేసు నమోదు చేశారు కాగా చాలా సంవత్సరాలుగా అతను రేషన్ బియ్యాన్ని సేకరించి తమిళనాడు కర్ణాటక రాష్ట్రాలకు అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు కాగా బద్వేలు పట్టణంలో సునీల్ అనే వ్యక్తి అతని సోదరులు రేషన్ బియ్యాన్ని పక్క రాష్ట్రాలకు తరలించడంలో ఆరితేరి పోయారు ఈ విషయం అందరికీ తెలిసిన బహిరంగ రహస్యం

## నేతన్నలు, రైతన్నల సంక్షేమం ప్రాధాన్యతగా ప్రభుత్వ పాలన:: రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు

### 34 కోట్లతో నేతన్న లకు లక్ష రూపాయల రుణమాఫీ పూర్తి

### నేతన్న జీవనోపాధి కల్పనకు ప్రభుత్వం ప్రత్యేకంగా 900 కోట్ల ఆర్డర్లు అందించాం

### అపెరల్ పార్క్ లో మరో పరిశ్రమ యూనిట్ ను ప్రారంభించిన మంత్రులు

రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్ -11 (ప్రజా బలం ప్రతినిధి)నేతన్నలు, రైతన్నల సంక్షేమం ప్రాధాన్యతగా రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తుందని రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు.సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని అపెరల్ పార్క్ లో 7.6 ఎకరాల విస్తీర్ణంలో 62 కోట్లతో లక్షా 73 వేల చదరపు అడుగుల పంక్చుయేట్ వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్( టెక్స్ పోర్ట్)యూనిట్ ను శుక్రవారం చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, బిసి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ శిలా ఫలకాన్నీ ఆవిష్కరించారు. యూనిట్ లోని ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం యూనిట్ లోని ఉద్యోగుల తో ముచ్చటించారు.మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ,

నేతన్నల జీవనోపాధి కల్పించే విధంగా సిరిసిల్ల గడ్డ మీద వర్కర్ టూ ఓనర్, అపెరల్ పార్క్ ఏర్పాటు వంటి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రైతన్నలు, నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, వీరిని దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులు కల్పిస్తూ రాష్ట్ర యువతకు అవకాశాలు కల్పించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. 20 వేల 600 కోట్ల రూపాయల రైతులకు ఏక కాలంలో రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని, నేతన్న లకు కూడా కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా 34 కోట్ల రూపాయలతో లక్ష రూపాయల రుణమాఫీ పూర్తి చేశామని మంత్రి తెలిపారు.

నేతన్న లకు పెండింగ్ లో ఉన్న 914 కోట్ల బకాయిలు విడుదల చేయడం జరిగిందని అన్నారు.ఒకే రోజు వివిధ పథకాల క్రింద 290 కోట్ల నిధులు జమ చేసామని, చేనేత భరోసా, చేనేత బీమా పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో అన్ని శాఖలలో అవసరమైన వస్త్రాలను చేనేత కార్మికుల ద్వారానే కొనుగోలు చేస్తున్నామని, ఇప్పటికే కార్మికులకు 900 కోట్ల రూపాయల ఆర్డర్స్ ప్రభుత్వం అందించిందని అన్నారు. ముఖ్యమంత్రితో చర్చించి త్వరలోనే వర్కర్ టు ఓనర్ కార్యక్రమం పునరుద్ధరిస్తామని అన్నారు.చేనేత రంగానికి చెందిన పరిశ్రమలను సిరిసిల్ల , వరంగల్ వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామని, దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న చేనేత కార్మికులు తిరిగి వచ్చేలా మౌలిక వసతుల కల్పన కృషి చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఏ పని చేసినా తెలంగాణ ప్రజల కష్ట ఫలితం మాత్రమేనని అన్నారు. కేంద్రాన్ని పోషించే రాష్ట్రాలలో తెలంగాణ ముందు వరుసలో ఉంటుందని అన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ,

గత కాంగ్రెస్ హయాంలో నేతన్నలు కాపాడేందుకు వీలుగా అన్ని చర్యలు తీసుకున్నామని అన్నారు. నేతన్న లకు అంత్యోదయ కార్డులను గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిందని అన్నారు.టెక్స్ పోర్ట్ సంస్థ ప్రతినిధులతో చర్చించి వారికి ఉన్న సమస్యలను పరిష్కరించి నేడు ఈ పరిశ్రమను ప్రారంభించామని అన్నారు. సిరిసిల్ల నేతన్న లకు దేశవ్యాప్తంగా గుర్తింపు సాధించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు.వేములవాడ దేవాలయ అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్ లో ప్రత్యేకంగా నిధులు కేటాయించామని అన్నారు. శాతవాహన విశ్వ విద్యాలయాన్ని తమ ప్రభుత్వం స్థాపించిందని, దీనికి సంబంధించి ఇంజనీరింగ్ కళాశాల, లా కళాశాలలను మళ్ళీ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మంజూరు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో నీటి పారుదల సౌకర్యం, రహదారుల సౌకర్యం, విద్యా, వైద్య సౌకర్యాలు కల్పనకు కృషి చేస్తున్నామని, అన్ని రంగాలలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని ముందు వరుసలో ఉంచుతామని అన్నారు. స్థానికులకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు కల్పించే ఇటువంటి పరిశ్రమకు భవిష్యత్తులో ఎటువంటి అవసరమున్న ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని అన్నారు.బీసి సంక్షేమం , రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, బెంగళూరు నగరానికి చెందిన టెక్స్ పోర్ట్ సంస్థ అప్పెరల్ పార్క్ లో 62 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేయడం చాలా సంతోషమని, భవిష్యత్తులో పరిశ్రమ విస్తరణకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, టెక్స్ పోర్ట్ సంస్థ ఇక్కడ మరింత విస్తరించాలని, స్థానికులకు మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించాలని మంత్రి ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలలో అవసరమైన బట్టలను చేనేత కార్మికుల నుంచి సేకరిస్తున్నామని, మహిళా సంఘాలకు ప్రభుత్వం రెండు చీరలు ఇవ్వాలని నిర్ణయించిందని వీటి ఆర్డర్లను కూడా సిరిసిల్ల నేతన్న లకే ప్రభుత్వం అందించిందని అన్నారు.పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం సన్న బియ్యం పథకం అమలు చేస్తుందని వివరించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ, చేనేత కార్మికులకు లక్ష రూపాయల రుణ మాఫీ పూర్తి చేశామని, మహిళా సంఘాలలో ఉన్న 65 లక్షల మంది మహిళలకు ఉచిత 2 చీరలు పంపిణీ చేయాలనే నిర్ణయించి ఆ ఆర్డర్ ద్వారా చేనేత కార్మికులకు ఉపాధి కల్పన దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందని చెప్పారు.ఈ ప్రాంతంలో కాటన్ పరిశ్రమ, పాలిస్టర్ పరిశ్రమ, అనుబంధ రంగ పరిశ్రమలు తీసుకొని రావాలని,

ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ఆయన మంత్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రజల చిరకాల కోరిక నూలు డిపోను కూడా వేములవాడ పట్టణంలో 50 కోట్లతో ఏర్పాటు చేసుకున్నామని, దీని వల్ల 99 సంఘాలకు ఇప్పటివరకు సబ్సిడీ పై నూలు అందించామని అన్నారు. అనంతరం పరిశ్రమలో శిక్షణ పొందిన మహిళలకు నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, కంపెనీ సీఈఓ చంద్రశేఖర్ ఎస్పీ మహేష్ బీ గీతే, సెస్ ఛైర్మెన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, సిరిసిల్ల ఆర్డీవో రాధా బాయ్, వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ ఏడీ రాఘవేందర్, ప్రజా ప్రతినిధులు ప్రజలు కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతిలోగా విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 11 : ఈ నెల 14వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐ.బి.చౌరస్తాలో కొనసాగుతున్న డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ నెల 14వ తేదీన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకొని జిల్లాలో వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా విగ్రహ ఏర్పాటు పనులు వేగవంతం చేసి ఈ నెల 14వ తేదీన ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

## అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల విభాగంలో ఎక్స్టెన్షన్ లెక్చర్



రాజన్న సిరిసిల్ల జిల్లా, ఏప్రిల్-10 (ప్రజాబలం ప్రతినిధి)డాక్టర్ యెలగొండ ఆంజనేయులు ఆంగ్ల విభాగాదిపతి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లీష్ గంభీరావుపేట ఈరోజు ఎక్స్టెన్షన్ లెక్చర్ ఆన్ "బ్రోకెన్ ఇంగ్లీష్ టు స్పోకెన్ ఇంగ్లీష్" అనే అంశంపై గ్రామర్ పద్ధతిలో కాకుండా అత్యంత సులభమైన టిప్స్ ద్వారా తెలుగు నుంచి ఇంగ్లీషులోకి ఏ విధంగా భయం లేకుండా మాట్లాడవచ్చు, రాయవచ్చును, పోయెట్రిక్ ఎక్స్ ప్రెసన్, ప్రనన్షియేషన్ స్కిల్స్ తదితర ఆంగ్ల భాష నైపుణ్యాలను మెరుగు పరుచుకోవటం మూలంగా ఎలాంటి అద్భుతమైన అవకాశాలను ప్రపంచ వ్యాప్తంగా అందిపుచ్చుకోవడంలో ఎంతగానో దోహదపడుతుందని విద్యార్థినీ విద్యార్థులకు పలు రకాల ఉదాహరణలతో తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్, ఆంగ్ల విభాగాదిపతి డాక్టర్ యం. శోభారాణి, మహేందర్ లెక్చరర్ ఇన్ ఇంగ్లీష్ తదితర అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# సమన్యాయ పద్ధతిలో అధ్యక్ష పదవులు

### బార్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం పూర్తి

### అధ్యక్షులుగా గుండా రవి, గుడిసె సదానందం

### నూతనంగా గెలిచిన అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసిన ఎన్నికల అధికారి



**వేములవాడ - మార్చి 11 (ప్రజాబలం దినపత్రిక)**వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 9న మూగియగా అధ్యక్ష పోటీలో ఉన్న అభ్యర్థులకు చేరి సమానం ఓట్లు రావడంతో అధ్యక్ష ఎన్నిక టైం అయింది. ఎన్నికల అధికారి కేశన్న గారి గోపికృష్ణ ఇద్దరికీ సమన్యాయం చేస్తూ చెరీ ఆరు నెలలు అధ్యక్ష పదవి కొనసాగే విధంగా ఇద్దరికి సమన్యాయం చేయడం జరిగింది. మొదటి ఆరు నెలలు గుండా రవి, తదుపరి ఆరు నెలలు గుడిసె సదానందం పదవి బాధ్యతలు నిర్వహించే విధంగా ఇరువురు అంగీకారం తెలుపనైనది. అందులో భాగంగా నూతన బార్ అసోసియేషన్ కార్యవర్గం తో శుక్రవారం రోజున ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. నూతన కార్యవర్గం సభ్యులుగా అధ్యక్షుడు గుండా రవి, ఉపాధ్యక్షుడు కటకం జనార్ధన్, జనరల్ సెక్రటరీ గడ్డం సత్యనారాయణరెడ్డి, ట్రెజరర్ బొజ్జ మహేందర్ ,స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ గుజ్జే మనోహర్, లైబ్రరీ సెక్రటరీ పంపరి శంకరయ్య, లేడీ రిప్రజెంటివ్ జక్కుల పద్మ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు కనికరపు శ్రీనివాస్, కనపర్తి రాజశేఖర్, తమిరీ అన్నపూర్ణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్లు గుడిపల్లి మహేష్, భూర సరిత, యామ తిరుపతి లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలపై బార్ అసోసియేషన్ అభివృద్ధికి సమస్యల పరిష్కారానికి మా షాయా శక్తుల కృషి చేస్తామని వారి పేర్కొన్నారు.

# పవన్ స్ట్రాటజీ తో జగన్ కు ఇబ్బందులు తప్పవా

విజయవాడ, ఏప్రిల్ 11, జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీని నియోజకవర్గాల్లో బలోపేతం చేయడం మీద కంటే ఎక్కువగా వ్యూహాలపైనే ఆధారపడుతున్నట్లుంది. అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత కూడా పవన్ కల్యాణ్ నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడం, ప్రతి నియోజకవర్గంలో జనసేన ఇన్ ఛార్జులను నియమించకపోవడం వంటివి చేయకపోవడం కూడా వ్యూహంలో భాగమేనని అంటున్నారు. తక్కువ స్థానాలు తీసుకుని అయినా హండ్రెడ్ పర్సెట్ స్ట్రయిక్ రేటును సాధించడమే లక్ష్యంగా ఆయన పనిచేయాలనుకుంటున్నారు. మరొక వైపు చంద్రబాబు నాయుడుతోనూ, ఢిల్లీలోని బీజేపీ పెద్దలతో సయోధ్యగా ఉంటూనే ముందు అనుభవం సంపాదించుకోవాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నట్లుంది.అందుకే అవకాశం ఉన్నప్పుడల్లా చంద్రబాబును తన మాటలతో ఆకాశానికి ఎత్తుతున్నారు. చంద్రబాబు నాయుడు పదిహేనేళ్ల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగాలని చెబుతూ టీడీపీ కార్యకర్తలతో పాటు కమ్మ సామాజికవర్గం ఓటర్లకు కూడా పవన్ కల్యాణ్ దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తుంది. అదే సమయంలో పవన్ కల్యాణ్ నిరంతరం ప్రజల పక్షాన నిలబడతారన్న పేరును ఇప్పటికే తెచ్చుకున్నారు. ప్రధానంగా గిరిజనుల ఓట్లను ఆయన కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. ముఖ్యంగా ఎస్టీ నియోజకవర్గాల్లో వైసీపీ నేటికీ బలంగా ఉంది. అలాంటి చోట తాను తరుచూ పర్యటిస్తూ ఆ గ్రామాల్లో రహదారులను నిర్మించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.పవన్ చేస్తున్న ఈ ప్రయత్నాలతో ఎస్టీ నియోజకవర్గాలు కూటమి పార్టీలకు చేరువయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కూటమి పార్టీల్లోనూ ఎస్టీ నియోజకవర్గాల్లో జనసేన ఈసారి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తుంది.

అందుకే పవన్ కల్యాణ్ తరచూ అరకుతో పాటు అనేక ఏజెన్సీ ఏరియాల్లో పర్యటిస్తూ గిరిజనులతో మమేకం అవుతున్నారు. ఒక్కసారి వారు పార్టీకి కనెక్ట్ అయ్యారంటే ఇక దూరం కారన్న నమ్మకంతో పవన్ కల్యాణ్ ఉన్నారు. ఎస్టీ నియోజకవర్గాల్లో పట్టు సంపాదిస్తే జగన్ ను ఒక వర్గాన్ని దూరం చేసినట్లే అవుతుందని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. ఎటూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన బలంగా ఉన్న నేపథ్యంలో ఎస్టీ నియోజకవర్గాల్లోనే ఆయన ఫోకస్ పెట్టినట్టు కనిపిస్తుంది.దీంతో పాటు వచ్చే ఎన్నికల్లోనూ కూటమి కలసి పోటీ చేయాలని ఆయన భావిస్తున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీలు కలసి పోటీ చేసి ఈసారి అధిక సీట్లు సంపాదించుకోగలిగితే కేంద్రంలోనూ తాను కీలకంగా మారే అవకాశముందని పవన్ కల్యాణ్ అంచనా వేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వంతో ఎటూ తనకు మంచి సంబంధాలు ఉన్నాయి కాబట్టి రాష్ట్రానికి మేలు చేయవచ్చన్న ఆలోచనలో జనసేనాని ఉన్నారు. ఎస్సీ నియోజకవర్గాలపైన కూడా త్వరలోనే పవన్ కల్యాణ్ దృష్టి పెట్టే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తం మీద పవన్ కల్యాణ్ తాను ఒంటరిగా పర్యటిస్తూనే రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయడానికి ఆయన ప్రయత్నిస్తున్నట్లు కనపడుతుంది.

# ఇంకా ఆ ఫీలింగేనా...

విజయవాడ, ఏప్రిల్ 11, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇంకా మారాల్సి ఉంది. గత ఐదేళ్లలో తాను చేసిన తప్పులను ఆయన సమీక్షించుకోవాల్సి ఉంది. ప్రధానంగా జగన్ అధికారంలో లేనప్పుడు అందుబాటులో ఉన్నట్లే అధికారంలో ఉన్నప్పుడు కూడా ఎమ్మెల్యేలకు, ముఖ్య కార్యకర్తలకు చేరువగా ఉండాల్సిన అవసరం ఉంది. గత ఐదేళ్లలో ఎమ్మెల్యేలను చివరకు మంత్రులను కూడా ఆయన కలవలేదు. కనీసం తమ నియోజకవర్గాల సమస్యలను చెప్పుకునేందుకు కూడా ఆయన అవకాశం ఇవ్వలేదు. అంతా ముఖ్యమంత్రి కార్యాలయం మాత్రమే ఎమ్మెల్యేలు, మంత్రులతో డీల్ చేసింది. నాడు ఐఏఎస్ అధికారి ధనుంజయ్ రెడ్డి చెప్పిన ఫీడ్ బ్యాక్ ను మాత్రమే జగన్ పరిగణనలోకి తీసుకున్నారు.అంతే తప్పించి పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలను, నేతలను పట్టించుకోలేదు. కనీసం 2014 నుంచి 2019 ఎన్నికల వరకూ పార్టీ కోసం ఆర్థికంగా నష్టపోయిన వారిని కూడా జగన్ గుర్తించలేదు. వారు తీవ్రంగా నష్టపోయారని తెలుసు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని తెలుసు. కానీ వారిని ఆదుకునే ఏ ఒక్క కార్యక్రమాన్ని కూడా జగన్ చేపట్టలేకపోయారు. జిల్లాలకు వెళ్లినా ఎమ్మెల్యేలు కలిసినా పెద్దగా వారితో మాట్లాడింది లేదు. ముఖ్యమైన కార్యకర్తలు, నేతలను కూడా దూరంగా ఉంచారు. ఐదేళ్ల పాటు వారు ఉన్నారని కూడా జగన్ గుర్తించలేదు. దీంతో మొన్నటి ఎన్నికల్లో తమ పవరేంటో కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నేతలు జగన్ కు రుచి చూపించారు.తాము జగన్ పై అభిమానంతో కులాలను పక్కనపెట్టి పదవులు రాకపోయినా తాము ఇబ్బందులు పడలేదని, కానీ తమను పట్టించుకోకపోవడమే బాధించిందని కార్యకర్తలు చెబుతున్నారు. ఎన్నికలకు ముందు వైసీపీ సోషల్ మీడియా కూడా బలహీనం కావడం కూడా నాటి జగన్ ఓటమికి ఒక కారణంగా చెబుతారు. అంతా ఐప్యాక్ టీం మీద ఆధారపడటం, కోటరీ చుట్టూనే ఆయన తిరుగుతుండటంతో వాస్తవ పరిస్థితులు జగన్ దృష్టికి వెళ్లలేదని, ఎన్ని పథకాలు అమలు చేసినా, ఎన్ని అభివృద్ధి పనులు నియోజకవర్గాల్లో చేసినా చెప్పే వారు లేక గత ఎన్నికల్లో వైసీపీ దారుణంగా దెబ్బతినిందన్న విశ్లేషణలు వెలువడ్డాయి.అదే సమమయంలో జగన్ ఒక్కడే తానే స్టార్ క్యాంపెయినర్ గా వ్యవహరించడం కూడా పార్టీ పరాజయానికి కారణంగా చెబుతారు.జగన్ ఈసారైనా తాను మారాలి. కార్యకర్తలను చేరదీయాలి. వారి ఆర్థిక అవసరాలు తీర్చలేకపోయినా సరే... కనీసం వారు కోరుకునేది ఒక్క పలకరింపు మాత్రమేనని అంటున్నారు. సెక్యూరిటీ రీజన్ పేరుతో తమను దూరం పెడితే వచ్చే ఎన్నికల్లోనూ పరిస్థితుల్లో మార్పులు రాదని హెచ్చరిస్తున్నారు. ఈసారి అధికారంలోకి వస్తే కార్యకర్తలను పట్టించుకుంటానని, వారికి న్యాయం చేస్తానని చెబుతున్నా మళ్లీ కొందరికే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నారన్న విమర్శలు పార్టీలో జోరుగా వినిపిస్తున్నాయి. ఫీడ్ బ్యాక్ ఇవ్వడంలో కార్యకర్తలను మించిన వారు మరొకరు ఉండరు. ఈ విషయం గుర్తుంచుకోపోతే ఈసారి కూడా జగన్ ప్రతిపక్షానికే పరమితం కావాల్సి ఉంటుందన్న హెచ్చరికలు బలంగా వినిపిస్తున్నాయి.

# సలేశ్వరం జాతర షురూ

నాగర్ కర్నూలు తెలంగాణ అమరనాథ్ యాత్రగా గుర్తింపు పొందిన సలేశ్వరం జాతర నేడు ప్రారంభమైంది. నేటి నుంచి మూడు రోజులపాటు నల్లమల అభయారణ్యంలోని సలేశ్వరం జాతర జరగనుంది. వస్తున్నాం లింగమయ్యా అంటూ పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు. లోయ గుహలో వెలసిన లింగమయ్యను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరానున్నారు. అయితే గతంలో జరిగిన ప్రమాదాలు, అభయారణ్యంలోని వన్యప్రాణుల సంరక్షణ దృష్ట్యా జాతరకు మూడు రోజులు మాత్రమే భక్తులకు అనుమతి ఇస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ నెల 13వ తేదీ వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులను అడవిలోకి అనుమతించనున్నట్టు అధికారులు ప్రకటించారు. హెల్త్, ఇతరత్రా శాఖల సిబ్బంది కొరతను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది మూడు రోజులు పాటు మాత్రమే జాతరకు అనుమతిని ఇస్తున్నామని చెప్పారు. సలేశ్వరంలో లింగమయ్యను దర్శించుకోవాలంటే భక్తులు కిలోమీటర్ల మేర కాలినడకన కొండలు, గుట్టలు దాటుకుంటూ సలేశ్వరం గుడివద్దకు సాహసయాత్ర చేయాల్సి ఉంటుంది. ప్రకృతి రమణీయతను ఆస్వాదించడానికి, పుణ్యక్షేత్రముగా ప్రసిద్ది గాంచిన సలేశ్వరం జాతర పేరుతో సంవత్సరానికి ఒక్కసారే అనుమతి ఇస్తున్నారు. అయితే.. ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తుంటారు.

# పి.గన్నవరంలో రెండు వర్గాల కొట్లాట!

రాజమండ్రి, ఏప్రిల్ 11, మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి రెండు రిజర్వుడు అసెంబ్లీ స్థానాల్లో పోటీచేసి ఘన విజయం సాధించింది జనసేన పార్టీ. అయితే ఈ రెండు నియోజకవర్గాల్లో ప్రస్తుతం ఒకటే రచ్చ సాగుతోంది. పార్టీలో అంతర్గత వర్గ విభేధాలు నివురు గప్పిన నిప్పులా రాజుకుంటున్నాయి. పి.గన్నవరం నియోజకవర్గం అయినవిల్లి మండలంలో మాత్రం ఒక్కసారిగా బ్లాస్ట్ అయ్యింది. పార్టీలోని రెండు వర్గాలు ఇటీవల కాలంలో బహిరంగంగానే బాహాబాహీలకు దిగ?గా ఈసారి ఏకంగా ఓ కుటుంబంపై దాడులు చేసి తీవ్రంగా గాయపర్చారు. అయితే దీనిపై ముందు నుంచి పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆచితూచి వ్యవహరిస్తుండగా ఈ అలసత్వంతోనే పార్టీలో ఈపరిస్థితి దాపురించిందని పలువురు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మండిపడుతున్నారట. జనసేన పార్టీ ఆవిర్భవించాక తొలి విజయం రుచి చూపించిన రాజోలు నియోజకవర్గంలో కూడా వర్గపోరు తారాస్థాయికి చేరిందని తెలుస్తోంది. ముందు నుంచి పార్టీలో ఉంటూ కష్టపడ్డవారు దూరం జరగ్గా మొన్నటి వరకు వైసీపీలో చక్రం తిప్పి ఇప్పుడు పార్టీలో చేరి పెత్తనం చెలాయిస్తున్నారని కొందరు జనసేన నేతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ కూడా ఎమ్మెల్యే కరవమంటే కప్పకు కోసం విడవమంటే పాముకు కోపం అన్న చందంగా దాటవేత ధోరణి స్థానిక ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ వ్యవహరిస్తున్నారంటూ మరికొందరు మండిపడుతున్నారు. ఈనేపథ్యంలోనే గత కొంతకాలంగా పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు.. ఇటీవలే పి.గన్నవరం నియోజకవర్గంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశం రసాభాసగా మారింది. కార్యకర్తలు రెండు వర్గాలుగా విడిపోయి.. మాటల తూడాలు పేల్చుకున్నారు. ఇదంతా ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సమక్షంలోనే జరగడం చర్చనీయాంశమైంది. అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల నియామకంపై చర్చించేదుకు అంబాజీపేట, అయినవిల్లి మండలాలకు చెందిన టిడిపి, జనసేన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సమావేశం అయ్యారు. అయినవిల్లి పార్టీ అధ్యక్షుడు పోలిశెట్టి రాజేష్ ఏకపక్షంగా వ్యవహిరిస్తున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే ఇదే మండలానికి చెందిన తోలేటి ఉమా, పోలిశెట్టి రాజేష్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.. దీంతో ఆదివారం అర్ధరాత్రి రాజేష్ తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి ఉమా ఇంట్లోకి మారణాయుధాలతో ప్రవేశించి ఉమాతో పాటు అడ్డువచ్చిన ఆ ఇంట్లో. మహిళలపై దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఉమా తల పగిలిపోగా, మహిళలకు గాయాలయ్యాయి. బాధితుల్ని వైద్యం కోసం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఉమా అనుచరులు కూడా రాజేష్‌కు చెందిన కారుపై దాడి చేసి అద్దాలు ధ్వంసం చేశారు. రాజేష్ ఆయన అనుచరులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు పోలీసులు. రాజేష్ కుటుంబికులు ఇచ్చిన ఫిర్యాదుపై ఉమ, అతని వర్గీయులపై మరో కేసు నమోద?ంది. అయితే ఇదంతా జరగడానికి ఎమ్మెల్యే నాన్చుడు ధోరణి, వర్గ విభేదాలపై కఠిన చర్యలు తీసుకోకపోవడమే కారణమని జనసేన పార్టీలోని సామాన్యకార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..జనసేన పార్టీలో పిఠాపురం నియోజకవర్గంలో ఎంత కీలకమో.. రాజోలు నియోజకవర్గం కూడా అంతే కీలకం.. ఎందుకంటే అక్కడ జనసేన పార్టీ రెండోసారి ఘన విజయం సొంతం చేసుకుంది. అయితే ఇక్కడ వర్గ విభేధాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. పార్టీ అధిష్టానం జనసేన పార్టీ అభ్యర్థిగా దేవా వర ప్రసాద్‌ను ప్రకటించిన నాటి నుంచి ఆయన గెలుపు వరకు కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలు ప్రస్తుతం ఆయన వెంట లేకపోవడం స్థానికంగా పెద్ద చర్చ జరుగుతోంది. పార్టీ గెలుపులో కీలకంగా వ్యవహరించిన ఎన్ ఆర్ ఐ యనుమల వెంకటపతిరాజు ముందు నుంచి పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తుండగా ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వైసీపీలో పనిచేసిన వారినే ఎమ్మెల్యే వెంట పెట్టుకుని తిప్పుకుంటున్నారన్న బాధ చాలా మంది జనసైనికుల్లో కనిపిస్తోందంటున్నారు. అయితే ఇటీవలే యనుమల వెంకటపతిరాజు సోషల్ మీడియాలో చేసిన పోస్టు తీవ్ర దుమారాన్ని రేపుతోంది. తాను ఇండియా వస్తే తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ తప్పుడు కేసు బనాయించి తనను ఇబ్బంది పెట్టాలని ఎమ్మెల్యే చూస్తున్నారని ఆయన చెప్పకురావడంతో మరింత చర్చనీయాంశం అయ్యింది..రాజోలులో సామాజిక కార్యకర్తగా యనుమల వెంకటపతిరాజుకు మంచి పేరుంది. ఇది పార్టీకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని చాలా మంది బాహాటంగా చెప్పుకుంటున్నారు. మొత్తం మీద అంబేద్కర్ కోనసీమ జిల్లాలో పోటీచేసి గెలిచిన పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో మాత్రం వర్గ విభేదాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి..

# జగన్ ఎందుకో..అలా



కడప, ఏప్రిల్ 11,అంత రచ్చ అయింది. ఎస్పైతో మాటలు అనిపించుకోవాల్సి వచ్చింది. పోలీస్ అధికారుల సంఘంతో మాటలు పడాల్సి వచ్చింది. అయినా.. మాజీ సీఎం తగ్గేదేలే అంటున్నారు. నాలుగో సింహాలను గిల్లడం ఆపట్లేదు. రాప్తాడు కామెంట్ల కలకలం కొనసాగుతుండగానే.. లేటెస్ట్‌గా కర్నూలు పార్టీ శ్రేణుల మీటింగ్‌తో మరోసారి కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు. పోలీసులను కూటమి ప్రభుత్వం వాచ్‌మెన్ల కంటే ఘోరంగా వాడుకుంటోందని అన్నారు.జగన్ కావాలనే రచ్చ కంటిన్యూ చేస్తున్నారా? పోలీసులను అంటే ఏమొస్తుంది? బట్టలూడదీస్తా, ఉద్యోగాలు తీసేస్తా.. అని బెదిరించాల్సిన అవసరం ఏమొచ్చింది? సీఎంగా చేసిన నేత.. ఓ ఎస్పైని టార్గెట్ చేసి తన స్థాయిని తానే తగ్గించుకున్నారా? వాచ్‌మెన్లు అని ఆ మంటను అలానే రగిలిస్తున్నారా? ఇదంతా జగన్ కావాలనే చేస్తున్నారా? ఆయన మాటల వెనుక వ్యూహం దాగుందా? ఇలా రకరకాల చర్చ నడుస్తోంది.జగన్ హయాంలో ఐపీఎస్ ఆఫీసర్ ఏబీ వెంకటేశ్వరరావును ఎంతగా వేధించారో అందరికీ తెలిసిందే. ఆనాటి చంద్రబాబు పాలనలో ఐబీ చీఫ్‌గా ఉన్నారనే కక్ష్యతో.. అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపిస్తూ.. ఆ ఐదేళ్లూ ఖాకీ యూనిఫాం వేసుకోనీయకుండా టార్చర్ చేశారు. జీతం కూడా రాకుండా కట్టడి చేశారు. కోర్టు తీర్పులనూ కేర్ చేయలేదు. ఏబీవీ మాత్రం తన పోరాటం ఆపలేదు. సుప్రీంకోర్టు చుట్టూ తిరిగి.. గౌరవంగా రిటైర్ అయ్యారు. జగన్ తీరుపై ఆనాడే డిపార్ట్‌మెంట్లో, ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వచ్చిందిఅటు.. దుందుడుకు స్వభావం ఉన్న గోరంట్ల మాధవ్‌ను ఎంపీగా చేసి ఐదేళ్లూ ఆయనకు అండగా నిలిచారు. బూతు వీడియోలు వైరల్ అయినా పట్టించుకోలేదు. అటు, రఘురామ కస్టోడియల్ టార్చర్ ఎపిసోడ్‌లో సీఐడీ చీఫ్ సునీల్ కుమార్‌ను బాగా వాడేసుకున్నారని అంటారు. ముంబై హీరోయిన్‌ను వేధించిన కేసులో ముగ్గురు పోలీస్ అధికారులను బలిపశువులను చేశారని చెబుతారు. ఐపీఎస్ సీతారామాంజనేయరెడ్డి అయితే అప్పుడూ ఇప్పుడూ పూర్తిగా జగన్ మనిషే అంటారు. డిపార్ట్‌మెంట్‌ను జగన్ వాడుకున్నట్టు మరెవరూ మిస్ యూజ్ చేయలేదని చెబుతుంటారు. అలాంటి జగనే.. ఇప్పుడు పోలీసుల బట్టలూడదీస్తా అని.. వారిని వాచ్‌మెన్లుగా చూస్తు?న్నారని అనడం విచిత్రంగా ఉందని టీడీపీ మండిపడుతోంది. ఖ4 సుపరిపాలన నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే.. పోలీసుల్లో అభద్రతా భావం తీసుకొచ్చేందుకే.. జగన్ ఇలా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అనుమానిస్తు?న్నారు తెలుగు తమ్ముళ్లు.

## హనుమంతుడు లేని రామాలయం...

## ఒంటిమిట్ట శ్రీరాముడు

కడప, ఏప్రిల్ 11, రామాలయం లేని ఊరు.. హనుమంతుడు లేని రాములోరి ఆలయం ఉండదనేది పెద్దలు చెప్పే మాట. కానీ హనుమంతుడు లేని రామాలయం ఒకటుందని.. అది కూడా మన ఆంధ్రప్రదేశ్‌లో కొలువై ఉందని తెలుసా.. అదే వైఎస్ఆర్ కడప జిల్లాలోని ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయం. అన్ని ఆలయాల్లో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వాములు దర్శనమిస్తే.. ఇక్కడ మాత్రం ఆంజనేయస్వామి ఉండరు. దాని వెనుక కూడా ఆసక్తికరమైన కథ ఉంది. ఆంజనేయస్వామిని కలవకముందే.. ఈ ప్రాంతంలో శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు సంచరించారని.. అందుకే ఆలయంలో ఆంజనేయుడి విగ్రహం ఉండదనేది స్థానికులు చెప్పే మాట.ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో ఒకే శిలపై సీతారామ లక్ష్మణ దేవతామూర్తుల విగ్రహాలు ఉంటాయి. అందుకే ఒంటిమిట్టను ఏకశిలానగరం అని కూడా పిలుస్తారు. త్రేతాయుగంలో సీతాలక్ష్మణ సమేతుడైన శ్రీరాముడు దండకారణ్యంలో సంచరిస్తూ ఇక్కడకు వచ్చారని పురాణాలు చెప్తున్నాయి. ఆ సమయంలో సీతాదేవికి బాగా దప్పిక వేసిందని.. సీతాదేవి దప్పిక తీర్చేందుకు శ్రీరాముడు భూమిలోనికి బాణం వేస్తే నీటిబుగ్గ పుట్టిందని పురాణాల్లో ఉంది. అదే ఒంటిమిట్ట రామతీర్థం అయ్యిందని చెప్తుంటారు.ఇక ఈ ఆలయం పేరుపైనా అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. కోదండరామస్వామి ఆలయాన్ని మిట్టమీద నిర్మించారని.. అందుకే ఒంటిమిట్ట రామాలయం అని పేరు వచ్చిందని కొంతమంది చెప్తుంటారు. అయితే ఒంటుడు, మిట్టుడు అనే ఇద్దరు రామభక్తులు ఈ గుడిని నిర్మించారని.. వారి పేరుమీద ఒంటిమిట్ట రామాలయం అయ్యిందనేది మరో వాదన. సీతారాముల కల్యాణం తర్వాత మృకండ మహర్షి, శృంగి మహర్షి యాగ రక్షణ కోసం శ్రీరామలక్ష్మణులు ఇక్కడకు వచ్చారని.. అందుకు ఆ మహర్షులు సీతారామ లక్ష్మణుల విగ్రహాలను ఇక్కడ ఏర్పాటు చేయించారని మరో కథనం. ఆ విగ్రహాలకు తర్వాత కాలంలో జాంబవంతుడు ప్రాణ ప్రతిష్ట చేశాడని మరికొందరి నమ్మకం.ఒంటిమిట్ట రామాలయంలో సీతారాముల కళ్యాణం రాత్రి వేళ ఎందుకు జరుగుతుందనే దానికి కూడా ఆసక్తికరమైన కథ ఉంది. అది కూడా శ్రీరామనవమి రోజున కాకుండా చైత్ర శుద్ధ పౌర్ణమి రాత్రి జరుగుతుంది. పురాణాల ప్రకారం విష్ణుమూర్తి, లక్ష్మీదేవి వివాహం పగలు జరిగినప్పుడు, చంద్రుడు తన సోదరి లక్ష్మీదేవి పెళ్లిని చూడలేకపోయానని విష్ణువుతో మొరపెట్టుకున్నాడట. దీంతో "నీ కోరిక రామావతారంలో తీరుతుంది" అని మహా విష్ణువు వరమిచ్చాడు. ఆ ప్రకారం ఒంటమిట్టలో సీతారాముల కళ్యాణం వెన్నెల వెలుగుల్లో నిర్వహిస్తారు. ఇక ఒంటిమిట్ట ఆలయ గోపురాలు చోళ శైలిలో, రంగమంటపం విజయనగర శిల్పకళా వైభవాన్ని ప్రతిబింబిస్తాయి. 32 స్తంభాలతో కూడిన రంగమంటపం, 160 అడుగుల ఎత్తైన గోపురం దీని సౌందర్యాన్ని

# పట్టణాల్లో పెరిగిన ఆస్తి పన్ను

కాకినాడ, ఏప్రిల్ 11, ఆంధ్రప్రదేశ్ పట్టణాలలో ఆస్తి (ఇంటి) పన్నులు పెరగడం వల్ల ప్రజలపై రూ. 320 కోట్లకు పైగా భారం పడుతోందని పట్టణ పౌర సమాఖ్య ఆరోపించింది. గత ఐదు సంవత్సరాలలో 100% పన్ను భారం పెరిగిందన్నారు. మోడీ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని వైసీపీ సర్కార్ ప్రవేశపెట్టిందని, పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్ను పెంచబోమని మాట ఇచ్చి, కూటమి ప్రభుత్వం తప్పిందని ఆరోపించారు.ఏపీలో మరోసారి గుట్టు చప్పుడు కాకుండా పన్ను పెంచారని, ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన విధంగా పన్ను పెంపు రద్దు చేయాలని, ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానం చట్టం, జీవో రద్దు చేయాలని, ఆస్తి పన్ను పెంపుపై రాష్ట్ర వ్యాప్త ఆందోళన చేపడతామని పట్టణ పౌర సమాఖ్య హెచ్చరించింది.2025బి 26 సంవత్సరాలకు సంబంధించి రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలలో ఆస్తి( ఇంటి) పన్నును గుట్టు చప్పుడు కాకుండా ప్రభుత్వం పెంచిందని, గత సంవత్సరంతో పోల్చితే 15%, 2020బి21 సంవత్సరంతో పోలిస్తే 30% ఇంటి పన్ను పెరిగిందని పౌర సమాఖ్య కన్వీనర్ బాబురావు వివరించారు. దీనివలన 320 కోట్ల రూపాయల భారం గృహ యజమానులపై పడుతుందని, 2020వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయి నాటి వైసిపి ప్రభుత్వం అద్దె విలువ ఆధారిత పన్ను విధానం స్థానంలో ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆరోపించారుప్రజలు వ్యతిరేకించినా చట్ట సవరణ చేసిందని, దానికనుగుణంగా జీవో 198 విడుదల చేసిందని ప్రతి సంవత్సరం 15% పన్ను పెంచే విధంగా ఆదేశాలు ఇచ్చారని ఆరోపించారు. 2021-22 ఆర్థిక సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం 15% పన్ను పెంచుతూ వచ్చారని, దానిపై పౌర సంఘాలు ఎన్నో ఆందోళనలు చేసినా గత ప్రభుత్వం లెక్క చేయలేదన్నారు.ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి ఆస్తి విలువ ఆధారిత పన్ను విధానాన్ని సమీక్షిస్తామని, పన్నులు పెంచబోమని హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలో పేర్కొన్నారని, 2024-25 సంవత్సరంలో కూడా పన్ను పెంపు కొనసాగిందని, 2024 ఏప్రిల్ నుండే పన్నులు పెరిగినందున, ఆ సంవత్సరం తగ్గించలేకపోయామని కూటమి ప్రజాప్రతినిధులు ప్రకటించారని గుర్తు చేశారు. ఈ సంవత్సరం పన్నుల పెంపుదల ఉండదని ప్రజలందరూ భావించారని, కానీ 2025 బి26 ఆర్థిక సంవత్సరానికి గుట్టు చప్పుడు కాకుండా పన్నులు పెంచడం శోచనీయమన్నారు.ఆన్ లైన్ లో పన్ను పెంచుతూ డిమాండ్ రూపొందించారని కూటమి ప్రభుత్వం మాట తప్పిందని, ప్రజలకు నమ్మకద్రోహం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలు భారాలు మోయలేని స్థితిలో ఉన్నారని, భారాలు వేయబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు పదేపదే ప్రకటించారు. కానీ దానికి భిన్నంగా ఒకేసారి 320 కోట్ల రూపాయల భారం వేయటం గర్హనీయమ్నారు.2020-21 సంవత్సరంతో పోలిస్తే ఇప్పటికీ 100% పన్నులు పెరిగాయి. గతంలో ఐదు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే పన్ను పెంపుదల ఉండేది. కానీ 5 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం పన్నులు పెంచడం దుర్మార్గమన్నారు. ప్రతి సంవత్సరం స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ విలువల కొరకు భూముల విలువలను ప్రభుత్వం పెంచుతున్నది. దీని ఆధారంగా ఇంటి పన్నులు నిరంతరం పెరుగుతూనే ఉంటాయి. ఈ పన్నుల పెంపు భారం గృహ యజమానులపైనే కాకుండా పరోక్షంగా అద్దెదారులపై కూడా పడుతుందన్నారు.మరోవైపు కొత్తగా ఇళ్ళు, భవనాలు నిర్మించుకునేవారు, గదులు అదనంగా కట్టుకునే వారిపై పూర్తి ఆస్తి విలువ ఆధారంగా ఇంటి పన్ను వేస్తున్నారు. సవరిస్తున్నారు. దీంతో మరింత భారం పడుతున్నదన్నారు.ప్లాన్ ప్రకారం ఇళ్ల నిర్మాణాలు జరగలేదని, అదనపు కట్టడాలు నిర్మాణం జరిగాయని పేరు చెప్పి,ఃఖీ లో రెగ్యులరైజ్ అయిన వాటిని అక్రమ కట్టడాలుగా గుర్తించి ఇంకా అదనంగా 50% పన్ను వేస్తున్నారు. ఈ రూపంలో 100 % నుండి 500% వరకు కొన్ని పట్టణాల్లో కొంతమందికి పన్నులు పెరిగాయన్నారు.పన్ను చెల్లింపు ఒక నెల ఆలస్యమైనా 24 శాతం వడ్డీ.. పెనాల్టీ రూపంలో వసూలు చేయటం అన్యాయమని 30 శాతం వరకు ఇంటి పన్ను పెంచి ఈ నెలాఖరు లోపల పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వటం మోసపూరితమని ఆరోపించారు. పన్ను పెంచిన విషయం మరుగుపరిచి ,ఐదు శాతం రాయితీ గురించి చెప్పటం వంచించటమేనని పన్నులు పెరిగాయని గుర్తించాలనన్నారు.తక్షణమే ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని పెంచిన పన్ను రద్దు చేయాలి. విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం పూర్తిగా చట్టం 44/2020, జీవో 198 రద్దు చేయాలి. హామీ నిలబెట్టుకోవాలని, పలు పట్టణాల్లో గత నాలుగైదు ఏళ్లలో అడ్డగోలుగా పెంచిన పన్నులపై సమీక్ష చేయాలి. గతంలో జరిగిన తప్పులను సవరించాలని డిమాండ్ చేశారు.

# ఆ ముగ్గురి మౌనం...దేనికి సమాధానం

శ్రీకాకుళం, ఏప్రిల్ 11, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా వైసీపీలో ఆ ముగ్గురు అన్నీ తామే అన్నట్లు వ్యవహరించారు. దశాబ్దాల రాజకీయ అనుభవం ఉన్న ఆ ముగ్గురు సీనియర్లు పార్టీ అధికారంలో ఉన్నంత కాలం గట్టిగానే చక్రం తిప్పారు. రాజకీయాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్న ఆ దిగ్గజాలు గత ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇంటి గడప దాటకపోతుండటం చర్చనీయాంశంగా మారింది. సడన్‌గా ధర్మాన సోదరులు, తమ్మినేని సీతారాంకి అంత రాజకీయ వైరాగ్యం ఎందుకొచ్చింది?.ఎన్నికలు వస్తుంటాయి.. పోతుంటాయి. పార్టీలు గెలుస్తాయి, ఓడిపోతాయి. ఒకప్పుడు పరాజయం పాలైన పార్టీల నేతలు పవర్‌లోకి రావడానికి పట్టుదలతో పావులు కదిపేవారు. కానీ ప్రస్తుతం రాజకీయాలు బాగా మారిపోయాయి. రాజకీయనాయకులు అధికారంలో ఉంటే ఒకలాగా.. లేకపోతే మరోలాగా వ్యవహారిస్తున్నారు . అధికారంలో ఉన్నప్పుడు అన్నిభోగాలు అనుభవించిన నాయకులు అధికారం లేకపోయేసరికి ప్రజలకు, పార్టీ శ్రేణులకు ముఖం చాటేసి తిరుగుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో వైసీపీ నేతల పరిస్థితి అదే విధంగా తయారైంది.2019 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలలో తొమ్మిది నియోజకవర్గాలను వైసీపీ కైవసం చేసుకుంది. అధికారం చెలాయించిన వైసీపీలో ఎక్కడ చూసినా అన్నీ తామే అనేలా వ్యవహరించిన సిక్కోలు జిల్లా బడా నేతలు .. మొన్నటి ఎన్నికలో ఓడిపోయేసరికి ఒక్కసారిగా.. పిన్‌డ్రాప్ సైలెన్స్ మెయిన్‌టెయిన్ చేస్తున్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ ముఖ్యమంత్రి హోదాలో జిల్లా పర్యటనకు వచ్చినప్పుడు నియోజకవర్గంతో తేడా లేకుండా ఆ బడా నేతలే అయనకి కుడి పక్క.. ఎడమ పక్క దర్శనమిచ్చేవారు. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభంజనంలో వైసీపీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో తుడిచి పెట్టుకుపోయింది.అప్పటి దాకా రాజసం వెలగబెట్టిన మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాస్, సిదిరి అప్పలరాజులతో పాటు అప్పట్లో స్పీకర్‌గా పనిచేసిన తమ్మినేని సీతారాంలు ఒక్కసారిగా సైలెంట్ అయిపోయారు. అసలు రాజకీయాల్లో ఉన్నారా? లేదా ? అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దాంతో బలం అనుకున్నవారే బలహీనులుగా మారారనీటూ సొంత పార్టీ వారే పెదవి విరుస్తున్నారు. ఆశలు పెట్టుకున్న నేతలే పార్టీకి భారంగా మారుతున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు. పార్టీ కోసం వారు పనిచేయరు ..ఇంకెవరినీ పనిచేయనీయడం లేదని తెగ ఫీల్ అయిపోతున్నారు.నాడు వైసిపి అధికారంలో ఉండగా పదవులు అనుభవించిన నేతలే , నేడు పార్టీ కష్టకాలంలో దూరంగా ఉండటం తీవ్ర విమర్శల పాలవుతోంది. శ్రీకాకుళం జిల్లా రాజకీయాలలో ఉద్దండులుగా పేరున్న ధర్మాన సోదరులు , తమ్మినేని సీతారాం.. ఈ ముగ్గురు వైసిపికి బలం. సామాజికంగా , ఆర్థికంగా బలమైన పునాదులు ఉన్న నేతలు. ఎన్నో దశాబ్దాలుగా రాజకీయాలు నెరుపుతూ వస్తున్నారు. ఎన్నో ఆటుపోట్లు చవి చూసారు. ఐతే 2024 సార్వత్రిక ఎన్నికల తరువాత మాత్రం ఈ ముగ్గురు నేతలు వైసీపీని పట్టించుకోవడమే మానేశారంట.మరీ ముఖ్యంగా మాజీ మంత్రి ధర్మాన ప్రసాధరావు అసలు రాజకీయాలకే దూరంగా ఉంటున్నారు. కనీసం పార్టీ లీడర్స్‌కు కూడా అందుబాటులో ఉండటం లేదంట . ధర్మాన ప్రసాధరావు తిరిగి పోలిటికల్ గా యాక్టివ్ అవుతారో లేదో కూడా తెలియదు అంటున్నారు ఆయన అనుచరులు . తన మనసులో ఏం ఉందో బయటకు చెప్పడం లేదంట ధర్మాన ప్రసాదరావు. గత ప్రభుత్వంలో కీలక రెవెన్యూ శాఖ ను నిర్వహించారు. ఎన్నికల సమయంలో నిర్వేదంతో మాటాడిన ధర్మాన , రాజకీయాలలో కొనసాగాలని లేదని వైరాగ్యం ప్రదర్శించారు. దానికి తగ్గట్లే కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లెత్తు మాటాడటం లేదు.మరో వైపు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం సైతం పోలిటికల్ మీటింగ్స్ కు , కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. కోద్ది రోజుల క్రింతం మీడియా ముందుకు వచ్చిన తమ్మినేని కుటుంబంలో ఆరోగ్యపరమైన ఇష్యూల కారణంగా దూరంగా ఉంటున్నానని తెలిపారు. దీంతో కొంత క్లారిటీ ఇచ్చినట్లు అయినా , ఆయన ప్రాతినిధ్యం వహించిన ఆమదాలవలస నియోజకవర్గం వైసపీ ఇంచార్జ్ పదవి చింతాడ రవికుమార్ కు కట్టబెట్టడంతో తమ్మినేని అధిష్టానం పెద్దలపై కినుక వహించారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.మరో కీలకనేత వైసిపి ఆవిర్భావం నుంచీ పార్టీలో ఉంటూ అధినేత జగన్ కు నమ్మిన బంటుగా పేరుపడ్డ ధర్మాన కృష్ణదాస్ . వైసీపీ అధికారంలో ఉండగా డిప్యూటి సిఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆయన్ని జగన్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించారు. అయితే వైసిపి అధినాయకత్వం పిలుపునిచ్చే కార్యక్రమాలను ఏదో చేసాం అంటే చేసాం అన్నట్లు ధర్మాన కృష్ణదాస తూతూ మంత్రంగా కానిచ్చేస్తున్నారంట. జిల్లా కేంద్రంలో పార్టీకి కనీసం నిలువ నీడలేదంట. గతంలో రెండు మూడు చోట్ల ఆఫీసులు నిర్వహించిన వైసిపికి ఇప్పుడు శ్రీకాకుళంలో కార్యాలయమే లేకుండా పోయింది.కూటమి ప్రభుత్వం ఏర్పాడ్డాక వైసీపీ మార్క్ కార్యక్రమం ఒక్కటంటే ఒక్కటి కూడ నిర్వహించలేదంట జిల్లాలో . వైసిసి కార్యకర్తలపై దాడులు జరుగుతున్నా పట్టించుకునే నాధుడు లేడంటూ ఆవేదన చెందుతున్నారు ద్వితీయ శ్రేణి నేతలు. ధర్మాన కృష్ణదాస్ పార్టీకి లాయల్ అంటూ మాటాడటం మినహా , పార్టీ బలోపేతానికి చేసింది శూన్యం అంటున్నారు సొంతపార్టీ నేతలు. ఇలా ఈ ముగ్గురు కీలక నేతలు గడప దాటకపోవడంతో క్యాడర్ నిరుత్సాహానికి గురౌతున్నారటఅధికారంలో ఉన్నప్పుడు అంతా తామే అన్నట్లు వ్యవహరించిన ఈ సీనియర్ నేతలు , నేడు పార్టీ ఇబ్బందులలో ఉండగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లడం ఏంటని కార్యకర్తలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వయోభారం, ఆరోగ్య సమస్యలతో రాజకీయాలు వద్దనుకుంటే రిటైర్‌మెంట్ ప్రకటించాలని.. అప్పుడు పార్టీకి కొత్త నాయకత్వం దొరుకుతుందని క్యాడర్ అభిప్రాయపడుతోంది. అంతే కాని ఏదీ చెప్పకుండా, సైలెంట్‌గా ఉండిపోతే తమ పరిస్థితి ఏంటని కార్యకర్తలు మండిపడుతున్నారు.

## సీపీఎం నేతలతో కవిత భేటీ



హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్ లోని ఎంబి భవన్ లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తో ఎమ్మెల్సీ కవిత భేటీ అయ్యారు. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటుకై సిపిఎం మద్దతు కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, జాగృతి , బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి. అన్ని వర్గాలు, రాజకీయ పార్టీల మద్దతు కోరుతున్నాము.. బహుజనుల ప్రతీకగా అసెంబ్లీ లో పూలే విగ్రహం ఏర్పాటు కోసం జాగృతి అనేక కార్యక్రమాలు చేస్తున్నాము. రౌండ్ టేబుల్ సమావేశాలు, జిల్లాల్లో సమావేశాలు నిర్వహించాం. పూలే విగ్రహ ఏర్పాటు కోసం అన్ని వర్గాల ప్రజల మద్దతు కుడగడుతున్నం. 42 శాతం బిసి బిల్లుకు కేంద్రం ఒప్పుకునేలా రాష్ట్ర ముఖ్యమంత్రి అఖిల పక్షం ఢిల్లీకి తీసుకు వెళ్లాలని డిమాండ్ చేస్తున్నాం. రాష్ట్రప్రభుత్వం కులగణన వివరాలు వెల్లడించాలని అన్నారు.సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ భారతదేశంలో అణగారిన వర్గాల కొరకు పూలే పోరాడారు. కుల అసమానతలు మన దగ్గర ఇండియాలో ఎక్కువగా ఉన్నాయి. కేంద్రంలో మనువాదము అధికారంలో కొనసాగుతుంది. అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహ ఏర్పాటుకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తుంది. కులగణన వివరాలు రాష్ట్రప్రభుత్వం వెల్లడించాలి. కేంద్రం కులగణనకు వ్యతిరేకం. జాగృతి న్యాయమైన డిమాండ్లకు సిపిఎం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నుమని అన్నారు.

# శ్రీ ఆంజనేయం ప్రసన్నాంజనేయం

## -నేడు హనుమాన్ జన్మోత్సవం

## మన పండుగల్లో హనుమాన్ జయంతి ముఖ్యమైంది.




హనుమంతుని జయంతిని చైత్ర శుద్ధ పౌర్ణమి నాడు జరుపుకుంటారు. ఈ రోజున హనుమద్భక్తులు రోజంతా ఉపవాసముండి, హనుమన్ చాలిసా పఠనం, రామనామ జపం చేస్తారు హనుమంతుని జన్మవృత్తాంతం శివమహాపురాణం, రామాయణం, పరాశర సంహిత మొదలైన గ్రంథాలలో అనేకానేక గాధలతో వివరించబడి వుంది .హిందూ పురాణ కథల ప్రకారం పుంజికస్థల అనే అప్సరస అంజన అనే వానర కాంతగా జన్మించెను. కేసరి అనే వానరవీరుడు ఆమెను పెళ్ళాడెను. వారు సంతానము కొరకు భక్తితో శివుని ఆరాధించిరి. అప్పుడు వాయుదేవుడు శివుని తేజమును పండు రూపములో అంజనకొసగెను. అంజనకు జన్మించిన సుతుడే ఆంజనేయుడు. కేసరి నందనుడనీ, వాయుదేవుని అనుగ్రహముతో జన్మించినందున వాయుసుతుడనీ కూడా అంటారు.

ఈ పండుగ ద్వైత సంప్రదాయము ననుసరించి మాధ్యులకు ప్రధానమైనది. వారు హనుమంతుని 'ముఖ్య ప్రాణ దేవరు' అని పిలుస్తారు. హనుమంతుని ఉపాసకులు కూడా ఈ పండుగ జరుపుకుంటారు. శ్రీరామనవమితో పాటు కొందరు ఈ జయంతి జరుపుటను కూడా ఉంది.పరాశర సంహిత అనే గ్రంథం ప్రకారం ఆంజనేయుడు వైశాఖ బహుళ దశమి, శనివారం జన్మించారని తెలిపారు. అదే రోజున కొంతమంది హనుమజ్జయంతి జరుపుకుంటారు అయితే కొన్ని ఐతిహ్యాల ప్రకారం చైత్ర పౌర్ణమి నాడు నికుంభుడు తదిరత రాక్షసులను సంహరించి హనుమంతుడు విజయం సాధించినట్లు కనిపిస్తుంది. ఈ కారణంగా ఆ రోజు హనుమద్ విజయోత్సవం చేసుకునే సంప్రదాయం కొన్ని చోట్ల ఉంది. దీన్ని ఉత్తరాదిలో హనుమజ్జయంతిగా చేసుకుంటారు.

జన్మ వృత్తాంతము:

ఒకసారి దేవలోకమందు దేవేంద్రుడు కొలువుతీరి యున్న సమయాన పుంజికస్థల అను అప్సరసకాంత బృహస్పతి వద్దకు చేరి హాస్య ప్రసంగము చేయసాగిందట, ఆమె యొక్క హావభావ వికారాలకు బృహస్పతి మిక్కిలి ఆగ్రహించి నీవు భూలోకమందు "వానరస్త్రీ" గా జన్మింతువుగాక! అని శాపము పెట్టినాడు. అంత ఆ పుంజికస్థల తన తప్పిదాన్ని మన్నించి శాపవిమొచనమీయమని పరిపరి విధముల ప్రార్థించింది. దానికి బృహస్పతి సంతసించి నీవు భూలోకమందు "హనుమంతునికి" జన్మ ఇచ్చిన తరువాత తిరిగి దేవలోకమునకు రాగలవని అనుగ్రహించెను. ఇది కంబరామాయణ గాథలో గల వృత్తాంతము. ఆ శాపకారణంగా "పుంజికస్థల" భూలోకమందు వానరకన్యగా జన్మించి "కేసరి" అను అందమైన వానరాన్ని ప్రేమించి వివాహమాడింది. అంత ఆమె గర్భముదాల్చి శివాంశ సంభూతుడైన "శ్రీ ఆంజనేయస్వామి" కి జన్మ ఇచ్చింది.

మనోజవం మారుతతుల్య వేగం జితేంద్రియంబుద్ధిమతాంవరిష్టం।
వాతాత్మజం వానరయూథ ముఖ్యం
శ్రీరామ దూతం శరణం ప్రపద్యే॥

భావము:- మనస్సుని జయించినవాడు, గాలి వేగంతో పయనించేవాడు, పంచేంద్రియాలను తన అధీనంలో ఉంచుకున్నవాడు,గొప్ప తెలివిగలిగినవాడు, వానరులలో ముఖ్యుడు, శ్రీ రామచంద్రునకు దూత అయిన హనుమంతునికి ప్రణామం చేస్తున్నాను.

ఆంజనేయస్వామికి 41 రోజులు నియమంగా ఆరాధన చేయాలి. గుడి దగ్గర ఉన్న రావి చెట్టుకు "11" ప్రదక్షిణలు నిదానంగా తిరుగుతూ 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అంటూ స్మరించుకోవాలి. స్త్రీలు మధ్యలో విరామం ఇచ్చి తిరిగి ప్రారంభించి 41 రోజులు పూర్తి చేయవచ్చు. ప్రమిద భూమిపై పెట్టకుండా రావి ఆకు వేసి దానిపై పిండితో తయారు చేసిన దీపాన్నిపెట్టి కుంకుమ, పూలతో అలంకరించి వెలిగించాలి. ఇందులో సూచించినట్లుగా పిండితో చేసిన ప్రమిదలో కొంచం బెల్లం వేసి దానిపై వత్తి వేసి నునే పోసి పూజ చేయాల్సి ఉంటుంది. :

# గుజరాత్ టార్గెట్‌గా అడుగులు

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపు వచ్చింది. గుజరాత్ వేదికగా కాంగ్రెస్ విస్తృత స్థాయి సమావేశంలో అగ్రనేతలంతా కలిసి రోడ్ మ్యాప్ రెడీ చేశారు. పార్టీని ప్రక్షాళన చేయడానికి నాయకులంతా సిద్ధమయ్యారు. అధికారానికి దూరమై దశాబ్దం దాటిపోగా.. పార్టీని గద్దెనెక్కించడానికి కార్యవర్గమంతా కష్టపడాలని దిశానిర్దేశం జరిగింది. ఇప్పుడిక కాంగ్రెస్ సంకల్పం మరింత బలంగా తయారయ్యిందనే టాక్ వినిపిస్తోంది. కాంగ్రెస్‌లో వచ్చిన కొత్త ఉత్సాహంతో రాబోయే రోజుల్లో రాజకీయం మరింత వేడెక్కనుంది. బిజెపి కంచుకోటలో కీలక సమావేశాన్ని నిర్వహించిన భారత జాతీయ కాంగ్రెస్ వ్యూహాలను మార్చుతోంది. దశాబ్ధం పైగా కేంద్రంలో అధికారానికి దూరమైన పార్టీని తిరిగి గద్దెనెక్కించడానికి సిద్ధమయ్యింది.

ప్రధాని మోడీ సొంత గడ్డ గుజరాత్ వేదికగా భారత జాతీయ కాంగ్రెస్ అచిఅ, ఒఎఅఅ విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నాయకులంతా ఏప్రిల్ 8న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సమావేశమయ్యారు. గుజరాత్ రాష్ట్రంలో గత 30 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ గెలవలేదు. అయితే, కాంగ్రెస్ కొత్త ప్లాన్ అక్కడి నుండే మొదలుపెట్టాలనే ఉద్దేశంతో.. ఏప్రిల్ 8, 9 తేదీల్లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 84వ జాతీయ సమావేశంలో తదుపరి రాజకీయ వ్యూహాలకు రోడ్ మ్యాప్ రెడీ చేశారు.గత 64 సంవత్సరాల్లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం గుజరాత్‌లో జరగడం ఇదే మొదటిసారి. సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను ఓన్ చేసుకుంటున్న భారతీయ జనతా పార్టీ అసలు స్వరూపం వేరంటూ కాంగ్రెస్ అగ్రనేతలంతా ఈ వేదికపై విరుచుకుపడ్డారు. మహాత్మా గాంధీతో పాటు పటేల్, నెహ్రూలకు అసలు వారసులం మేమేనంటూ కాంగ్రెస్ మరోసారి బల్లగుద్ది చెప్పింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో కొంత మెరుగైన ప్రదర్శన చేసిన కాంగ్రెస్.. తర్వాత జరిగిన పలు రాష్ట్రాల ఎన్నికల్లో పరాజయాల నుండి కోలుకోవడానికి ఇదొక కీలక వేదికగా మారింది.ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ సిడబ్ల్యుసి సమావేశంలో.. కాంగ్రెస్ ముఖ్యమంత్రులు, మాజీ ముఖ్యమంత్రులు, కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులతో సహా 169 మంది నేతలు పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీలను సంస్థాగత కేంద్రంగా ఎలా మార్చాలనే దానిపై ఈ వేదిక కీలకంగా చర్చించినట్లు తెలుస్తోంది. అలాగే, రణదీప్ సుర్జేవాలా నేతృత్వంలోని 15 మంది సభ్యుల ముసాయిదా కమిటీ ఈ సమావేశానికి సంబంధించిన తీర్మానాలను ఖరారు చేశాయి. వీటిలో.. మొత్తం రాజకీయ, సంస్థాగత పరిస్థితులపై ఒక ముసాయిదా తయారుచేయాగా.. మరోకటి, ప్రత్యేకంగా గుజరాత్‌పై తీర్మానం చేశారు. ఇక, ఈ తాజా సమావేశంలో భాగంగా.. పార్టీ భవిష్యత్తు ప్రణాళికలు, కీలకమైన జాతీయ విషయాలు, అంతర్గతంగా సంస్థాపరమైన అంశాలు, రాబోయే ఎన్నికల వ్యూహాలపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కీలక చర్చలు చేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సిపిపి చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ.. ఇతర ప్రముఖ కాంగ్రెస్ నాయకులంతా పాల్గొన్నారు. ఈ సమావేశాల మొదటి రోజున సర్దార్ పటేల్ స్మారక చిహ్నం వద్ద కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం జరగ్గా.. ఇక్కడ సీనియర్ నాయకులు సంస్థాగత పునరుద్ధరణకు సంబంధించిన నిర్ణయాలు తీసుకున్నారు. తర్వాత ఏప్రిల్ 9న.. సబర్మతి నది ఒడ్డున ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇక్కడ 17వందల 25 మంది ఏఐసీసీ సభ్యులతో సహా దాదాపు 2 వేల మంది ప్రతినిధులు పార్టీ రూపొందించిన కొత్త రోడ్‌మ్యాప్‌పై ఆమోద ముద్ర వేశారు.నేతలకు భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టత ఇచ్చారు అగ్రనేతలు. ఇందులో సైద్ధాంతిక శిక్షణ, సోషల్ ఇంజనీరింగ్, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను ఎదుర్కోవడం, పార్టీ అనుకూల కథనాన్ని రూపొందించడం.. ఎన్నికలు, నిధులు, మీడియా, సోషల్ మీడియా, పార్టీ ఆస్తులు, వాటి నిర్వహణకు సంబంధించిన అంశాలను కూడా చర్చించారు. ఇప్పటికే, కేంద్ర నాయకత్వం ఢిల్లీలో మూడు బ్యాచ్‌లుగా 862 జిల్లా అధ్యక్షులతో సమావేశం అయ్యింది. రాబోయే రోజుల్లో వారి అధికారాన్ని ఎలా నిర్వహించాలనే దానిపై కీలక చర్చలు జరిగాయి. సమావేశంలో ఖర్గే, రాహుల్ గాంధీలు పార్టీలో వికేంద్రీకరణకు పూర్తి మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది. అలాగే, గ్రౌండ్ లెవల్లో ఆఫీస్ బేరర్ల నియామకం, తొలగింపులపై కఠిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇక, రాష్ట్ర స్థాయి నాయకులు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించకుండా హెచ్చరికలు కూడా జారీ చేసినట్లు సమాచారఅభ్యర్థుల ఎంపికలోనూ కచ్చితమైన దిశానిర్దేశాలు జరిగాయి. జిల్లా అధ్యక్షులకు ఫుల్ పవర్స్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఇక నుంచి, కేంద్ర నాయకత్వం, జిల్లా అధ్యక్షుల మధ్య ప్రత్యక్ష, క్రమబద్ధమైన సంభాషణల కోసం ఒక కొత్త యంత్రాంగం కూడా ఏర్పాటు చేసారు. అలాగే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఒక నిర్దిష్ట కాలం పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించాలనే నిర్ణయం కూడా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.సర్దార్ వల్లభాయ్ పటేల్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ మధ్య సంబంధం గురించి బిజెపి తప్పుడు కథనాలు వ్యాప్తి చేస్తుందనీ.. వీరిద్దరి మధ్య విభేదాలున్నట్లు ప్రచారం చేస్తున్నారని ఖర్గే ఆరోపించారు. "వాస్తవంలో వీళ్లద్దరూ ఒకే నాణేనికి రెండు వైపులా ఉన్నారు" అని ఖర్గే వ్యాఖ్యానించారు. 140 సంవత్సరాల సుదీర్ఘ సేవ, పోరాట పటిమ గల కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా కుట్రలు జరుగుతున్నాయని ఖర్గే అన్నారు. బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ ని లక్ష్యంగా చేసుకుని, భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో వారికి ఎటువంటి సహకారం లేదని అనడంపై ఇప్పుడు రాజకీయ వేడి రాజుకుంది.ఇక, కాంగ్రెస్ వర్కంగ్ కమిటీ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి వరకూ దళిత, ముస్లిం, బ్రాహ్మణ ఓట్ల కోసం పార్టీ కొట్టుమిట్టాడుతుందనీ, అందుకే.. ఓబీసీ ఓటర్లు కాంగ్రెస్‌కు దూరమయ్యారని అన్నారు. దీనికి ఉదాహరణగా ఉత్తరప్రదేశ్‌ని ప్రస్తావించారు. 1991 నుంచి యూపీలో అధికారానికి కాంగ్రెస్ దూరంగా ఉందనీ.. అక్కడ, కాంగ్రెస్ పార్టీ ముస్లింలకు మాత్రమే మద్దతిస్తుందనే ప్రచారం ప్రత్యర్థులు చేస్తున్నారనీ.. దీన్ని అడ్డుకోవాల్సిన అవసరాన్ని గుర్తుచేశారు.

# రజతోత్సవ సభకు 3వేల బస్సులు

వరంగల్, ఏప్రిల్ 11,ఈనెల 27న వరంగల్ సమీపంలోని ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరగాల్సి ఉంది. ఈ సభ ద్వారా మరోసారి గులాబి శ్రేణుల్లో ఉత్సాహం తేవాలి చూస్తున్నారు కేసీఆర్. కానీ అది అసాధ్యం అనిపిస్తోంది. సభకు రోజులు దగ్గరపడినా పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం లేదు. కేవలం బీఆర్ఎస్ హడావిడి మాత్రం కనపడుతోంది. రోజుకి ఒక జిల్లా నేతలతో ఫామ్ హౌస్ లో కేసీఆర్ సమావేశం అవుతున్నారు. పార్టీ సభను విజయవంతం చేయాలని పిలుపునిస్తున్నారు. నేతలు వెళ్తున్నారు, వస్తున్నారు, కేసీఆర్ మాటలు వింటున్నారు కానీ.. సభపై ఎవరికీ ఉత్సాహం లేదని మాత్రం తెలుస్తోంది.అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ సభలకోసం విచ్చలవిడిగా ప్రభుత్వ సొమ్ము ఖర్చు చేసిందని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. బీఆర్ఎస్ ని పొరుగు రాష్ట్రాల్లో విస్తరించేందుకు, అప్పట్లో బస్సు యాత్రలు చేసిన కేసీఆర్.. సీఎం హోదాలో ఆ యాత్రలను చేపట్టారు. ప్రభుత్వ ఖజానా నుంచే సొమ్ము చెల్లించి పార్టీకి సోకులు చేసుకున్నారని తెలుస్తోంది. తాజాగా బీఆర్ఎస్ సభకోసం చేస్తున్న ఖర్చుపై కూడా సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి. పార్టీ సభ కోసం తెలంగాణ ఆర్టీసీ నుంచి 3 వేల బస్సులకోసం 8 కోట్ల రూపాయలు బీఆర్ఎస్ అడ్వాన్స్ గా ఇచ్చిందనే వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఇదంతా ఎవడబ్బ సొమ్మంటూ కాంగ్రెస్ అనుకూల సోషల్ మీడియా అకౌంట్ల నుంచి కౌంటర్లు పడుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు దోచుకున్న సొమ్ముని ఇప్పుడిలా విచ్చలవిడిగా ఖర్చు చేస్తున్నారని అంటున్నారు.

పింక్ పార్టీ సభ కోసం 8 కోట్ల రూపాయలతో బస్సులా?

ఏం కష్టం చేసి ఇన్ని కోట్లు సంపాదించిన్రురా పింకీస్?

బీఆర్ఎస్ రజతోత్సవ సభకోసం ఇటీవల వెరైటీ ప్రచారం మొదలు పెట్టారు. కీలక నేతలంతా గోడలపై వాల్ పెయింట్స్ వేస్తూ ప్రచారం మొదలు పెట్టారు. బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కూడా గోడలపై కుంచె పట్టి కేసీఆర్ పేరు రాశారు. దీనిపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ నడుస్తోంది. దొరల వద్ద తన ఆత్మాభిమానాన్ని ఆర్ఎస్ ప్రవీణ్ తాకట్టు పెట్టారని, ఒక జాతీయ పార్టీకి తెలంగాణ రాష్ట్ర అధినేతగా ఉన్న ఆయన, చివరకు కేసీఆర్ తో చేతులు కలిపి ఆయన భజన చేస్తున్నారని ఎద్దేవా చేశారు నెటిజన్లు.బీఆర్ఎస్ అధికారంలో ఉంటే రజతోత్సవ సభ పెద్ద ఎత్తున జరిగేది. అయితే ఇప్పుడు పార్టీ ప్రతిపక్షంలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ని దూరం పెట్టిన ప్రజలు, లోక్ సభ ఎన్నికల్లో అసలు పట్టించుకోలేదు. దీంతో ఆ పార్టీకి ప్రజల్లో ఉన్న క్రెడిబిలిటీ ఏంటో స్పష్టమైపోయిందని అంటున్నారు కాంగ్రెస్ నేతలు. రజతోత్సవ సభ అంటూ జనంలోకి వచ్చినా, సభా వేదికపై కేసీఆర్ రెచ్చిపోయినా ఎవరూ నమ్మే పరిస్థితి లేదంటున్నారు. 2023 ఎన్నికల సందర్భంగా కేసీఆర్ సభలకు జనాల్ని పోగు చేశారు, సభలు విజయవంతం అయ్యాయని చెప్పుకున్నారు, కానీ సభలకు వచ్చిన జనం బీఆర్ఎస్ కి మాత్రం ఓట్లు వేయలేదు. సభలకు హాజరైన వారిని చూసి, ఫలానా అభ్యర్థి విజయం ఖాయం అని అక్కడికక్కడే చెప్పేసిన కేసీఆర్, తాను పోటీ చేసిన స్థానంలోనే ఓడిపోవడంతో షాకయ్యారు. చాన్నాళ్లుగా ఆయన ప్రజలకు దూరంగా ఫామ్ హౌస్ లోనే ఉంటున్నారు. అసెంబ్లీకి వచ్చినా మొక్కుబడిగా మాట్లాడి వెళ్లిపోయారు. కనీసం ఈ సభలో అయినా నిజాలు మాట్లాడతారా..? గతంలో చేసిన తప్పుల్ని ఒప్పుకుంటారా..? ప్రజలు తమని ఎందుకు దూరం పెట్టారనే విషయాన్ని పరిగణలోకి తీసుకుంటారా..? వేచి చూడాలి.

# 2026 తెలుగు హీరోలదే హవా

హైదరాబాద, ఏప్రిల్ 11, ఇప్పటివరకు తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఉన్న చాలామంది నటులు వాళ్ళను వాళ్ళు స్టార్లుగా ఎస్టాబ్లిష్ చేసుకోవడానికి అహర్నిశలు ప్రయత్నమైతే చేస్తున్నారు. ఇక పాన్ ఇండియాలో తెలుగు సినిమా ఇండస్ట్రీ నెంబర్ వన్ పొజిషన్ కి చేరుకుంటుంది అంటూ మన హీరోలు చాలా కాన్ఫిడెంట్ ను వ్యక్తం చేస్తున్నారు. రాబోయే వరుస సినిమాలతో భారీ విజయాలను అందుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టుగా తెలుస్తోంది?సినిమా ఇండస్ట్రీలో ఉన్న ప్రతి హీరో కూడా ప్రస్తుతం చాలా బిజీగా ఉన్నారు. ఒక్కో హీరో చేతిలో రెండు మూడు ప్రాజెక్టులు ఉండడమే కాకుండా మరికొన్ని కథలను వింటూ వాళ్ళందరిని లైన్ లో పెట్టే ప్రయత్నమైతే చేస్తున్నారు. ఇక దాదాపు రెండు నుంచి మూడు సంవత్సరాల వరకు మన స్టార్ హీరోలందరు బిజీగా ఉన్నారు. ఇక వరుసగా వాళ్ళు కమిట్ అయిన సినిమాలను చేసుకుంటూ ముందుకు సాగుతూ తమదైన రీతిలో సత్తా చాటుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఇక 2026వ సంవత్సరంలో తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి వచ్చే సినిమాలు పాన్ ఇండియాను షేక్ చేయబోతున్నాయి అంటూ కొంతమంది సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాలను తెలియజేస్తున్నారు. నిజానికి 2026 వ సంవత్సరంలో ఏ సినిమాలు వస్తున్నాయి అనేది మనం ఒకసారి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.2026 సంవత్సరం ప్రారంభం లో సంక్రాంతి కానుకగా మెగాస్టార్ చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వస్తున్న సినిమాను రిలీజ్ చేస్తున్నారు. కాబట్టి ఈ సినిమాతో స్టార్టింగ్ లోనే భారీ విజయాన్ని దక్కించుకొని సినిమా ఇండస్ట్రీకి మంచి బూస్టప్ ని ఇవ్వాలనే ఉద్దేశ్యంలో దర్శకుడు అనిల్ రావిపూడి, చిరంజీవి ఉన్నట్టుగా తెలుస్తోంది?ఇక ఎన్టీఆర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్ లో వస్తున్న సినిమాను కూడా సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమా ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో పెను రికార్డులను క్రియేట్ చేస్తూ ముందుకు సాగుతుందని సినిమా మేకర్స్ మంచి కాన్ఫిడెంట్ తో ఉన్నారు?ఇక మార్చి లో రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు డైరెక్షన్ లో వస్తున్న 'పెద్ది' సినిమాను రిలీజ్ చేస్తున్నారు. ఇక దాంతోపాటుగా నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వస్తున్న 'ప్యారడైజ్' సినిమాని కూడా రిలీజ్ చేస్తుండడం విశేషం?ఇక ఈ రెండు సినిమాల మీద భారీ బజ్ అయితే ఉంది?2026 సమ్మర్ కానుకగా ప్రభాస్ హీరోగా హను రాఘవపూడి దర్శకత్వంలో వస్తున్న 'ఫౌజీ ' సినిమాని తీసుకొస్తున్నారు. ఇక ఇయర్ ఎండింగ్ లో అల్లు అర్జున్ హీరోగా అట్లీ డైరెక్షన్ లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇక మొత్తానికైతే 2026వ సంవత్సరంలో మన స్టార్ హీరోలందరు భారీ విజయాలను సాధించి పాన్ ఇండియాని షేక్ చేయాలని చూస్తున్నారు.ఇక ఒకరి తర్వాత ఒకరు కలెక్షన్ల సునామిని సృష్టించి తెలుగు సినిమా స్థాయి ఏంటో ప్రపంచవ్యాప్తంగా తెలియజేయడానికి సన్నద్ధమవుతున్నట్టుగా తెలుస్తోంది? మొత్తానికైతే మూవీ లవర్స్ కి 2026వ సంవత్సరం మంచి ఎంటర్ టైన్ మెంట్ ను ఇవ్వబోతుందనేది మాత్రం చాలా స్పష్టంగా తెలుస్తోంది.

# విజయవాడలో స్వర్ణకారుడు సాయి ప్రకాష్ రెడ్డి

## ఏడేళ్ళ కుమారుడితో కలిసి ఆత్మహత్య

విజయవాడ : స్వర్ణకారుడు సాయి ప్రకాష్ రెడ్డి ఆత్మహత్య కుమారుడు ఏడు సంవత్సరాల తక్షిల్ రెడ్డి బాలుడికి విషమిచ్చి తాను ఆత్మహత్య చేసుకున్న సంఘటన విజయవాడ రజక వీధిలో చోటు చేసుకుంది. బంగారం పని చేస్తున్న వేమిరెడ్డి సాయి ప్రకాష్ రెడ్డి ఆర్థిక ఇబ్బందుల వలన ఈ సంఘటన జరిగినట్లు తెలుస్తుంది. ఈ సంఘటనపై రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ మాట్లాడుతూ బంగారం రేటు 30% ఈ ఐదు నెలల్లో పెరిగి రాష్ట్రంలో 1,62,000 కుటుంబాలకి 80% పైగా పనులు లేవని రాష్ట్రంలో ఇప్పటికే మదకశిరలో స్వర్ణకారుడు కృష్ణారి 4 కుటుంబ సభ్యులు ఆత్మహత్య చేసుకుని వారం రోజులు గడవక ముందే మరొక సంఘటన విజయవాడలో జరగడం బాధాకరంగా ఉందని రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు కర్రి వేణుమాధవ్ అన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం స్వర్ణకార కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టు ప్రకటించిందని స్వర్ణకార కుటుంబాలు మనోధైర్యం కల్పించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ స్వర్ణకార సంఘాల నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే ఈ కుటుంబాలకి ప్రభుత్వం తరఫున సహాయం చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు.

# ఎన్ ఐఏ అధికారుల అదుపులో రాణా

ముంబై, ఏప్రిల్ 11, (న్యూస్ పల్స్) ముంబైలో జరిగిన 26/11 ఉగ్రవాద దాడులకు ప్రధాన సూత్రధారి, ఉగ్రవాది తహవ్వూర్ హుస్సేన్ రాణా ఎట్టకేలకు భారతదేశానికి తిరిగి వచ్చాడు. భారతదేశానికి చేరుకున్న తర్వాత అతన్ని కోర్టులో హాజరుపరిచారు. పాటియాలా హౌస్ కోర్టు రాణాను 18 రోజుల రిమాండ్‌కు పంపింది. ఐఎస్ఐలో పనిచేసి, లష్కరే తోయిబా, హర్కత్-ఉల్-జిహాదీ ఇస్లామి వంటి ఉగ్రవాద సంస్థలతో సంబంధం కలిగి ఉన్న తహవ్వూర్ రాణాను ప్రత్యేక విమానంలో భారతదేశానికి తీసుకువచ్చారు. గురువారం రాత్రి 7 గంటల ప్రాంతంలో భారతదేశానికి చేరుకున్న రాణాను.. అధికారికంగా అరెస్టు చేసింది.రాణాను పాటియాలా హౌస్ కోర్టులో హాజరుపరిచింది. ఈ సమయంలో, ముంబై దాడులలో అతని ప్రమేయానికి సంబంధించిన ఆధారాలను కోర్టులో సమర్పించారు. 26/11 ముంబై దాడులకు సంబంధించి రాణా పంపిన ఈమెయిల్స్ సహా కేసుతో సంబంధం ఉన్న బలమైన ఆధారాలను పాటియాలా హౌస్ కోర్టుకు సమర్పించింది. ఉగ్రకుట్రను వెలికితీయడానికి కస్టోడియల్ విచారణ చాలా కీలకమని కోర్టుకు తెలిపింది. ఉగ్రవాద దాడులను నిర్వహించడంలో రాణా పాత్రపై అధికారులు మరింత లోతుగా దర్యాప్తు జరుపనున్నారు.పాకిస్తాన్‌లో జన్మించిన కెనడియన్ పౌరుడు తహవ్వూర్ హుస్సేన్ రాణా 26/11 ముంబై ఉగ్రవాద దాడుల్లో కీలక నిందితుడు గురువారం(ఏప్రిల్ 10) అమెరికా నుండి రహస్యంగా చార్టర్డ్ బిజినెస్ జెట్‌లో న్యూఢిల్లీకి తీసుకువచ్చారు. మీడియా కథనాల ప్రకారం, ఈ అప్పగింత ఆపరేషన్ గల్ఫ్‌స్ట్రీమ్ G550 ఉపయోగించి జరిగింది. ఈ విమానాన్ని వియన్నాకు చెందిన చార్టర్ సర్వీస్ నుండి అద్దెకు తీసుకున్నారు. ఈ జెట్ బుధవారం స్థానిక కాలమానం ప్రకారం తెల్లవారుజామున 2.15 గంటలకు (భారతీయ కాలమానం ప్రకారం ఉదయం 11.45 గంటలకు) ఫ్లోరిడాలోని మయామి నుండి బయలుదేరింది. అదే రోజు స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 7 గంటలకు (భారతీయ కాలమానం ప్రకారం రాత్రి 9.30 గంటలకు) రొమేనియాలోని బుకారెస్ట్‌లో అది ల్యాండ్ అయింది.

దాదాపు 11 గంటల పాటు రొమేనియన్ రాజధానిలో నిలిపివేశారు. గల్ఫ్‌స్ట్రీమ్ గురువారం స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6.15 గంటలకు (భారతీయ కాలమానం ప్రకారం ఉదయం 8.45) బుకారెస్ట్ నుండి బయలుదేరి నేరుగా న్యూఢిల్లీకి బయలుదేరింది. అక్కడ గట్టి భద్రత మధ్య ల్యాండ్ అయింది. రాణా ఢిల్లీలో అడుగుపెట్టిన వెంటనే, జాతీయ దర్యాప్తు సంస్థ అతన్ని అధికారికంగా అరెస్టు చేసింది.భారత దర్యాప్తు సంస్థ ఎన్ ఐ ఏ 2011 సంవత్సరంలో తహవ్వూర్ రాణాపై తన చార్జిషీట్ దాఖలు చేసింది. దీని తరువాత, 2019 డిసెంబర్ 4న మొదటిసారిగా, దౌత్య మార్గాల ద్వారా రాణాను అప్పగించాలని భారతదేశం డిమాండ్ చేసింది. జూన్ 10, 2020న రాణాను తాత్కాలికంగా అరెస్టు చేయాలని డిమాండ్ చేయగా, జూన్ 22, 2021న అమెరికా ఫెడరల్ కోర్టులో తహవ్వూర్ రాణాను అప్పగించడంపై విచారణ సందర్భంగా భారతదేశం ఆధారాలను సమర్పించింది.రెండు సంవత్సరాల క్రితం, మే 16, 2023న, కాలిఫోర్నియా జిల్లా కోర్టు అతన్ని అప్పగించాలని ఆదేశించింది. దీని తరువాత, తహవూర్ అమెరికాలోని అనేక కోర్టుల్లో అప్పీల్ దాఖలు చేశాడు. కానీ అతని పిటిషన్లన్నీ తిరస్కరించారు. రెండు దేశాల మధ్య ఉన్న అప్పగింత ఒప్పందం ప్రకారం అతన్ని భారతదేశానికి పంపవచ్చని కోర్టు తన నిర్ణయంలో పేర్కొంది.

గత సంవత్సరం, రాణాను అప్పగించాలన్న భారతదేశం చేసిన అభ్యర్థనకు అమెరికా ప్రభుత్వం మద్దతు ఇచ్చింది. నవంబర్ 13న, రానా సుప్రీంకోర్టులో రిట్ ఆఫ్ సర్టియోరారీ కోసం పిటిషన్ దాఖలు చేశాడు. కానీ అది తిరస్కరణకు గురైంది. ఫిబ్రవరి 27న, అతను అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ పిటిషన్ దాఖలు చేశాడు. దీనిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎలెనా కగన్ మార్చి 6న తిరస్కరించారు. ఈ తుది నిర్ణయం తర్వాత, రాణాను భారతదేశానికి తీసుకువచ్చారు.తహవ్వూర్ రాణా భారతదేశానికి చేరుకున్న వెంటనే, అతన్ని అరెస్టు చేశారు. ఆ తర్వాత అతన్ని కోర్టులో హాజరుపరిచింది. ఈ సమయంలో, ముంబై దాడులలో అతని ప్రమేయానికి సంబంధించిన ఆధారాలను కోర్టులో సమర్పించారు. రాణా తరపు న్యాయవాది పీయూష్ సచ్‌దేవా కోర్టులో వాదనలు వినిపించారు. కోర్టును 20 రోజుల రిమాండ్ కోరింది. గంటల తరబడి మూసి తలుపుల మధ్య జరిగిన చర్చల తర్వాత, తెల్లవారుజామున 2:10 గంటలకు కోర్టు 18 రోజుల రిమాండ్ మంజూరు చేస్తూ తన నిర్ణయాన్ని ప్రకటించింది. ఆ వెంటనే రాణాను ప్రధాన కార్యాలయానికి తరలించారు

# లక్షన్నర కోళ్లను చంపడమే పరిష్కారం

మెదక్ ఏప్రిల్ 11, తెలంగాణలో బర్డ్ ఫ్లూ వ్యాప్తి మళ్లీ క్రమంగా పెరుగుతోంది. నిన్నమొన్నటి వరకు ఉమ్మడి నల్గొండ జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావంతో వేలాది కోళ్లు చనిపోయాయి. పౌల్ట్రీ పరిశ్రమల్లో కోళ్లు చనిపోవటంతో ఆ ప్రాంతాల్లో వెటర్నరీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. పరీక్షలను సేకరించి ల్యాబ్ కు పంపించగా బర్డ్ ఫ్లూ కారణంగానే కోళ్లు మరణించినట్లు నిర్ధారణ అయింది. దీంతో పలు పౌల్ట్రీ ఫామ్ లను అధికారులు సీజ్ చేశారు. ఆయా ప్రాంతాల్లో రెడ్ అలర్ట్ ప్రకటించారు.సిద్దిపేట జిల్లాలోనూ బర్డ్ ఫ్లూ కలకలం రేపుతోంది. తొగుట మండలం కన్గల్ లోని లేయర్ ఫామ్ లో కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకినట్లు నిర్ధారణ కావడంతో వెటర్నరీ డిపార్ట్ మెంట్ రంగంలోకి దిగింది. ఫామ్ లో ఐదు షెడ్లలో ఉన్న మొత్తం 1.45లక్షల కోళ్లను చంపి పూడ్చి పెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇందుకోసం ప్రత్యేకంగా పది టీమ్స్ ను ఏర్పాటు చేశారు. ఒక్కో టీమ్ లో ఒక వెటర్నరీ డాక్టర్, ఇద్దరు కాంపౌండర్లు, ఇద్దరు అటెండర్లను నియమించారు. పీపీఈ కిట్లు ధరించిన సిబ్బంది ఫామ్ లోకి వెళ్లి కోళ్లను చంపే పనిని మొదలు పెట్టారు.కన్గల్ గ్రామం పరిధిలోని పౌల్ట్రీ ఫామ్ లో కోళ్లకు బర్డ్ ఫ్లూ నిర్ధారణ కావడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. ఆ గ్రామంలో మొత్తం 512 కుటుంబాలు, 2,400 జనాభా ఉండగా.. ఆశా వర్కర్లు బుధవారం 150 ఇండ్లలో సర్వే చేశారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి, జలుబు, దగ్గు, జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. మరో రెండ్రోజుల్లో ఇంటింటి సర్వే పూర్తిచేసి అకస్మాత్తుగా జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్న వారికి వైద్య సేవలు అందించనున్నారు.మెదక్ జిల్లాలో 44 లేయర్, బ్రాయిలర్ ఫామ్స్ ఉన్నాయి. వీటిల్లో 60లక్షల వరకు కోళ్లు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం కన్గల్ గ్రామం పరిధిలోని పౌల్ట్రీ ఫామ్ లో బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయింది. అయితే, ఆ గ్రామం పరిసరాల్లో ఐదు పౌల్ట్రీ ఫామ్స్ ఉన్నాయి. ఇందులో సుమారు లక్ష కోళ్లను పెంచుతున్నారు. బర్డ్ ఫ్లూ నిర్ధారణ అయిన ఫామ్ కు కిలో మీటర్ పరిధిలో ఉన్న ఫామ్స్ లో ఉన్న కోళ్లను చంపేస్తామని అధికారులు చెబుతుండటంతో పౌల్ట్రీ రైతుల్లో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు

# చెన్నై డైరక్టర్లకు ఏమైంది

చెన్నై, ఏప్రిల్ 11, (న్యూస్ పల్స్) ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో తెలుగు హీరోల హవా ఎక్కువైపోయింది. బాలీవుడ్ హీరోలను డామినేట్ చేస్తూ మన హీరోలు వరుస సక్సెస్ లను సాధించడమే కాకుండా వాళ్లకంటూ ఒక సపరేట్ ఇమేజ్ ను కూడా క్రియేట్ చేసి పెట్టారు. ఇక దానికి మెయిన్ ప్రభాస్ చేసిన బాహుబలి సినిమాతో తెలుగు సినిమా స్థాయి అనేది అమాంతం పెరిగింది. ఇప్పటివరకు ఏ ఒక్క పాన్ ఇండియా సినిమా వచ్చినా కూడా తెలుగు సినిమాలు క్రియేట్ చేస్తున్న రికార్డులను బ్రేక్ చేయలేకపోతున్నాయి. ఇక ఇలాంటి క్రమంలోనే ఇండియాలో ఉన్న ప్రతి ఒక్క దర్శకుడు కూడా మన హీరోలతో సినిమాలు చేయడానికి ఆసక్తి చూపిస్తూ ముందుకు సాగుతున్నారు. మరి మన హీరోలు వాళ్ళ కథలు నచ్చితే ఇతర భాషల్లో ఉన్న దర్శకులకు అవకాశాలను ఇస్తున్నారు. ముఖ్యంగా తమిళ్ దర్శకులకు ఎక్కువగా అవకాశాలను ఇస్తూ ముందుకు సాగుతున్నారు? ఇక ఈ మధ్యకాలంలో మన హీరోలతో తమిళ్ దర్శకులు చేసిన సినిమాలేవి కూడా పెద్దగా సక్సెస్ అయితే సాధించలేకపోతున్నాయి.పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా వచ్చిన బ్రో సినిమాని తమిళ్ డైరెక్టర్ అయిన సముద్ర ఖనిడైరెక్ట్ చేశాడు.ఈ సినిమా ఆశించిన మేరకు విజయాన్ని సాధించలేదు. ఇక దాంతోపాటుగా రీసెంట్ గా శంకర్ డైరెక్షన్ లో రామ్ చరణ్ హీరోగా వచ్చిన 'గేమ్ చేంజర్'సినిమా కూడా ఈ సంవత్సరం సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చి ఆశించిన మేరకు విజయాన్ని సాధించకపోవడమే కాకుండా రామ్ చరణ్ కు బ్యాడ్ నేమ్ కూడా తీసుకొచ్చింది?మరి ఇలాంటి క్రమంలో ప్రస్తుతం అల్లు అర్జున్ అట్లీ తో సినిమా చేస్తున్నాడు. మరి ఈ సినిమా ఎంతవరకు సక్సెస్ సాధిస్తుంది. అల్లు అర్జున్ కెరియర్ ను ఎంతవరకు ముందుకు తీసుకెళ్తుంది. ఆయనకి ఇండియా సినిమా ఇండస్ట్రీ లో ఒక స్టాండర్డ్ అయితే ఉంది. మరి ఆ స్టాండర్డ్ ని అందుకొని ఈ సినిమా ముందుకు సాగుతుంటా లేదంటే బాక్సాఫీస్ వద్ద భారీగా బోల్తా కొడుతుందా అనేది కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది?ఇక రీసెంట్ గా అల్లు అర్జున్ బర్త్ డే సందర్భంగా ఈ సినిమాకు సంబంధించిన ఒక వీడియోని రిలీజ్ చేశారు. మొత్తానికైతే ఈ సినిమా తొందర్లోనే రెగ్యులర్ షూట్ జరుపుకోబోతుంది అనే హింటు కూడా ఇచ్చారు. మరి ఏది ఏమైనా కూడా ఈ సినిమాతో అల్లు అర్జున్ ఎలాంటి సక్సెస్ ని సాధిస్తాడు. పుష్ప 2 సినిమాను మించి భారీ విజయాన్ని అందుకుంటాడా? లేదా అనేది తెలియాలంటే మాత్రం ఈ సినిమా రిలీజ్ అయ్యేంతవరకు వెయిట్ చేయాల్సిందే.

# కోహెడ లో హిట్ అండ్ రన్ కేసు

రంగారెడ్డి శివారు ప్రాంతంలో హిట్ అండ్ రన్ కేసు నమోదు అయింది. అబ్దుల్లా పూర్ మెట్ కోహెడ లో హిట్ ఏ రన్ ఘటనలో యువతి స్పాట్ డెత్ అయింది. ఒకరి పరిస్థితి విషమంగా మారింది. మృతురాలు స్పందన ఘట్కేసర్ లో ప్రైవేట్ కాలేజీలో బి ఫార్మసీ ఫస్ట్ ఇయర్ చదువుతోంది. బైక్ పై వెళ్తున్న స్పందన (19) , సాయి అనే యువకుని స్కోడా కారు ఢీకొంది. ఘటనలో యువతి అక్కడికక్కడే మృతి చెందింది. యువకునికి తీవ్ర గాయాలు కావడంతో హాస్పిటల్ కు తరలించారు. మద్యం మత్తులో ప్రమాదం చేసిన కారు ఏపీ 40 బీడీ 6669 తో డ్రైవర్ పరారయ్యాడు.

# మహిళలకు స్పెషల్ ఆఫర్..

## తక్కువ ధరలకు ఆటోలు

హైదరాబాద్, ఏప్రిల్ 11, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం గణనీయంగా పెరుగుతోంది. సులభంగా డ్రైవింగ్ చేసే వీలుండటంతో మహిళలు సైతం వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఎలక్ట్రిక్ ఆటో డ్రైవర్లుగా మహిళలు సైతం పని చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రముఖ విద్యుత్ వాహనాల తయారీ సంస్థ ఒమేగా సెకీ మొబిలిటీ కంపెనీ మహిళల కోసం ప్రత్యేక ఆఫర్ తీసుకొచ్చింది. మహిళా డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన పింక్ ఆటో రిక్షాలను చాలా తక్కువ ధరకే ఇవ్వనుంది ప్రకటించింది. మహిళా డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా పింక్ ఆటో రిక్షాలను రూపొందిస్తున్నట్లు ఒమేగా సెకీ పేర్కొంది. దేశవ్యాప్తంగా మహిళా డ్రైవర్ల కోసం 2500 ఎలక్ట్రిక్ పింక్ ఆటో రిక్షాలను తక్కువ ధరలకే దశల వారీగా అందించనున్నట్లు తెలిపింది. తమ కంపెనీ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమంలో భాగంగా ఈ పథకాన్ని ఢిల్లీలో ప్రారంభించినట్లు ఒమేగా సెకి తెలిపింది. అలాగే మహిళలకు ప్రభుత్వ బ్యాంకు నుంచి వెహికల్ లోన్ తీసుకుంటే వడ్డీలోనూ 1 శాతం రాయితీ సైతం లభిస్తుందని కంపెనీ తెలిపిందిమహిళా డ్రైవర్లకు తక్కువ ధరకే ఎలక్ట్రిక్ ఆటో రిక్షాలను అందించేందుకు తాము ఢిల్లీకి చెందిన లాభాపేక్ష లేని నారీ శక్తి సంస్థతో కలిసి పని చేస్తున్నామని ఒమేగా సెకి వ్యవస్థాపకుడు, ఛైర్మన్ ఉదయ్ నారంగ్ తెలిపారు. కొన్ని నెలల్లో ఈ పథకాన్ని బెంగళూరు, ఉత్తర కర్ణాటక, చెన్నైల్లోనూ అమలు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే ఎంపిక చేసిన మహిళలకు డ్రైవింగ్‌లోనూ శిక్షణ ఇస్తామని, దీని ద్వారా మహిళలకు స్థిరమైన జీవనోపాధి కల్పిస్తామని ఆయన తెలిపారు.మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఎలక్ట్రిక్ పింక్ ఆటో రిక్షా ధర ఢిల్లీలో ఆన్ రోడ్ ధర రూ. 2,59,999గా ఉన్నట్లు ఒమేగా సెకి తెలిపింది. దీని కోసం ప్రభుత్వ బ్యాంకుల్లో లోన్ తీసుకుంటే 1 శాతం వడ్డీ రాయితీ సైతం లభిస్తుందని పేర్కొంది. సంప్రదాయ సీఎన్జీ ఆటో రిక్షాలతో పోలిస్తే ఈ సరికొత్త పింక్ ఆటోల నిర్వహణ ఖర్చు పావు వంతు మాత్రమే ఉంటుందని తెలిపింది. ఈ ప్రత్యేక కార్యక్రమం ముఖ్యంగా మహిళల ఆర్థిక స్వావలంబన సాధించాలనే లక్ష్యంలో భాగంగా చేపట్టినట్లు కంపెనీ తెలిపింది. ముఖ్యంగా అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని మహిళలకు స్థిరమైన ఆదాయం వచ్చే జీవనోపాధి కల్పించాలని తక్కువ ధరకే ఆటోలు ఇస్తున్నట్లు పేర్కొంది.

## వరంగల్ రజతోత్సవ వేడుకలకు పిలుపు?.

## సిద్ధం అవుతున్న నల్గొండ బిఆరెస్ శ్రేణులు..

నల్గొండ తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ శనిలా దాపురించిందని అన్నారు నల్గొండ బిఆరెస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి.ఈ నెల వరంగల్ లో జరగబోయే బిఆరెస్ రజతోత్సవ సభకు బిఆరెస్ శ్రేణులు సిద్ధం కావాలని మీడియా ముఖంగా పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ఇచ్చిన ఆరు హామీలు ఒక్కటి కూడా అమలు కాలేదని రేవంత్ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు.నల్గొండ లో ఇద్దరు మంత్రులున్నా అభివృద్ధి శూన్యమన్నారు.జిల్లా కలెక్టర్ కాంగ్రెస్ కు ఏజెంట్ లా పని చేస్తున్నారని దుయ్యబట్టారు. అధికారులు ధాన్యం కొనుగోళ్లలో సరైన ప్రణాళిక లేకుండా రైతులను ఇబ్బంది పెట్టొద్దని కోరారు.చివరి గింజ కొనుగోలు చేసే వరకు వారి పక్షాన నిలబడి పోరాడుతామని హెచ్చరించారు.

## ఛాంపులాల్ జాతరలో

## పాల్గొన్న ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి

సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం పులితండా, గుడితండాలో ఘనంగా ఛాంపులాల్ జాతర జరిగింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి జాతరలో పాల్గొని సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. గిరిజన సోదరులు,మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఆయనకు స్వాగతం పలికారు.

# సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ లో అంతరాయం

సికింద్రాబాద్, ఏప్రిల్ 11, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో త్వరలో జరగనున్న భారీ పునర్నిర్మాణ పనుల దృష్ట్యా.. ప్రయాణికులకు కొంత అసౌకర్యం కలగనుంది. స్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయికి అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా.. భారీ స్కై కాంకోర్స్, ఆధునిక లిఫ్టులు, ఎస్కలేటర్లు, కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టనున్నారు. ఈ కీలకమైన పనుల కోసం ఏకంగా 115 రోజుల పాటు స్టేషన్‌లోని సగం ప్లాట్‌ఫామ్స్‌ను దశలవారీగా మూసివేయనున్నారు.ఈ నెల 15వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఈ మూసివేత కారణంగా సుమారు 120 జతల రైళ్ల రాకపోకల్లో మార్పులు చోటుచేసుకోనున్నాయి. వీటిలో ఎక్కువ శాతం రైళు సికింద్రాబాద్‌కు బదులుగా చర్లపల్లి టెర్మినల్ నుండి రాకపోకలు సాగిస్తాయి. మరికొన్ని రైళ్లు నాంపల్లి, కాచిగూడ స్టేషన్ల నుండి నడుస్తాయి.ఈ పునర్నిర్మాణ ప్రాజెక్టులో స్కై కాంకోర్స్ నిర్మాణం అత్యంత కీలకమైనది. ఇది దాదాపు 110 మీటర్ల వెడల్పు మరియు 120 మీటర్ల పొడవుతో రెండు అంతస్తుల్లో నిర్మించబడుతుంది. ప్రయాణికులకు అవసరమైన అన్ని సౌకర్యాలు ఇక్కడే అందుబాటులో ఉంటాయి. విశాలమైన వేచి ఉండే ప్రాంతాలతో పాటు.. అనేక రిటైల్ ఔట్‌లెట్లు, రెస్టారెంట్లు మరియు కియోస్క్‌లు కూడా ఏర్పాటు చేయబడతాయి. ఈ స్కై కాంకోర్స్ లిఫ్టులు, ఎస్కలేటర్లు , ఫుట్‌ఓవర్ బ్రిడ్జిల ద్వారా అన్ని ప్లాట్‌ఫామ్‌లకు అనుసంధానం చేయబడుతుంది.ఈ భారీ నిర్మాణం కోసం పునాదులు , పిల్లర్ల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ పనుల కోసం ప్లాట్‌ఫామ్ నంబర్లు 2, 3, అలాగే 4 , 5లను విడతల వారీగా 50 రోజుల చొప్పున మొత్తం 100 రోజుల పాటు మూసివేయనున్నారు. ఈ సమయంలో ఈ ప్లాట్‌ఫామ్‌లపై లిఫ్టులు , ఎస్కలేటర్ల ఏర్పాటు పనులు కూడా జరుగుతాయి. అంతేకాకుండా.. ప్లాట్‌ఫామ్‌లతో పాటు రైల్వే ట్రాక్ మొత్తానికి పైకప్పు నిర్మించే పనులు కూడా ఈ నాలుగు ప్లాట్‌ఫామ్‌ల వద్ద నుంచే ప్రారంభించనున్నారు. ఆ తర్వాత ప్లాట్‌ఫామ్ నంబర్ 10 వైపు పనులు చేపడతారు.మరోవైపు.. ప్లాట్‌ఫామ్ నంబర్ 1 నుండి 10 వరకు ఒక భారీ ఫుట్‌ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన భారీ క్రేన్‌ను ప్లాట్‌ఫామ్ నంబర్లు 5 మరియు 6 మధ్యలో ఏర్పాటు చేస్తున్నారు. 500 టన్నుల సామర్థ్యం కలిగిన ఈ క్రేన్‌ను ఏర్పాటు చేయడానికి ఈ రెండు ట్రాక్‌లపై ఇసుక బస్తాలు నింపి ఒక ప్రత్యేకమైన వేదికను తయారు చేస్తున్నారు. ఈ కారణంగా ఈ రెండు ప్లాట్‌ఫామ్‌లను కూడా 15 రోజుల పాటు మూసివేయనున్నారు. మొత్తంగా.. పునర్నిర్మాణ పనుల కారణంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లోని ఆరు ముఖ్యమైన ప్లాట్‌ఫామ్స్‌ను మూసివేయనున్నారు.నిత్యం 250 జతల రైళ్లు రాకపోకలు సాగించే ఈ స్టేషన్‌లో ఇప్పటికే 6 జతల రైళ్లను శాశ్వతంగా చర్లపల్లి టెర్మినల్‌కు మళ్లించారు. ఇప్పుడు మరో 120 జతల రైళ్లను తాత్కాలికంగా ఇతర స్టేషన్‌ల ద్వారా నడపనున్నారు. ఈ మార్పుల వల్ల సికింద్రాబాద్‌లో రైలు సేవలు రానున్న ఆరు నెలల పాటు పరిమితంగానే అందుబాటులో ఉండనున్నాయి. ప్రయాణికులు ఈ మార్పులను గమనించి తమ ప్రయాణాలను తదనుగుణంగా ప్లాన్ చేసుకోవాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మళ్లీ సెంటిమెంట్ ఆలోచనలో గులాబీ దళం

హైదరాబాద్, ఏప్రిల్ 11,తెలంగాణలో తమ ఇమేజ్ తగ్గిపోతుందని భావించినప్పుడల్లా బీఆర్ఎస్ కి ఒక బ్రహ్మాస్త్రం దొరుకుతుంది. ఏపీ, తెలంగాణ ప్రజల మధ్య సెంటిమెంట్ రెచ్చగొట్టేలా మాట్లాడుతుంటారు ఆ పార్టీ నేతలు. తాజాగా తెలంగాణ నీళ్లను ఏపీ నాయకులు దొంగిలించుకు పోతున్నారంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. చంద్రబాబు సీఎం అయ్యాక ఈ ధోరణి మరింత పెరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వానికి నీళ్లపై పట్టింపు లేదన్నారాయన. ప్రజల దృష్టి మరల్చేందుకే బీఆర్ఎస్ నేతలు ఈ వ్యాఖ్యలు చేస్తున్నారనే విషయం అందరికీ తెలిసిందే అయినా.. ఎవర్ గ్రీన్ పాయింట్ లాగా దీన్ని రైజ్ చేస్తూ సింపతీ కోసం చూస్తున్నారు బీఆర్ఎస్ నేతలు.టీడీపీలో చంద్రబాబు, కేసీఆర్ కలసి పనిచేశారు. నందమూరి తారక రామారావుపై అభిమానంతో తన కుమారుడికి తారక రామారావు అనే పేరు పెట్టుకున్నారు కేసీఆర్. అయితే ఆ తర్వాత మాత్రం చంద్రబాబు అంటే కేసీఆర్, కేటీఆర్ సహా బీఆర్ఎస్ నేతలంతా ఎగిరిపడుతున్నారు. అదే సమయంలో జగన్ ని మాత్రం కేసీఆర్ బాగా దగ్గరకు తీస్తుంటారు. తాజాగా మరోసారి జగన్ పై బీఆర్ఎస్ ప్రేమ బయటపడింది. వైసీపీ హయాంలో తెలంగాణ నీళ్లను ఏపీ తీసుకెళ్లలేదని, చంద్రబాబు సీఎం అయ్యాకే ఈ ధోరణి పెరిగిందంటున్నారు జగదీష్ రెడ్డి. నాగార్జున సాగర్ పూర్తిగా చంద్రబాబు చేతుల్లోకి వెళ్లిపోయిందని చెప్పారు. తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత వరకు సాగర్ వద్ద ఏపీ సీఆర్పీఎఫ్ బలగాలను రానివ్వలేదని అన్నారాయన. ములుగు సీఆర్పీఎఫ్ బలగాలయినా, విశాఖ బలగాలయినా.. అవి కేంద్ర బలగాలు, రాష్ట్ర ప్రభుత్వాల అధీనంలో ఉన్నా కూడా అవి కేంద్ర బలగాలనే గుర్తించాలి. మరి కేంద్రానికి చెందిన బలగాలు ప్రాజెక్ట్ ల వద్ద పహారా కాస్తుంటే జగదీష్ రెడ్డికి వచ్చిన అభ్యంతరమేంటని కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు.నీటి విషయంలో గతంలో కూడా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు బీఆర్ఎస్ నేతలు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మరోసారి అవే డైలాగులు చెబుతున్నారనే ఆరోపణలు వినపడుతున్నాయి. కాళేశ్వరం తప్పుల్ని కప్పి పుచ్చుకోడానికి నానా తంటాలు పడిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని సాకుగా చూపించి ప్రజల్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. ఏపీలో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడింది. వాస్తవానికి ఎన్డీఏకి, కాంగ్రెస్ కి పూర్తిగా పొసగదు. అలాంటప్పుడు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఏపీలోని కూటమి ప్రభుత్వంతో ఎందుకు లాలూచీ పడుతుంది. ఒకవేళ పడినా, తెలంగాణ ప్రజల భవిష్యత్ ని పణంగా పెడితే అది రాజకీయంగా తమకు ఇబ్బంది అనే విషయం నాయకులకు తెలియదా..? ఈ లాజిక్ తెలియకుండా జగదీష్ రెడ్డి ఏపీ పేరు చెప్పి తెలంగాణలో పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారంటూ కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పెద్దగా పబ్లిసిటీ లేకపోవడంతో.. సభ ఫ్లాప్ అవుతుందేమోననే ఉద్దేశంతో ఇప్పుడిలా మాట్లాడుతున్నారని, ప్రజల్ని రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. మొత్తమ్మీద బీఆర్ఎస్ కి జగన్ పై సాఫ్ట్ కార్నర్ ఉందనే విషయం మరోసారి రుజువైంది. అదే సమయంలో చంద్రబాబుపై మాత్రం ఆ పార్టీ నేతలు కోపంతో రగిలిపోతున్నారు. బాబుని చూపించి తెలంగాణలో మరోసారి సెంటిమెంట్ రాజేయాలనుకుంటున్నారు.

# రామగుండంలో భూ కంప ప్రమాదం

అదిలాబాద్, ఏప్రిల్ 11, ఇదేమీ జనాలను భయపెట్టడానికి.. కంగారు పెట్టడానికి చెబుతున్న విషయం కాదు. చాలా రకాల పరిశీలనలు, అంచనాల తర్వాత తేల్చిన సంగతి ఏంటంటే.. కొద్దిరోజుల్లో తెలంగాణ ఓ భూకంపాన్ని ఎదుర్కోబోతోంది. భూకంప జోన్‌లో ఉన్న రామగుండంలో భూమి ప్రకంపనలు రావొచ్చని ఎపిక్ సంస్థ అంచనా వేసింది. కొద్ది రోజుల్లో రామగుండం సమీపంలో 5 మాగ్నిట్యూడ్‌తో ఈ భూకంపం రావొచ్చని లెక్కలు వేసింది.తెలంగాణలోని సింగరేణి ప్రాంతంలో భూకంపాలకు అవకాశం ఉంటుందని ఎప్పటి నుంచో అధ్యయనాలున్నాయి. రాష్ట్రంలో భూకంప సంభావ్యత ఎక్కువగా ఉన్న ప్రాంతం రామగుండం, గోదావరి ఖని ప్రాంతాలు. ఇప్పుడు అక్కడ త్వరలోనే ఓ మధ్యస్థాయి భూకంపం వస్తుందని ఇజూతిఞ చెబుతోంది. ఈ సంస్థ కొంతమంది భూకంప అధ్యయన ఔత్సాహికులు నిర్వహిస్తున్నారు. అందుబాటులో ఉన్న సమాచారాన్ని విశ్లేషించి వాళ్లు భూకంపాలపై ముందస్తు అంచనాలను ఇస్తుంటారు.ప్రపంచ వ్యాప్తంగా చాలా సంస్థలు తమకు అందుబాటులో ఉన్న సాంకేతికత సాయంతో భూకంపాలను ముందే అంచనా వేస్తుంటాయి. మన దేశంలో ఎన్ జీఆర్ ఐఇతర సంస్థలు ఆ పనిచేస్తున్నాయి. ఇజూతిఞ కూడా అలాంటిదే కానీ ఇది ప్రభుత్వ సంస్థనో, లేక ఓ భారీ పరిశోధనా సంస్థనో కాదు. చదువుకున్న శివ సీతారామ్ అనే భూకంప అధ్యయన ఔత్సాహికుడు దీనిని ప్రారంభించారు. కొంతమంది వాలంటరీగా ఆయనకు సహకారం అందిస్తున్నారు. ఇప్పటి వరకూ చాలా భూకంపాల ప్రిడిక్షన్ ను ఈ వేదిక ద్వారా ప్రకటించారు. వాటిలో చాలా వాటిని కచ్చితమైన నిర్ధారణ చేశారు. 2004 సునామీ చూసిన సీతారామ్‌కు భూకంపాలపై అధ్యయనం చేయాలన్న ఆసక్తి కలిగింది. ఆయనే సొంతంగా పరిశోధనలు ప్రారంభించి ఓ అల్గారిథమ్ కనుక్కొన్నారు. దాని ప్రకారం అంచనాలు ఇస్తుంటారు. వాటిని లిలిలి.బవతిబఏనీ.తిని వైబ్‌సైట్‌లో ప్రచురిస్తున్నారు. వీటిపై ప్రజలను అప్రమత్తం చేసేందుకు ఇజూతిఞ పేరుతో ట్విటర్ అకౌంట్‌ను ప్రారంభించారు. “ ఏప్రిల్ 10-17 వ తేదీల మధ్య రామగుండం సమీపంలో 5 మాగ్నిట్యూడ్‌తో భూకంపం రావడానికి అవకాశం ఉంది.” అని ఆయన ఏబీపీ దేశంతో చెప్పారు.2021 నుంచి ఇప్పటి వరకూ 22 భూకంపాలను వీళ్లు కచ్చితంగా అంచనా వేయగలిగారు. మొన్న జరిగిన మయన్మార్ భూకంపాన్ని కూడా కచ్చితమైన అంచనాతో చెప్పారు. సాధారణంగా వీళ్ల ప్రిడిక్షన్స్ భూకంప భూకంప కేంద్రం అన్నది 300కిలోమీటర్లు, భూకంప తీవ్రత 1- 1.5 మాగ్నిట్యూడ్ తేడా ఉంటుంది. అలాగే భూకంప సమయం కూడా 2 -3 నెలల వరకూ తేడా ఉండొచ్చు. మయన్మార్ లో ఫిబ్రవరి 28న భూకంపం వస్తుందని అంచనా వేయగా.. మార్చి 28న వచ్చింది. 6.5 మాగ్నిట్యూట్ అని అంచనా ఇస్తే.. 7.7 తీవ్రతతో వచ్చింది.భూకంపాల అంచనాల్లో మాకు 18 శాతం సక్సెస్ రేట్ ఉంది. ఇలాంటి పరిశోధనలు, విశ్లేషణల్లో ఇది కచ్చితంగా మెరుగైన ఫలితమే. మాకున్న వనరులు తక్కువ. మేం సొంతగా తయారు చేసుకున్న అల్గారిథమ్ వల్ల అంచనా వేయగలుగుతున్నాం. అంచనా కోసం చాలా పారామీటర్లు తీసుకుంటాం. సోలార్ రేడియేషన్, ఎలక్ట్రోమాగ్నిటిక్ వేవ్స్, అట్మాస్ఫియర్ డేటా, వెదర్ మోడల్స్ ఇలా రకరకాల పారామీటర్స్ ద్వారా అంచనా వేస్తాం. అని సీతారామ్ చెప్పారు. “వీటన్నింటినీ పరిగణలోకి తీసుకునే రామగుండంలో వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నాం. మేం ఈ వారంలోనే రావొచ్చు అనుకుంటున్నాం. తీవ్రత విషయంలోనూ.. టైమ్ విషయంలోనూ కొంత తేడా ఉండొచ్చు” కేవలం రామగుండం మాత్రమే కాదు.. దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం ధర్మశాలకు కూడా ముప్పు ఉందని వీరు సూచిస్తున్నారు. 120 ఏళ్ల క్రితం హిమాలయాల్లోని కాంగ్రా ప్రాంతంలో భారీ భూకంపం వచ్చింది. మరికొద్ది రోజుల్లో అదే ప్రాంతంలోని ధర్మశాలలో 7 మాగ్నిట్యూడ్‌తో ఓ భారీ భూకంపం వచ్చే అవకాశం కూడా ఉందని సీతారామ్ చెబుతున్నారు. భూకంపాల గురించి జనాలను భయపెట్టాలన్నది తమ ఉద్దేశ్యం కాదని.. దీని ద్వారా ప్రజలు అప్రమత్తం కావొచ్చని సీతారామ్ చెప్పారు. ఇజ్రాయెల్ లాంటి దేశాల్లో 4 మాగ్నిట్యూడ్ కంటే ఎక్కువగా తీవ్రత నమోదయ్యే పక్షంలో ప్రజలను హెచ్చరించే వ్యవస్థలు అభివృద్ధి చేశారని అలాంటివి రావాలన్న ఉద్దేశ్యంతోనే ముందస్తు అంచనాలు ఇస్తున్నామన్నారు.దక్కన్ పీఠభూమిలో ఉన్న తెలంగాణలో భూ పలకల రాపిడి వలన, గోదావరి ఫాల్ట్ లైన్స్ వల్ల భూకంపాల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. చాలా తక్కువ తీవ్రత గల భూకంపాలు తరుచుగా వస్తూనే ఉంటాయి. అవి వచ్చినట్లు కూడా తెలియదు. తెలంగాణలో 50ఏళ్లలో అతిపెద్ద భూకంపం 4 డిసెంబర్ 2024న వచ్చింది. రిక్టర్ స్కేల్‌పై 5.3 తీవ్రతతో భూకంపం సంభవించింది. వరంగల్ కు ఈశాన్యంగా 85కిలోమీటర్లు, హైదరాబాద్‌కు ఈశాన్యంగా 218 దూరంలో ములుగు సమీపంలోని భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించింది. తెలంగాణలో గడచిన 50ఏళ్లలో ఇదే అతిపెద్ద భూకంపం అని చెప్పుకోవచ్చు.హైదరాబాద్ నుంచి 300కిలోమీటర్ల పరిధి తీసుకుంటే గడచిన 10ఏళ్లలో 12 భూకంపాలు 4 అంతకంటే ఎక్కువ తీవ్రత ఉన్నవి నమోదయ్యాయి. గడచిన 50ఏళ్లలో తీసుకుంటే 5 తీవ్రతకు మించి వచ్చిన భూకంపం కిందటి డిసెంబర్‌లో ములు?గులో వచ్చింది.57 ఏళ్ల కిందట భద్రాచలంలో అతిపెద్ద భూకంపం వచ్చింది. ఏప్రిల్ 13, 1969 న రాత్రి 9గంటల ప్రాంతంలో 5.7 మాగ్నిట్యూడ్‌తో వచ్చిన ఈ భూకంప కేంద్రాన్ని భద్రాచలానికి 14.2 కిలోమీటర్ల దూరంలో గుర్తించారు. అయితే 20 కిలోమీటర్ల లోతున రావడంతో ప్రభావం తక్కువగా ఉంది. 1969లో వచ్చిన భూకంపానికి సంబంధించి ప్రాణనష్టం జరిగినట్లుగా గుర్తించలేదు. ఇప్పుడు రామగుండంలో 5 తీవ్రతతో రావొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ అంచనా నిజం కావొచ్చు? కాకపోవచ్చు. అలాగే ఆ భూకంప తీవ్రత తగ్గనూ వచ్చు.. లేదా పెరగొచ్చు. కేవలం వీళ్ల అల్గారిథమ్ ప్రిడిక్షన్ ను ఆధారంగా చేసుకునే ఈ అంచనాలు ఇచ్చారు.

# కేటీఆర్ మైండ్ గేమ్



హైదరాబాద్, ఏప్రిల్ 11,కంచ గచ్చిబౌలి భూముల అమ్మకం ముసుగులో వేల కోట్ల రూపాయల భారీ కుంభకోణం దాగుందంటూ సంచలన కామెంట్స్ చేశారు. అవి 400 ఎకరాలు కాదు.. వేల ఎకరాల వ్యవహారం ఉందన్నారు. ఆ కుంభకోణంలో ఓ బీజేపీ ఎంపీ హస్తం కూడా ఉందనేది కేటీఆర్ ఆరోపణ. 48 గంటల్లో ఆ యవ్వారమంతా బయటపెడతానంటూ కేటీఆర్ చేసిన కామెంట్స్ ఇప్పుడు తెలంగాణలో కాక రేపుతున్నాయి. కేటీఆర్ ఏం బయటపెడతారనేది కాసేపు పక్కన పెడితే.. ఇక్కడో చిన్న లాజిక్ పాయింట్ మాట్లాడుకోవాల్సిన అవసరమైతే ఉంది. కంచ గచ్చిబౌలి భూములను ఇంకా అమ్మకానికే పెట్టలేదు. ఆ 400 ఎకరాలను ఇంకా ఎవరికీ కేటాయించలేదు. వేలం కూడా వేయలేదు. అసలు అమ్మకాలే జరగనప్పుడు.. ఇంకా ఎవరికీ భూములే కేటాయించనప్పుడు.. కంపెనీలే రానప్పుడు.. వేల కోట్ల కుంభకోణం ఎలా జరుగుతుంది? ఇంత చిన్న లాజిక్‌ను కేటీఆర్ ఎలా మిస్ అవుతున్నారు?ప్రస్తుతానికి ఆ 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూములను ుఉఎఎల కి మాత్రమే కేటాయించింది తెలంగాణ సర్కారు. ఆ ల్యాండ్స్ అభివృద్ధి చేసి.. ఐటీ కంపెనీలు, అంతర్జాతీయ సంస్థలకు కేటాయించాలనేది ప్రభుత్వ ఆలోచన. ఆ ప్రక్రియలో తొలి అడుగు మాత్రమే పడింది. భూములు టీజీఐఐసీ చేతికి వచ్చాయి అంతే. ఇంకా లేఅవుట్లు కూడా చేయలేదు. టెండర్లు గట్రా పిలవలేదు. కేవలం అక్కడ పెరిగిన చెట్లను తొలగించే పని మాత్రమే మొదలుపెట్టారు. అంతలోనే అవి వర్శిటీ భూములంటూ, నెమళ్లు, జింకలు, పర్యావరణం అంటూ నానా రచ్చ జరిగింది. ఏఐ జనరేటెడ్ వీడియోలు, ఫోటోలతో ఫేక్ ప్రచారంతో అసలు నిజం ఏంటో తెలిసేలోగా.. అబద్ధ ప్రచారం దేశాన్ని చుట్టేసింది. సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. తెలంగాణ ప్రభుత్వం ఆ ఏఐ వీడియోలు, ఫోటోలపై ఉక్కుపాదం మోపుతుండటంతో ఆ ఫేక్ పోస్టులను డిలీట్ చేస్తున్నారంతా. ఆ కోవలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా ఉండటం ఆసక్తికరం.బీఆర్ఎస్ సోషల్ మీడియాను బోనులో నిలబెట్టే ప్రయత్నం కూడా జరుగుతోంది. గులాబీ సోషల్ వింగ్ హెడ్స్ కొణతం దిలీప్, క్రిషాంక్‌లను పోలీసులు విచారిస్తున్నారు. ఈ ఫేక్ ప్రచారం వెనుక ఉన్న కేటుగాళ్లు త్వరలోనే బయటకు వస్తారు. ఇలా వ్యవహారం బీఆర్ఎస్, బీజేపీ బడా నేతల మెడకు చుట్టుకుంటుండటంతో.. కావాలనే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగా కేటీఆర్ అలా మైండ్ గేమ్ ఆడుతున్నారా? అనే అనుమానమూ వ్యక్తం చేస్తున్నారు.ఇక్కడే కేటీఆర్ చాలా జాగ్రత్తగా స్కెచ్ వేశారని అంటున్నారు. కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం వెనుక ఓ బీజేపీ ఎంపీ హ్యాండ్ కూడా ఉందని అనడం వ్యూహాత్మకమే కావొచ్చు. కాంగ్రెస్, బీజేపీలు ఉప్పు-నిప్పు. కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఆ రెండు పార్టీలకు అస్సలు పడదు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సీఎం రేవంత్‌రెడ్డి తరుచూ విమర్శలతో కుళ్లబొడుస్తుంటారు. అటువైపు నుంచీ మాటల దాడి తీవ్రంగానే ఉంది. కానీ, కేటీఆర్ మాత్రం ఆ రెండు పార్టీలు తెరవెనుక కలిసి పని చేస్తున్నాయని పదే పదే అంటున్నారు. అబద్దాన్ని నిజమని నమ్మించే ప్రయత్నం గట్టిగా చేస్తున్నారని అంటున్నారు. అందులో భాగంగానే.. కంచ గచ్చిబౌలి భూముల తతంగం వెనుక బీజేపీ ఎంపీ కూడా ఉన్నారంటూ అక్రమ సంబంధం అంటగట్టేస్తున్నారని అనుమానిస్తున్నారు. విద్యార్థులను రెచ్చగొట్టిందే బీజేపీ అని విమర్శలు ఉన్నాయి. ఆ పార్టీ స్టూడెంట్స్ వింగ్ ఏబీవీపీ ఆధ్వర్యంలోనే విద్యార్థులు రోజుల తరబడి ఆందోళనలు చేశారు. మరి, కేటీఆర్ మాత్రం ఆ భూముల వెనుక స్కాం ఉందని.. అందులో బీజేపీ ఎంపీ రోల్ కూడా ఉందని ఆరోపిస్తున్నారు. ఇదంతా జనాలను కన్ఫ్యూజ్ చేసి.. ఆ కన్ఫ్యూజన్‌లో తాము కొంతకాలం పాటు రాజకీయ చలిమంట కాచుకోవాలనే మైండ్ గేమ్ మినహా మరొకటి కాకపోవచ్చని విశ్లేషిస్తున్నారు.

# ఆదరణ ఉన్నా... తప్పని స్థితి జనఔషధి కేంద్రాలు

హైదరాబాద్, ఏప్రిల్ 11, ‘దేశ ప్రజలకు తక్కువ ధరకు నా ణ్యమైన మెడిసిన్ అందివ్వాలి.. తద్వారా వారి ఆరోగ్య సంరక్షణకు భరోసా ఇవ్వాలి’ అనే ధ్యేయంతో 2008లో కేంద్ర ప్రభు త్వం ‘భారతీయ జన ఔషధి పరియోజన’ పథకానికి శ్రీకారం చుట్టింది. దేశ వ్యాప్తం గా వేలాది ‘జన ఔషధి’ కేంద్రాలను ప్రా రంభించింది. 28 ఫిబ్రవరి 2025 నాటికి దేశవ్యాప్తంగా కేంద్రాల సంఖ్య 15,057గా నమోదైంది.వచ్చే ఏడాది మార్చి నాటికి ఆ సంఖ్యను 25,000కు పెంచాలని కేం ద్రం లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. కేంద్ర ప్ర భుత్వం తెలంగాణకు కేవలం 199 కేం ద్రా లు కేటాయించినప్పటికీ, వాటికి వినియోగదారుల నుంచి మంచి ఆదరణ లభి స్తు న్నది. సంఖ్యాపరంగా మన రాష్ట్రం దేశం లో 19వ స్థానంలో నిలుస్తున్నది. కేం ద్రా ల్లో లభించే జనరిక్ మెడిసిన్‌కు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తున్నప్పటికీ, డిమాండ్‌కు తగిన విధంగా కేంద్రం రా ష్ట్రంలో కేంద్రాల సంఖ్యను పెంచడం లేదు. దేశవ్యాప్తంగా 15,057 జన్ ఔషధి కేం ద్రాల సంఖ్య ప్రకారం.. ప్రతి 10 లక్షల జనాభాకు 11 కే?ంద్రాలు అందుబాటులో ఉన్నట్లు లెక్క. కానీ.. తెలంగాణకు కేటాయించిన 199 కేంద్రాల పరంగా చూస్తే.. ప్రతి 10 లక్షల జనాభాకు కేవలం 2.4 కేం ద్రాలు ఉన్నట్లు తేలింది. రాష్ట్రంలో మరి న్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాం డ్ ప్రజల నుంచి వ్యక్తమవుతున్నది. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఏర్పా టు చేసిన జన ఔషధి కేంద్రాల్లో తెలంగాణ వాటా కేవలం 1శాతం అయిన ప్పటికీ.. ఆ కేంద్రాల్లో వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతుండడం విశే షం. మరోవైపు ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 1,427, గుజరాత్‌లో 943, మహా రాష్ట్రలో 784 కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. చివరి స్థానాల్లో మేఘాలయ, నాగాలాండ్ రాష్ట్రాలు నిలిచాయి.ప్రస్తు తం మేఘాలయలో 47, నాగాలాండ్‌లో 46 కేంద్రాల ద్వారా వినియోగదారులకు జనరిక్ మెడిసిన్ లభిస్తున్నది.దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడులో తమిళనాడులో 337, కర్ణాటక 473, ఆంధ్రప్రదేశ్ 276, తెలంగాణలో 199 జన ఔషధి కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. చివరి స్థానంలో కేరళ ఉంది.ఇక్కడ కేవలం 103 కేంద్రాలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.ఔషధి కేంద్రాల్లో లభించే ఒక్కో జనరిక్ మెడిసిన్‌పై వినియోగదారులకు 50 శా తం నుంచి 90శాతం రాయితీ లభిస్తుం ది. ఇక్కడ లభించే మెడిసిన్ వందశాతం డబ్ల్యూహెచ్‌వో నిర్దేశించిన గుడ్ మాన్యుఫ్యాక్చరింగ్ (జీఎంపీ), భారత అక్రిడిటిటేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ (ఎన్ఏబీహెచ్) నాణ్యతా ప్రమాణాలతో తయారు చేసినవి కావడంతో కేంద్రాలకు రోజురోజుకూ మెడిసి న్‌కు ఆదరణ పెరుగుతున్నది. ఈ కేంద్రా లు ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో నడుస్తున్నాయి. కేంద్రాలతో ఔత్సాహిక వ్యాపారులకు సైతం చేయూతనివ్వడం జన ఔషధి పథక లక్ష్యాల్లో ఒక లక్ష్యం.

# విభజన సమస్యలపై అడుగులు

హైదరాబాద్, ఏప్రిల్ 112014లో ఉమ్మడి ఏపీ విడిపోయి.. రెండు రాష్ట్రాలుగా విడిపోయిన విషయం తెలిసిందే. అయితే.. ఆ తర్వాత.. కేంద్రంలో ప్రభుత్వం మారడంతో.. విభజన చట్టంలోని చాలా సమస్యలు అపరిష్కృతంగానే ఉండి పోయాయి. అప్పటి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా కేంద్రానికి పలు రూపాల్లో విన్నపాలు చేస్తూనే ఉన్నాయి. అయితే.. ఎట్టకేలకు.. తాజాగా కేంద్ర హోం శాఖ ఈ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టింది.ముఖ్యంగా విభజన చట్టం-2014లోని షెడ్యూల్ 9, 10లలోని సంస్థలు, ఆస్తుల విభజనపై కేంద్రం దృష్టి పెట్టింది. అదేసమయంలో ఉమ్మడి ప్రాజెక్టుల పూర్తికి కూడా.. ప్రయత్నాలు ప్రారంభించింది. దీంతో వడి వడిగానే ఈ సమస్యలు కొంతవరకైనా పరిష్కారం అయ్యేందుకు అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గత రెండు మాసాల్లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సైతం ఆయా రాష్ట్రాల ప్రయోజనాలు పరిరక్షిస్తూనే.. విభజన చట్టంలోని అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారుఈ నేపథ్యంలో ఆయా సమస్యల పరిష్కారంపై దృష్టి పెడుతూ.. తాజాగా కేంద్ర హోం శాఖ నోట్ విడుదల చేసింది. షెడ్యూల్ 9లోని కార్పొరేషన్లు, కంపెనీల పంపకం అత్యంత కీలకంగా మారింది. అదేవిధంగా షెడ్యూల్ 10లోని సంస్థల విభజన(ఆర్టీసీ సహా ఇతర సంస్థలు)ను వేగంగా చేపట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. అలాగే.. రెండు రాష్ట్రాల్లో చేపట్టిన వివిధ మౌలిక సదుపాయాలు, విద్యా సంస్థల ప్రాజెక్టుల పురోగతిని కూడా కేంద్రం పరిశీలిస్తోంది.అదేవిధంగా వెనుకబడిన జిల్లాలకు ఇచ్చే నిధుల విషయంపైనా కేంద్రం క్లారిటీ ఇచ్చే ప్రయత్నం చేస్తోం ది. ఈ క్రమంలో ఏపీకి 350 కోట్లు, తెలంగాణకు 270 కోట్ల రూపాయలను ఇవ్వనుంది. దుగ్గరాజపట్టం వద్ద పోర్టు నిర్మాణానికి, కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి కూడా త్వరలోనే మార్గం సుగమం కానుందని అధికార వర్గాలు చెబుతున్నారు. సో.. ఎలా చూసుకున్నా.. సుదీర్ఘ విరామంతర్వాత.. రెండు రాష్ట్రాల విభజన చట్టంలోని అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కేంద్రం రెడీ అయింది.

# మహాత్మా పూలేకు జగన్ నివాళులు

విజయవాడ మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైయస్.జగన్ సందర్భంగా పూలే చిత్రపటానికి తన నివాసంలో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగి రమేష్, మాజీ ఎంపీ మార్గాని భరత్, ఎమ్మెల్సీలు కే ఆర్ జె భరత్, లేళ్ల అప్పిరెడ్డి, ఆర్ రమేష్ యాదవ్, మొండితోక అరుణ్ కుమార్, కృష్ణా జిల్లా జడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, వైయస్సార్సీపీ నేతలు దేవినేని అవినాష్, ఉప్పాల రాము తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించిన అధికారులు

అమరావతి,11 ఏప్రిల్: మహాత్మా జ్యోతి బా పూలే 199 వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో పలువురు అధికారులు జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.సియం కార్యదర్శి ఎవి రాజమౌళి,రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,ఐటి శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ తదితర అధికారులు పాల్గొని జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ఇతర విభాగాల అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మంగళగిరికి ఇచ్చిన ప్రత్యేక హామీలను యుద్ధప్రాతిపదికన అమలుచేస్తాం

# ఈ నెల 13న మంగళగిరి వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

## రోజురోజుకీ ఇంటి పట్టాల సంఖ్య పెరుగుతోంది

## లీప్ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో మొదటి పాఠశాలను మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తాం

## మంగళగిరిలో శాశ్వత ఇంటి పట్టాల పంపిణీలో మంత్రి నారా లోకేష్

## నాలుగో రోజు ఉదయం రత్నాలచెరువుకు చెందిన 600 మందికి ఇంటి పట్టాలు అందజేత

మంగళగిరి నియోజకవర్గానికి ఇచ్చిన ప్రత్యేక హామీలను యుద్ధప్రాతిపదికన అమలుచేస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మన ఇల్లు-మన లోకేష్ కార్యక్రమంలో భాగంగా నాలుగో రోజు ఉదయం మంగళగిరి డాన్ బాస్కో స్కూల్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సభలో రత్నాలచెరువుకు చెందిన 600 మంది పేదలకు శాశ్వత ఇంటి పట్టాలు అందజేశారు. ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. కొన్ని నిర్ణయాలు మన జీవితాలనే మార్చేస్తాయి. మంగళగిరిలో పోటీ చేయాలని 2019లో నేనొక నిర్ణయం తీసుకున్నా. మీ సమస్యలేంటో నాకు తెలియదు. నేనేంటో మీకు తెలియదు. ఎన్నికలకు 21 రోజుల ముందు టీడీపీ అభ్యర్థిగా పోటీచేశా. 5,300 ఓట్లతో ఓడిపోయా. మొదటి రోజు బాధ కలిగింది, ఆవేదన కలిగింది. రెండో రోజు నుంచి ఆ బాధ, ఆవేదన నాలో కసి పెంచింది. ప్రజలకు మంచి పనులు చేసి వారి మనస్సు గెలుచుకోవాలని ఆనాడే నేను నిర్ణయించుకున్నా. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మంగళగిరి ప్రజల కోసం 26 సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాం ఒక్కసారి ఆలోచించండి.

2019 నుంచి 2024వరకు ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ మీ ఆరోగ్యం కోసం ఎన్టీఆర్ సంజీవని తీసుకురావడం జరిగింది. తాడేపల్లిలో, మంగళగిరిలో, దుగ్గిరాలలో క్లినిక్ ఏర్పాటుచేసి నేటికీ కొనసాగిస్తున్నాం. ఈ రోజుకీ సొంత నిధులతో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం. కుటుంబంలో పెళ్లి జరిగితే పెళ్లి కానుక ఇస్తున్నాం. మహిళలు సొంత కాళ్లపై నిలబడేలా ఉచితంగా కుట్టు మిషన్ ఇవ్వడంతో పాటు శిక్షణ కూడా అందించాం. వారికి ఉపాధి కూడా కల్పిస్తున్నాం. గత ప్రభుత్వం నీరు సక్రమంగా అందించలేకపోతే వాటర్ ట్యాంకర్ల ద్వారా నీరు అందించాం. యువత క్రికెట్ ఆడేందుకు మంగళగిరి ప్రీమియర్ లీగ్ ఏర్పాటుచేశాం. కోవిడ్ సమయంలో ఆక్సిజన్ సిలిండర్లతో పాటు మందులు అందించాం. అమెరికా డాక్టర్ల ద్వార టెలీమెడిసిన్ అందజేశాం. ఈ విధంగా దాదాపు 26 సంక్షేమ కార్యక్రమాలు మంగళగిరి ప్రజల కోసం చేపట్టడం జరిగింది.

ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని చెప్పా

2024 ఎన్నికల్లో రెండు స్థానాల్లో పోటీ చేయాలని చాలా మంది చెప్పారు. ఐదేళ్లు కష్టపడ్డా, మంగళగిరి ప్రజల మనస్సు గెలుచుకున్నానని ఆనాడు చెప్పా. ఒకే స్థానం నుంచి పోటీ చేస్తా.. అది మంగళగిరి నుంచే పోటీచేస్తానని చెప్పా. ప్రచారంలో వి ా



వద్దకు వచ్చాను. ఏ మెజార్టీతో అయితే ఓడిపోయానో దాని పక్కన సున్నాపెట్టి 53వేల ఓట్లతో గెలిపించాలని కోరా. మీరు ఎంత ఎక్కువ మెజార్టీ ఇస్తే అంత బలమొస్తుందని చెప్పా. సర్వేల్లో కుప్పం కంటే ఒక్క శాతం వెనుకబడి ఉన్నాం. మీరు చూపించిన అభిమానం, ప్రేమ చూసి ఒక్క ఓటు అన్నా ఎక్కువ వస్తుందని బాబు గారితో ఛాలెంజ్ చేశా. మంగళగిరి ప్రజలు ఎవరూ ఊహించని విధంగా 91వేల ఓట్ల మెజార్టీతో గెలిపించి శాసనసభకు పంపించారు.

ఈ నెల 13న మంగళగిరి వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన

మీరు ఇచ్చిన మెజార్టీ కొండంత బలం. దశాబ్దాల కల వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి. ఏపీలో మొదటి వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి మంగళగిరి నియోజకవర్గానికి శాంక్షన్ అయింది. ఈ నెల 13న శంకుస్థాపన చేస్తున్నాం. ఏడాదిలోగా పూర్తిచేస్తాం. చిల్లపల్లి గారు బాధ్యత తీసుకుంటారు. పార్క్ లు, చెరువులను అభివృద్ధి చేస్తున్నాం. భూగర్భ డ్రైనేజీ, భూగర్భ వాటర్ పైప్ లైన్, భూగర్భ గ్యాస్, కరెంట్ ప్రాజెక్టులు చేపడుతున్నాం. జూన్, జులైలో ఆ కార్యక్రమాలు కూడా చేపడతాం. కొండ దిగువన లక్ష్మీ నరసింహస్వామి వారి దర్శనం తర్వాత పానకాల స్వామి గుడికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నామని చాలామంది చెప్పారు. దీంతో ఉచితంగా బస్సు ఏర్పాటుచేశాం. మంగళగిరి, తాడేపల్లి నుంచి ఎయిమ్స్ కు వెళ్లేందుకు రెండో బస్సు కూడా ఉచితంగా ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుచేయడం జరిగింది.

ఇచ్చిన ప్రతి హామీ పద్ధతి ప్రకారం నిలబెట్టుకుంటూ పోతున్నాం.

రోజురోజుకీ ఇంటి పట్టాల సంఖ్య పెరుగుతోంది

దశాబ్దాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న ఇళ్లకు శాశ్వత ఇంటి పట్టా ఇవ్వాలని ఆనాడు కోరారు. తొలి విడత సంవత్సరంలోగానే ఇస్తానని చెప్పా. ఎండోమెంట్, రైల్వే భూముల్లో నివాసం ఉంటున్న వారికి శాశ్వత ఇంటి పట్టాలు ఇచ్చేందుకు మరో సంవత్సరం పడుతుందని ఆనాడే చెప్పా. అటవీ, కాలువ, కొండపోరంబోకు భూములకు కొంత సమయం పడుతుంది. ఇచ్చిన హామీ నిలబెట్టుకునేందుకే మీ లోకేష్ ఈ రోజు మీ ముందు నిలబడ్డాడు. కూటమి నాయకులందరూ కలిసికట్టుగా అధికారులతో మీ ఇంటికి వచ్చి కప్పు కాఫీ కూడా తాగకుండా కొలతలు తీసుకుని వివరాలు సేకరించారు. రెవెన్యూ మంత్రి అనగాని గారితో మాట్లాడి సహకరించాలని కోరా. ఈ జీవో రాష్ట్ర ప్రజలకు కూడా పనికి వస్తుందని చెప్పా. అనగాని ప్రోత్సాహంతో ఈ రోజు మంగళగిరి నియోజకవర్గంలో మొదటి విడతలో సుమారుగా 3200 కుటుంబాలకు ఉచితంగా ఇంటి పట్టాలు ఎన్డీయే ప్రభుత్వం అందజేయడం జరుగుతోంది. ఈ సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది.

లీప్ కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో మొదటి పాఠశాల మంగళగిరి నియోజకవర్గంలో అభివృద్ధి చేస్తాం

ఈ ఆస్తి విలువ వెయ్యి కోట్ల రూపాయలు. నేనిచ్చే పట్టాతో వెంటనే రిజిస్టర్ చేసుకోవచ్చు. రెండేళ్ల తర్వాత అమ్ముకునే హక్కు కూడా వస్తుంది. శాశ్వత హక్కు ఎన్డీయే ప్రభుత్వం మీకు అందజేస్తోంది. ఇది మనందరి దశాబ్దాల కల. ఆ హామీని నిలబెట్టుకునేందుకే మీ ముందుకు వచ్చా. లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేస్తాం. విద్యాశాఖ మంత్రిగా లీప్ (లెర్నింగ్ ఎక్స్ లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్) కార్యక్రమాన్ని చేపడుతున్నాం. ఇందులో భాగంగా అంతర్జాతీయ ప్రమాణాలతో మొదటి స్కూల్ మంగళగిరి నియోజకవర్గంలోనే అభివృద్ధి చేయబోతున్నాం. 50 రోజుల్లో పాఠశాల రూపురేఖలు మారిపోవాలని అధికారులతో చెబుతున్నా. పట్టుదలతో పనిచేస్తున్నా.

మంగళగిరికి ఇచ్చిన ప్రత్యేక హామీలను యుద్ధప్రాతిపదికన అమలుచేస్తాం

మంగళగిరి ప్రజలు అన్నివిధాలుగా నాకు అండగా నిలిచారు. అవినీతి రహిత పాలన అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మంగళగిరి ప్రజలను నా గుండెల్లో పెట్టుకుని అహర్నిశలు పనిచేస్తా. సూపర్ సిక్స్ లో కొన్ని హామీలు మే నెలలో నిలబెట్టుకోబోతున్నాం. మంగళగిరికి ఇచ్చిన ప్రత్యేక హామీలను యుద్ధప్రాతిపదికన అమలుచేస్తామని చెప్పారు

## ఆగిరిపల్లిలో సీఎం చంద్రబాబు పర్యటన

నూజివీడు ఆగిరిపల్లిలో పలు కార్యక్రమాలలో పాల్గొనే నిమిత్తం విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కు రాష్ట్రమంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం 10.40 ని. లకు హెలికాప్టర్ ద్వారా అగిరిపల్లి చేరుకున్న ముఖ్యమంత్రికి రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి రాష్ట్ర గనుల శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర, , స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రివర్యులు గుమ్మడి సంధ్యారాణి, నూజివీడు బ్రాండ్ ఐన మామిడిపండ్ల బుకే లు అందించి స్వాగతం పలికారు. తరువాత ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), పత్సమట్ల ధర్మరాజు, డా. కామినేని శ్రీనివాస్, సొంగా రోషన్ కుమార్, ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్, ఏలూరు రేంజి ఐజి జి.వి.జి. కిషోర్ కుమార్, జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి, ఎస్పీ కె. ప్రతాప్ శివకిశోర్, జిల్లా జాయింట్ కలెక్టర్ పి . ధాత్రిరెడ్డి, సబ్ కలెక్టర్ స్మరణ రాజ్, కావు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారావు, మాజీ శాసనసభ్యులు గన్ని వీరాంజనేయులు, ఘంటా మురళి రామకృష్ణ,పీతల సుజాత, ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, ప్రభృతులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు..

## 30 బోర్లు తవ్వినా జాడలేని 'గంగమ్మ'! అలసిపోయిన అన్నదాత ఆత్మహత్య,

నిర్మల్:రైతుకు పొలమే జీవితం. అది పచ్చగా కళకళలాడేందుకు ప్రాణం పెడతాడు. ఈ ప్రయాణంలో కట్టు కున్న భార్యను, కన్నబిడ్డలనూ మరిచిపోతాడనేందుకు నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం రాజురా గ్రామానికి చెందిన రైతు పతాని నడిపి మల్లన్న (56) జీవితమే నిద ర్శనం. పొలంలో నీటి జాడ కనుగొనేందుకు పదేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు ఫలితం ఇవ్వకపోవడంతో ఆయన తన సొంత పొలంలోనే ఉరేసుకున్నారు. కుటుంబాన్ని కష్టాల సంద్రంలో వదిలేశారు. మల్లన్నకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె కు వివాహం చేయగా, కుమారుడు పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుని ఉద్యోగ అన్వే షణలో ఉన్నాడు. తమకున్న ఏడెకరాల పొలంలో మల్లన్న వరి, మొక్కజొన్న సాగు చేస్తుండేవారు. సరైన నీటి లభ్యత లేకపోవడంతో పదేళ్ల వ్యవధిలో ఏకంగా 27 బోర్లు వేయించారు. ఒక్కదాంట్లోనూ నీరు పడలేదు. ఎలాగైనా నీరు పొందాలనే తాపత్రయంతో ఈ ఏడాది మరో మూడు బోర్లు తవ్వించారు. ఒక్కటి కూడా ఫలితం ఇవ్వలేదు. 30 బోర్లు తవ్వించినా గంగమ్మ తల్లి కరుణించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. మరోవైపు బోర్లు తవ్వించడానికి చేసిన అప్పులు పెరిగిపోయాయి. నానాకష్టాలు పడి చాలావరకు తీర్చేయగా మరో రూ.5 లక్షల వరకు మిగిలాయి. వీటి నుంచి ముక్తి లభించే మార్గం కనిపించకపోవడంతో తన పొలంలోని చెట్టుకు ఉరేసుకుని ప్రాణాలు వదిలారు..

## మహాత్మా జ్యోతిబా పూలే సమాజానికి అందించిన సేవలు మరువలేనివి :సిఎస్ విజయానంద్



విజయవాడ,11 ఏప్రిల్: మహాత్మా జ్యోతి బా పూలే 199వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయా నంద్ పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళు లు అర్పించారు.అదే విధంగా రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా తదితర అధికారులు పాల్గొని జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.

ఈసందర్భంగా సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ సమాజానికి పూలే అందించిన సేవలు ఎనలేనివని మహారాష్ట్రలో జన్మించిన కుల వ్యతిరేక కార్యకర్త,రచయిత,ఆలోచనా పరుడు మరియు సామాజిక సంస్కర్త జ్యోతిబా పూలే అని పేర్కొన్నారు.అదే విధంగా భారతదేశంలో సామాజిక మార్పును పెంపొందించడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు.ఆయన జయంతి రోజైన నేడు దేశ పౌరులు బహుముఖ ప్రజ్ఞాశాలైన సామాజిక సంస్కర్త గురించి ప్రతి ఒక్కరూ తెల్సుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.అంతేగాక జ్యోతిబా పూలే భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళల విద్య కోసం విశేష కృషి చేశారని చెప్పారు.పూలే సమాజానికి చేసిన సేవలను గుర్తుంచుకుని సామాజిక సంస్కర్తగా ఆయన కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులు మరియు చేసిన త్యాగాలను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సిఎస్ అన్నారు.

1873లో కుల వ్యవస్థ వల్ల కలిగే సామాజిక ఆర్థిక అసమానతలను తిప్పికొట్టడానికి సత్యశోధక్ సమాజ్ ("సత్యశోధక్ సమాజ్") అనే సంస్కరణ సంఘాన్ని పూలే స్థాపించారని సిఎస్ విజయానంద్ ఈసందర్భంగా గుర్తు చేశారు.పూలే బాల్య వివాహాలను వ్యతిరేకించడం తోపాటు వితంతు పునర్వివాహం చేసుకునే హక్కును సమర్థించారని సిఎస్ విజయానంద్ గుర్తు చేశారు.

ఈకార్యక్రమంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నేడు చిన్న హనుమాన్ జయంతి

కొడిమ్యాల, రుద్రుడి అంశతో జన్మించిన హనుమంతుడు రావణుడిని నిర్మూలించి భూమిపై ధర్మాన్ని స్థాపించాలనే తపనతో రాముడికి (విష్ణువు అవతారం) సేవ చేయడానికి మరియు సహాయం చేయడానికి జన్మించాడు. హనుమంతుడు రామునికి అత్యున్నత భక్తుడు.

ఈ హనుమాన్ జయంతి సందర్భంగా గురించి హనుమాన్ జయంతి గురించి మనం తెలుసుకోవాలి..రామాయణం లో సుందరాకాండ లో వివరించిన ప్రకారం.. రావణుడు అపహరించినప్పుడు సీతాన్వేషణకై లంకకు బయలుదేరిన హనుమంతుడు సీతమ్మను వెతుకుతూ చివరకు ఓ మంగళవారం తెల్లవారుజామున అశోకవనంలో సీతాదేవి ఆచూకీ కనుగొన్నాడు. ఆరోజు చైత్రమాసం, చిత్రా నక్షత్రం, పౌర్ణమి రోజు. సీతమ్మను కనుగొన్న ఆనందంలో హనుమంతుడు అశోక వనాన్ని ధ్వంసం చేసి, రావణ సైనికులను హతమారుస్తాడు. అనంతరం రావణాసురుని సైన్యం హనుమంతుని తోకకు నిప్పంటించగా ఆ తోకతో హనుమంతుడు సగం లంకను దహనం చేస్తాడు. హనుమంతుడు రావణ సైన్యంపై విజయం సాధించినందుకు గుర్తుగా చైత్ర శుద్ధ పౌర్ణమి రోజును హనుమంతుని విజయోత్సవంగా జరుపుకోవాలి. ఇది తెలియని వారు ఆ రోజును హనుమాన్ జయంతిగా జరుపుకుంటారు. ఇది ప్రతి ఏటా ఏప్రిల్లో వస్తుంది.నిజానికి హనుమజ్జయంతి వైశాఖ మాసం బహుళ పక్షంలో వచ్చే దశమి, పూర్వాభాద్ర నక్షత్రం రోజున నిర్వహించాలి. ఈ పండుగ సాధారణంగా ప్రతి సంవత్సరం మే నెల చివరిలో కానీ, జూన్ మొదటి వారంలో కానీ వస్తుంది. పురాణాల ప్రకారం శనివారమే అసలైన హనుమజ్జయంతి. హనుమంతుడు పై ఉన్న ఏకైక ప్రామాణికమైన పుస్తకం పరాశర సంహితలో కూడా ఈ విషయం నిర్ధారించారు. ఈ పుస్తకం ప్రకారం హనుమంతుడు జయంతి ఉత్సవాలు జరుపుకోవాలి. ఈ రోజే అసలైన హనుమంతుని జయంతి. ఇక మనం హనుమంతుని నుండి స్వీకరించాల్సినవి..హనుమంతుడు తన ఇంద్రియాలపై పూర్తి నియంత్రణ కలవాడు..హనుమంతుడు వాయు కుమారుడు, అది గాలి.. మరియు అతను ఐదు ఇంద్రియాలను సూచిస్తాడు – అవి వాసన, రుచి, దృష్టి, స్పర్శ మరియు వినికిడి. హనుమంతుడు విశ్వంలోని ఐదు ప్రాథమిక అంశాలను సూచించే ఐదు ఇంద్రియాలను – భూమి, నీరు, ఆకాశం, అగ్ని మరియు గాలి – పైన నియంత్రణ చూపే ప్రావీణ్యం సంపాదించాడు..ప్రతీ ఒక్కరు ఇంద్రియాలను అదుపులో ఉంచుకుంటే..గొప్ప కార్యాల్ని సైతం అవలీలగా సాధించవచ్చు అని తెలుసుకోవచ్చు.

## ఒంటిమిట్టలో శ్రీ సీతారామ లక్ష్మణులకు స్వర్ణ కిరీటాలు



ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామాలయానికి సుమారు రూ.6.60 కోట్ల విలువైన మూడు వజ్రాలు పొదిగిన స్వర్ణ కిరీటాలను, పెన్నా సిమెంట్స్ అధినేత ప్రతాప్ రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులతో కూడి శుక్రవారం నాడు విరాళంగా అందించారు.దాదాపు 7 కేజీల బంగారంతో తయారు చేసిన ఈ స్వర్ణ కిరీటాలను ఆలయంలో టీటీడీ చైర్మన్ బిఆర్ నాయుడు, ఈవో శ్యామలరావులకు దాత అందించారు.

అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి, ఈ కిరీటాలను శ్రీ సీతారామ లక్ష్మణుల మూలమూర్తులకు అలంకరించారు.

## మహిళాభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావ్ పూలే
## జిల్లా ఎస్పీ వకుల్ జిందల్




విజయనగరం సామాజికతత్వవేత్త, సంఘసేవకుడు జ్యోతీరావ్ పూలే జన్మదిన వేడుకలను జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయంలో ఏప్రిల్ 11న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిధిగా హాజరై, జ్యోతిరావ్ పూలే చిత్ర పటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ - అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనకు, మహిళోద్ధరణకు జ్యోతిరావ్ పూలే విశేషంగా కృషి చేసి, సమాజంలో మార్పు తీసుకొని వచ్చారన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కోసం పని చేసి, తక్కువ కులాల ప్రజలు, మహిళలకు విద్యను అందించేందుకు ప్రయత్నాలు సాగించి, ప్రసిద్ధి చెందారన్నారు. బాలికలు విద్యను అభ్యసించేందుకు పాఠశాలలను, వితంతువుల కోసం ఒక గృహాన్ని స్థాపించి, తన భార్య సావిత్రిబాయి పూలే సహకారంతో మహిళాభ్యున్నతికి కృషి చేసారన్నారు. సమాజంలో సగ భాగమున్న మహిళలు అభివృద్ధి చెందాలని, అందుకు వారు విద్యావంతులు కావాలని, మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలను ప్రారంభించారన్నారు.లి స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని అభిప్రాయపడ్డారన్నారు. ఇతరులకు ఆదర్శంగా ఉండాలని భావించిన జ్యోతిరావ్ పూల్ తన భార్య సావిత్రిబాయి పూలేని విద్యను అభ్యసించేందుకు పాఠశాలలకు పంపి, మహిళలు విద్యను అభ్యసించాలని ప్రోత్సహించారన్నారు. వితంతువుల పునర్వివాహాలను కోసం ప్రజల్లో చైతన్యం తీసుకొని వచ్చి, మహిళలకు అండగా జ్యోతిరావ్ పూలే నిలిచారన్నారు. అటువంటి మహనీయుడు నేడు మన మధ్య లేకపోయినప్పటికీ, వారి జన్మదినం రోజున వారిని స్మరించుకోవడం మనందరి బాధ్యతని, జ్యోతిరావ్ పూలే సేవలను కొనియాడారు.

తరువాత , జ్యోతిరావ్ పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బీ సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కే.చౌదరి, ఆర్ఐ టి.శ్రీనివాస రావు, ఎఓ పి.శ్రీనివాసరావు, ఆఫీసు పర్యవేక్షకులు టి.రామకృష్ణ, వెంకటలక్ష్మి మరియు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, జ్యోతిరావ్ పూలే చిత్ర పటానికి పూలను సమర్పించి, నివాళులు అర్పించారు.

## విద్య ప్రాముఖ్యతను చాటి చెప్పిన మహనీయులు మహాత్మ జ్యోతిబా పూలే
## – జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి ప్రతినిధి: చదువుతోనే జీవితంలో మార్పు సాధ్యమని విద్య మ ప్రాముఖ్యతను చాటి చెప్పిన మహనీయులు మహాత్మా జ్యోతిబా పూలే అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.

శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ మహాత్మ జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకల్లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అదనపు కలెక్టర్ డి.వేణు లతో కలిసి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి, జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ గతంలో వర్ణ వ్యవస్థ, కుల వ్యవస్థ కారణంగా దళితులు, బడుగు బలహీన వర్గాల పట్ల తీవ్ర వివక్షతకు గురయ్యేవారని అన్నారు. 1827 లో మహిళలను సమానంగా చూడటం అనే ఆలోచన కూడా చాలా కష్టమని, అటువంటి పరిస్థితుల్లో మహిళల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులు పూలే అని కలెక్టర్ అన్నారు. సామాజిక సమానత్వం సాధన కోసం జ్యోతి బా పూలే అప్పటి సమాజంలో పోరాటం చేశారని, ఆ స్ఫూర్తి మనమంతా తీసుకోవాలని, సామాజిక అసమానతలు దూరమయ్యేందుకు మన వంతు కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాలికల విద్యపై పూలే దంపతులు చిత్తశుద్ధితో పనిచేశారని, స్త్రీలు విద్యా వంతులు కావాలని ఆకాంక్షిం చారని తెలిపారు. అట్టడుగు బడుగు బలహీన వర్గాలకు మంచి విద్య అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, యంగ్ ఇండియా సమీకృత విద్యాలయాల ఏర్పాటు, బీసీ స్టడీ సర్కిల్, ఎస్సి స్టడీ సర్కిల్ ద్వారా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు ఉచిత శిక్షణ అందించడం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఒక రాత్రిలో అనూహ్యమైన మార్పులు రానప్పటికి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నిదానంగా స్పష్టమైన మార్పు కనిపిస్తుందని, మెరుగైన విద్యాబోధన అందించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటు న్నామని కలెక్టర్ తెలిపారు.

మహనీయుల జయంతి ఉత్సవాలలో వచ్చిన వక్తలు అడిగిన వివిధ అంశాలను అధికారులు సంపూర్ణంగా వివరించాలని, మహనీయుల ఆశయాల సాధన కోసం, సమాజంలోని వివిధ వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమా లను చివరి అర్హుల వరకు అందే విధంగా ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి జే.రంగా రెడ్డి, కలెక్టరేట్ సి విభాగం పర్యవేక్షకులు ప్రకాశ్, జిల్లా టీఎన్జీవో అధ్యక్షులు బొంకూరి శంకర్, బీసీ సంక్షేమ సంఘం నాయకులు ఎన్. శంకర్, వివిధ ప్రజా ప్రతినిధు లు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, అన్ని వర్గాల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## సోషల్ మీడియా సైకోలను రోడ్డు మీద ఉరి తీయాలివైఎస్ షర్మిలా రెడ్డి



విజయవాడ భారతి రెడ్డి మీద సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు చాలా బాధాకరం. ఇలాంటి నీచపు కామెంట్స్ తీవ్రవాదంతో సమానమని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలారెడ్డి అన్నారు. ఈ సైకో గాళ్లను నడి రోడ్డు మీద ఉరి తీసినా తప్పులేదు. తప్పుడు కూతలు కూసిన వెధవలను, రేటింగ్స్ కోసం ఎంటర్ టైన్ చేసే యూట్యూబ్ ఛానళ్లపై కఠిన చర్యలు ఉండాల్సిందే. కూటమి ప్రభుత్వాన్ని సాటి మహిళగా డిమాండ్ చేస్తున్నా. సమాజం ఇలాంటి మకిలి చేష్టలను హర్షించదు. ఏ పార్టీ వాళ్లైనా, ఎంతటి వాళ్లైనా శిక్ష పడాలి. వ్యక్తిత్వ హననానికి పాల్పడే నీచపు వ్యవస్థ ఒక్క మన రాష్ట్రంలోనే ఉంది. ఈ విష సంస్కృతికి బీజం వేసింది వైసీపీ,టీడీపీలే. సోషల్ మీడియా వేదికగా అసభ్యకర పోస్టులు పెట్టే సైతాన్ సైన్యానికి రెండు పార్టీలే ఆదర్శం. అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఉచ్చం, నీచం, మానం, మర్యాద లేకుండా ప్రవర్తించారు. రక్త సంబంధాన్ని మరిచారు. రాజకీయ కక్ష్యతో కుటుంబాలను రోడ్డు మీదకు లాగారు. మనిషి పుట్టుకను అనుమానించి రాక్షసానందం పొందారు. అన్యం పుణ్యం ఎరుగని పసి పిల్లలను సైతం గుంజారు. అక్రమ సంబంధాలు అంటగట్టారు. మీరు పెంచి పోషించిన కాలకేయులే ఇప్పుడు వ్యవస్థను భ్రష్టు పట్టించారు. ఈ దారుణ సంస్కృతిని వెలివేయడానికి అన్ని పార్టీలు ముందుకు రావాలని అన్నారు.

## ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి: ఈసీ నీలం సాహ్ని



అమరావతి : ఏపీలో త్వరలో ఎన్నికల మోత మోగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని అధికారులకు సూచనలు చేశారు. పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని నీలం సాహ్ని ఆదేశించారు. రానున్న సంవత్సరంలో ఏపీలో జరిగే ఎన్నిలకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రణాళికా బద్ధంగా మాస్టర్ ట్రైనర్ శిక్షణ, పోలీస్ బలగాలు, ఎలక్ట్రోరల్ రోల్ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు.

## బిజెపి ఆధ్వర్యంలో పల్లెకు పోదాం...

### సన్న బియ్యం ముమ్మాటికీ కేంద్రానివే..
### బిజెపి రాష్ట్ర నాయకులు కన్నం అంజయ్య.



జగిత్యాల భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు పెగడపల్లి బిజెపి మండల అధ్యక్షులు పల్లె మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా మద్దులపల్లి గ్రామంలో తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలు మరియు గరీబు కళ్యాణ్ అన్న యోజన పథకం కింద ఇస్తున్న సన్నబియ్యం గురించి వివరించారు. అనంతరం గిరిజన తండాలోని అజ్మీరా శ్రీనివాస్ నాయక్ ఇంట్లో సామూహిక భోజనం చేశారు..ఈసందర్భంగా బిజెపి నాయకులు కన్నం అంజయ్య ఉచిత రేషన్ బియ్యం పొందుతున్న లబ్ధిదారులతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాల నుండి కేంద్ర ప్రభుత్వం రాష్ట్రములోని మూడు కోట్ల యాభై లక్షల మందికి ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున ఉచిత బియ్యం పంపిణీ చేస్తుందని దీనికి అదనంగా రాష్ట్ర ప్రభుత్వం ఒక కిలో బియ్యం మాత్రమే ఇచ్చి అన్ని తామే ఇచ్చినట్టు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సారపాకలో ముఖ్యమంత్రి మరియు మంత్రులందరూ తిన్న సన్న బియ్యం బువ్వ మోడీ ఇచ్చిన సన్న బియ్యమేనని అన్నారు. తెలంగాణా కాంగ్రెస్ నాయకులు సన్న బియ్యం దేశం అంతట ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తున్నారని దీనికి భారతదేశంలో విభిన్న సంస్కృతులు కలిగిన జీవన విధానం ఉందని ఒక్కొక్క రాష్ట్రంలో ఆయా రాష్ట్ర ప్రజల ఆహారపు అలవాట్లు ఒక్కొక్క విదంగా ఉన్నందున ఆ రాష్ట్ర ప్రజల దైనందిన జీవనంలో ఏవి అవసరమో గుర్తించి ఆయా దినుసులను కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేస్తుందని అన్నారు. ఉత్తర భారతదేశంలో ఎక్కువగా గోధుమ పంటకు సంబంధించి ఆహారపు పదార్థాలు తింటారు కాబట్టి ఉత్తర భారత దేశంలో కేంద్ర ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా గోధుమలు పంపిణీ చేస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రములో బియ్యం ఎక్కువగా తింటారు కాబట్టి బియ్యం పంపిణీ చేస్తుందని ఈ విషయాలు తెలియకుండ వాస్తవాలను పక్కదారి పట్టించడానికి కాంగ్రెస్ నాయకులు మాట్లాడడం సిగ్గుచేటని అన్నారు.జైశ్రీరామ్ అంటే ఏమి రాదని మాట్లాడిన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గతవారం రోజుల నుండి గుళ్ళు గోపురాలు ఎందుకు తిరుగుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. హిందూ దేవుళ్లను అవమానించడం తర్వాత దేవాలయాల చుట్టూ తిరగడం కాంగ్రెస్ నాయకులకు ఫ్యాషన్ అయిందన్నారు.ధర్మపురి మండలంలో దొడ్డ బియ్యం పంపిణి చేస్తే ప్రశ్నించిన బిజెపి నాయకులపై అక్రమ కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు.ఈకార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొమ్ము రాంబాబు, జిల్లా అధికార ప్రతినిధి మద్రిపెల్లి సత్యమ్,నాయకులు తోడేటి గట్టయ్య, మన్నే రమేష్, కడారి జనార్దన్, షేరు అంజన్న,పెద్ది బీరయ్య, తడగొండ శ్రీనివాస్, నెల్లి చందు,సునీల్, మహేష్ తదితరులు పాల్గొన్నారు..

## బద్వేల్ లో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం దిశగా అడుగులు
## ప్రత్యేక వ్యూహరచనతో ముందుకు సాగుతున్న టిడిపి నేతలు

బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, టిడిపి బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితీష్ రెడ్డి లు అహర్నిశలు కృషి చేస్తున్నారు.

అందులో భాగంగా ప్రత్యేక ప్రణాళికతో ఎప్పటికప్పుడు ఆయా మండలాల పార్టీ నాయకులు కార్యకర్తలతో సమాలోచనలు జరుపుతూ పావులు కదుపుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రభుత్వ కార్యక్రమాలను ప్రతి మండలంలో ను, గ్రామాల్లోను దీటుగా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా విద్యా కమిటీ చైర్మన్ ల ఎంపికలో తమదైన శైలిలో వ్యూహ రచన గావించారు. రితీష్ రెడ్డి తన తాత వీరారెడ్డిని స్ఫూర్తిగా తీసుకొని పేద ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వింటూ పరిష్కారం దిశగా చర్యలు చేపడుతున్నారు. వైసిపి హయాంలో జరిగిన కబ్జాలను వెలికి తీసే దిశగా చర్యలు చేపడుతూ మరోవైపు తెలుగుదేశం పార్టీకి గౌరవం పెంచేదిశగా కార్యకర్తలు నడవాలంటూ హెచ్చరికలు జారీ చేస్తూనే వస్తున్నారు. ఏ కార్యకర్తకు ఆపద వచ్చిన తాను ముందు ఉంటానంటూ.. చేపడుతున్న చర్యల్లో భాగంగా ఏర్పడుతున్న పలు అపోహలను తుడిచిపెట్టే దిశగా రితీష్ రెడ్డి కార్యాచరణను చేపట్టారు. తెలుగుదేశం పార్టీ బలోపేతానికి గాను తల్లి విజయమ్మ తో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఎప్పటికప్పుడు చర్చలు జరుపుతూ గ్రామస్థాయి నుంచి టిడిపిని బలోపేతం చేసే దిశగా సన్నాహాలు చేస్తున్నారు. అంతేకాకుండా బూతు స్థాయిలో కూడా పార్టీ సభ్యత్వాన్ని పెంపొందించేలా బూత్ కార్యకర్తలతో సమాలోచనలు జరుపుతున్నారు. జిల్లాస్థాయిలో సభ్యత్వ నమోదులో బద్వేలును కూడా ముందువరుసలో ఉండేలా చేస్తూ ..మరోపక్క నీటి సంఘాల చైర్మన్ల ల గెలుపు కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చలు జరుపుతూ తెలుగుదేశం పార్టీ కార్యాలయం కళకళలాడుతున్నదని పార్టీ అభిమానులు పేర్కొంటున్నారు.

కూటమి నాయకులను సైతం కలుపుకొని ముందుకు సాగుతున్న రితీష్ రెడ్డి రాబోయే ఎన్నికల్లో.. తప్పనిసరిగా తెలుగుదేశం పార్టీ విజయాన్ని సొంతం చేసుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు ఇప్పటినుంచే కొనసాగిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు

## మహిళల విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే
## ఎంపి కేశినేని కార్యాలయంలో పూలే 199వ జయంతి కార్యక్రమం

విజయవాడ :దేశంలోనే తొలి బాలికా పాఠశాలను ప్రారంభించి మహిళల విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త, సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాయలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు.మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలతో నలిగిపోతూ అణగారిన బడుగు బలహీన వర్గాలకు మహాత్మా జ్యోతిరావు పూలే కొత్తదారి చూపించటంతో పాటు, చేయి పట్టి నడిపించారన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని చాటిచెప్పారని వారి సేవలను కొనియాడారు.. భారతదేశంలో సామాజిక సంస్కరణ ఉద్యమానికి బీజం వేసిన మొదటి మహోన్నతుడు మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. అంబేద్కర్, పూలే గారి ఆదర్శాలకు అనుగుణంగా బడుగు బలహీన వర్గాల వారికి రాజకీయ అధికారాన్ని కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు. జ్యోతిరావు పూలే ఆశయ సాధనాల కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు నమ్మిభాను ప్రకాష్ యాదవ్, రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సింగం వెంకన్న, మైలవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉయ్యూరు నరసింహారావు,టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పాల మాధవ , రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్ (దళితరత్న), రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా బీసీ గౌడ్ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా బిసి సెల్ నాయకుడు ఉప్పడి రాము, పశ్చిమ నియోజకవర్గ బిసి సెల్ కార్యదర్శి చింతపల్లి సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా ఎమ్.ఎస్.ఎమ్.ఈ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్స్ మాదిగాని గురునాథం, మాజీ కార్పొరేటర్ కాకు మల్లిఖార్జున యాదవ్, బిసి సంఘ నాయకులు పట్నాల హరిబాబుటిడిపి సీనియర్ నాయకులు నరసింహ చౌదరి, నగర అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎమ్.డి.ఇర్ఫాన్, 7వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పటమట సతీష్ చంద్ర, 44వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, 42వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముదిరాజు శివాజీ, 43వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు కునికి కొండయ్య, టిడిపి నాయకులు ముదికొండ శివ, బోగవల్లి నాగబాబు, తమ్మిన శేఖర్, ఆర్యకటిక ఉమామహేశ్వరరావు, డబ్బుకొట్టు ఏడుకొండలు, నగరాల సాధికారత కమిటి కన్వీనర్ మరుపిళ్ల తిరుమలేష్, దేవరకళ్యాణ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీ లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన
## అదనపు బాధ్యతలకు ముకుమ్మడి రాజీనామా

నిర్మల్ బాసర ట్రిపుల్ ఐటీ లో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసరల్ఉ నిరసనకు దిగారు. బాసర ట్రిపుల్ ఐటీ ప్రధాన ద్వారం ముందు విధులను సుమారు 73 మంది కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు బహిష్కరించి భైఠాయించారు. గురువారం హైదరాబాదులో హైయర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ ముట్టడికి యత్నించిన అసిస్టెంట్ ప్రొఫెసర్లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించడంపై నిరసన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 ని వెంటనే రద్దు చేయాలని, గత 15 సంవత్సరాల నుండి విధులు నిర్వర్తిస్తున్న తమను పర్మినెంట్ చేయాలని, ఉద్యోగ భద్రత ఇవ్వాలని కోరుతూ ఆందోళనకు దిగారు. తమ న్యాయపరమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించకపోతే బాసర త్రిపుల్ ఐటీని స్తంభింప చేస్తామని హెచ్చరించారు.

# వేసవి కాలంలో పిల్లలపట్ల జాగ్రత్తగా ఉండాలి

## లక్షెట్టిపేట సిఐ అల్లం నరేందర్



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ 11 :** వేసవికాలంలో తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని లక్షెట్టిపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ అల్లం నరేందర్ తెలిపారు.వేసవికాలం కావడంతో ప్రస్తుతం పాఠశాలకు సెలవులు సమిపిస్తుండడంతో మనది గోదావరి పరివాహక ప్రాంతం కావున పిల్లలు సమీపంలోని గోదావరిలో,వ్యవసాయ బావుల్లో స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లి అవంచనియా సంఘటనలు జరగకుండా తల్లిదండ్రులు చూసుకోవాలన్నారు. అలాగే ఎండలో తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.నీడ పట్టణం ఉండే ఆటలు ఆడుకునే విధంగా చూసుకోవాలన్నారు.వేసవి కాలంలో తమ పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని లక్షెట్టిపేట దండేపల్లి,జన్నారం మండల ప్రజలను ఉద్దేశించి తెలిపారు.

# జ్యోతిరావు పూలే ఒక గొప్ప సంఘ సంస్కర్త

## జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 11(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా/సంగారెడ్డి:మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా, సంగారెడ్డి ఎమ్.ఎల్.ఎ క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు సి.దామోదర రాజనర్సింహ, స్థానిక ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ తో కలిసి మహాత్మా పూలమాల వేసి ఘన నివాళులర్పించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఐపియస్.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,జ్యోతిరావు పూలే ఒక గొప్ప సంఘ సంస్కర్త, విద్య, మహిళా సాధికారత మరియు అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన న్యాయవాది అన్నారు,పులే జీవితం,ఆయన బోధనలు అందరికీ మార్గదర్శకం అని,సమానత్వం,న్యాయం మరియు సామాజిక సామరస్యం యొక్క విలువలను నిలబెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. అటువంటి గొప్ప వ్యక్తులకు నివాళులు అర్పించడం అంటే వారి మార్గాన్ని అనుసరించడం మరియు మెరుగైన సమాజం కోసం పనిచేయడమే అని ఎస్పీ అన్నారు.

# మణికొండ తాయి బజార్

**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 11 ఏప్రిల్** 2025మణికొండ మున్సిపాలిటీ వారు 03 ఏప్రిల్ 2025 రోజున తాయి బజార్ ఆక్షన్ నిర్వహిస్తున్నట్లు వార్త పత్రిక ద్వారా తెలియ చేసిన దరిమిలా స్థానిక ప్రజలు ప్రతిస్పందిస్తూ 9 మంది ఆక్షన్ లో పాల్గొనడం జరిగినదనీ అందులో రసవత్తరంగా పోటా పోటీగా జరిగిన ఆక్షన్ లో చివరికి 60,30,000/- కసిరెడ్డి శరత్ కుమార్ పాఠ పాడి తాయి బజార్ ఆక్షన్ కైవసం చేసుకోగా అతన్ని విజేతగా ప్రకటించడమైనది. ఇందులో అంతుబట్టని విషయమేమనగా ఇట్టి విషయమై గత సంవత్సరం 31,05,000/- పాఠ పాడగా రమా రమి రెండింతలు చేసి ఈ సంవత్సరం పాఠ ముందుకు సాగిందని, ప్రస్తుత విజేత ఇంత పెద్ద మొత్తం ఎలా వసూలు చేస్తాడో వేచి చూడాల్సిందేనని అందరూ ఆశ్చర్యపడుతున్నారు.

# జ్యోతిరావు పూలేకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నివాళి





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 11(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా/**మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సంధ్భంగా సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని పూలే విగ్రహానికి మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్,పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి , స్త్రీ విద్యకు బాటలు వేసిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఎమ్మెల్యే కొనియాడారు,,ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం పనిచేసిన నాయకుడని అన్నారు,కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి,విజేందర్ రెడ్డి నాయకులు శివరాజ్ పాటిల్, డా. శ్రీహరి,పైతర సాయికుమార్,ఆర్ వెంకటేశ్వర్లు, పెరమళ్ళ నర్సింలు, ప్రభు గౌడ్,విష్ణు,అక్బర్ తదితరులు పాల్గొన్నారు...

# అడవి తల్లి పై గొడ్డలి వేటు మామూళ్ల మత్తులో అధికారులు





**అందోల్ నియోజకవర్గ ప్రతినిధి ఏప్రిల్ 11, (ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా, ఉమ్మడి పుల్కల్ మండల పరిధిలోని, పలు గ్రామాలలో కల్ప వ్యాపారం జోరుగా సాగుతోంది, ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణాన్ని పెంపొందించాలని, పదేపదే చెప్తున్నప్పటికీ, ఆచరణలో మాత్రం అది సాధ్యం కావడం లేదు, ఎందుకంటే తెలంగాణ రాష్ట్రప్రభుత్వంపర్యావరణాన్ని,పెంచేందుకు పలు గ్రామాలలో నర్సరీలను ఏర్పాటు చేసి, పలు రకాల మొక్కలను పెంచి, ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి ఒక చెట్టు నాటాలనె ఉద్దేశంతో, రాష్ట్ర ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, మొక్కలు నాటుతున్నారు తప్ప, వాటి పర్యవేక్షణ చేయడంలో కొందరునిర్లక్ష్యంవహిస్తున్నరని, ఆరోపణలు ఉన్నాయి, నాటిన చెట్లను సైతం వాటిని వ్యాపారస్తులకు విక్రయించి, లాభాలు పొందేందుకు పలువురు గ్రామాల ప్రజలు, దొంగ చాటుగా చెట్ల వ్యాపారులకు, తక్కువ ధరకే అట్టి చెట్లను విక్రయించుకొని, లాభాలు పొందుతున్నారు, దీంతో ప్రభుత్వా ఆదాయానికి పెద్ద ఎత్తున గండి పడుతుంది, పర్యావరణాన్ని పరిరక్షించే అధికారులే, చెట్లు నరికే వ్యాపారస్తులు ఇచ్చే, మామూళ్లకు అలవాటు పడి, ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి వేస్తున్నారని, ఆరోపణలుగుప్పుమంటున్నాయి, పరిస్థితులు ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో పర్యావరణం లేక వర్షాలు పడక భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోయే ప్రమాదం ఉందని, గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి,ఇట్టిఅక్రమకలప వ్యాపారాలను అరికట్టాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు, లేనియెడల అన్ని గ్రామాల ప్రజలము ఏకమై, సంగారెడ్డి జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేస్తామని, పలువురు గ్రామస్తులు విలేకరుల ముందు వాపోయారు...

# నాలా అభివృద్ధి పనులను పరిశీలించిన..సబీహా గౌసుద్దీన్



**కూకట్పల్లి (ప్రజాబలం) ఏప్రిల్ 11** :కూకట్పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని రామారావు నగర్ లో శుక్రవారం కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ జరుగుతున్న నాలా అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో అదనంగా మంజూరు చేసిన 1కోటి 30 లక్షల వ్యయంతో నాలా విస్తరణ పనులు జరుగుతున్నాయని, లోతట్టు ప్రాంతమైన రామారావు నగర్ లో నివసిస్తున్న ప్రజలు ఎన్నో ఏళ్ల తరబడి నాలా సమస్యను ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే కృషితో నాలా సమస్య నుండి విముక్తి కలిగేలా కృషి చేస్తున్నారని అన్నారు, అలాగే పనుల పురోగతిని అధికారులతో అడిగి తెలుసుకోవడం జరిగిందని పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నాగుల సత్యం, వెంకటయ్య యాదవ్, ఆవుల సంజీవ, ముక్తార్, సాంబ శివ, సత్యనారాయణ, కరుణాకర్, యోగి రాజు, తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులను సన్మానించిన మిత్ర బృందం



**వేములవాడ- ఏప్రిల్ 11 (ప్రజాబలం దినపత్రిక)** వేములవాడ కోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికలలో గెలిచిన అభ్యర్థులను కోర్టు ఆవరణలో వారి మిత్రబృందం శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఎన్నికల్లో స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ గుజ్జే మనోహర్, లైబ్రరీ సెక్రటరీ పంపరి శంకరయ్య, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ గా గెలుపొందిన కనికరపు శ్రీనివాస్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంపరి నాగరాజు, తోట అనిల్, జయారపు అంజయ్య , లింగాల సుదర్శన్, పులి మల్లేశం,సోయినేని శ్రీకర్ లు పాల్గొన్నారు.

# కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఏప్రిల్ 11:**ప్రభుత్వంపై భారం పడుతున్న పథకాలను అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు.

శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్ పేట్ మండలంలోని తూముకుంట లోని ఎస్ఎన్ఆర్ కన్వెన్షన్ లో ఎంపీ ఈటెల రాజేందర్ తో కలిసి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి కళ్యాణ లక్ష్మి ,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ ప్రభుత్వంపై భారం పడుతున్న పథకాలను అమలు చేసేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని, పార్టీలకు అతీతంగా ఎంపీ తదితరులతో కలిసి మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తాం అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణం, వంటగ్యాస్, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు, ప్రతి నిరుపేదకు సన్నబియ్యం పంపిణీ తదితరాలు దేశంలో ఎక్కడలేని విధంగా అమలవుతున్నాయని పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. ఘట్కేసర్ లో 116, కాప్రా లో 36, మేడ్చల్లో 52 , మూడు చింతలపల్లిలో 25, మేడిపల్లిలో 102, షామీర్పేట్ లో 58 మొత్తం 389 మంది లబ్ధిదారులకు సుమారు 4 కోట్ల రూపాయల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పట్నం మహేందర్ రెడ్డి, ఈటల రాజేందర్ చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేసారు.



ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఉపేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు, వజ్రేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అనంతరం దేవరియంజాల్ లోని శ్రీ సీతారామస్వామి దేవాలయంలో బ్రహ్మోత్సవాల కళ్యాణ మహోత్సవంలో హాజరైన ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహేందర్ రెడ్డికి వేద బ్రాహ్మణులు ఆశీర్వచనం అందజేసారు.

## జోగిపేట్ డివిజన్ ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారం

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహ




**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఏప్రిల్ 11, (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా, అందోల్ జోగిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసినటువంటి, జోగిపేట్ డివిజన్ ఆత్మ కమిటీ ప్రమాణ స్వీకారానికి, రాష్ట్ర వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ మంత్రి, దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆందోల్ నియోజకవర్గంలో విద్య వైద్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని, వ్యవసాయ సాంకేతిక పద్ధతులను రైతులు అనుసరించాలని, నూతన వ్యవసాయ పద్ధతులను, అవలంబిస్తున్న ప్రదేశాలను రైతులు




సందర్శించాలి, అవి ఎక్కడ అమలు చేయాలి, అందోల్ నియోజకవర్గం లో ఫార్మా కాలేజ్, హాస్పిటల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయని త్వరలో ఫార్మా పీజీ కాలేజీలను ఏర్పాటు చేస్తున్నామని, 170, కోట్లతో సింగూరు కాల్వకు సీసీ లైనింగ్ పనులను చేపడుతున్నామని, సింగూరును టూరిజం హబ్ గా, తీర్చిదిద్దుతామని సుల్తాన్పూర్ జేఎన్టీయూత్వరలోవిశ్వవిద్యాలయంగా అభివృద్ధి చెందబోతుందని, చౌట్కూర్ మండలానికి, పి హెచ్సి అంబులెన్స్, పోలీస్ స్టేషన్, కేజీవీబీ పాఠశాల మంజూరు చేస్తామని సింగూరును , టూరిజం హబ్ గా తీర్చిదిద్దామని, నర్సింగ్ కాలేజ్ హాస్పిటల్,ట్రామా సెంటర్ 30 పడకలహాస్పటల్ త్వరలోమంజూరు చేస్తామని, సంగారెడ్డి జిల్లాలోని మిగిలిన నియోజకవర్గాల్లో ఆత్మ కమిటీలను త్వరలో నియమిస్తామని అన్నారు, ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యుడు సురేష్ షెట్కార్, సంగారెడ్డి మెదక్ జిల్లాల గ్రంథాలయ సంస్థ చైర్మన్లు అంజయ్య, సుహాసిని రెడ్డి, నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి అంజిరెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్, తిమ్మారెడ్డి గారి మల్లారెడ్డి, 23 మంది సభ్యులు పాల్గొని ప్రమాణం స్వీకారం చేశారు....

## బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ శ్రీ జ్యోతిరావు పూలే 198 వ జయంతి వేడుకలను బీసీ సాధికారిత సంఘం ఆధ్వర్యంలో వేములవాడ పట్టణంలోని ఉత్తర తెలంగాణ భవన్ లో ఘనంగా నిర్వహించడం జరిగింది.

మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా బీసీ నేతలు నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలు, ఆదర్శాలు, సిద్ధాంతాలు చాలా గొప్ప వని, భారతదేశంలోనేప్ర ప్రథమ సామాజిక తత్వవేత్త అని, కుల వ్యవస్థకు వ్యతిరేకమని, అణిచివేతకు గురి అవుతున్న ప్రజలకు ఆత్మస్థైర్యం అందించేందుకు వారి హక్కుల కొరకు నిరంతరం పోరాడి ఎన్నో సమస్యల పరిష్కారం కోసం కృషిచేసిన మహానీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని, అంతేకాకుండా బడుగు, బలహీన వర్గాలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉపాధి పరంగా తదితర రంగాలలో అభివృద్ధి చెందా లనే లక్ష్యంతో ముందుకు వెళ్లారని కొండ దేవయ్య అన్నారు.

బీసీ సాధికారిత సంఘం రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యమకారుడిగా, సంఘసంస్కర్తగా, అనగదొక్కబడిన హృదయాలలో చిరస్థాయిగా నిలిచిన మహనీయుడు, కుల, మత, వర్గ, వర్ణ, విభేదాలు ఉండకుండా ఉండాలంటే అన్నింటికీ విద్యనే ముఖ్యమని భావించి తన సతీమణి సావిత్రిబాయి పూలే ను బడికి పంపించారని, పేదవారు విద్యను అభ్యసించుటకు ఉదయం, రాత్రిపూట బడులను స్థాపించారని, అంటరానితనం రూపుమాపుటకు, అనాధ బాలల పాఠశాలలకు, వితంతువుల కొరకు, వృద్ధుల కోసం, ఎనలేని కృషి చేశారని ఎన్నో పోరాటాలు చేశారని పొలాస నరేందర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో బీసీ సాధికారిత సంఘం నేతలు కొండ కనకయ్య, లింగంపల్లి దేవయ్య, తూపుకారి సత్తయ్య, ఇల్లందుల వెంకటేష్, సిహెచ్ రామస్వామి గౌడ్, ఉయ్యాల భూమయ్య, ఏ ట్టము సాయి కృష్ణ, మ్యాన రాజేష్, నిమ్మగడ్డ శ్రీనివాస్, ఉన్నారపు దేవయ్య, చేను హేళపతి, చందు, ముద్రకోల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## వర్జినల్ పాస్ పోర్ట్ పోయింది. దొరికిన వారు తిరిగి ఇవ్వగలరు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఎల్లారెడ్డిపేట, ( ప్రజాబలం),** 05-04-2025 శనివారం రోజున కంకణాల బాలకృష్ణ, తండ్రి రాజయ్య,(30), కులం ముదిరాజ్, నివాసం వెంకటాపురం గ్రామం, ఎల్లారెడ్డిపేట మండలం ఉదయం 10 గంటల సమయంలో వెంకటాపూర్ గ్రామం నుండి తన వర్జినల్ పాస్పోర్టును ఒక కవర్లో పెట్టుకొని తన ద్విచక్ర వాహనంపై ఎల్లారెడ్డిపేట వెళ్లినాడు. ఎల్లారెడ్డిపేటకు వెళ్లిన తర్వాత పాస్పోర్ట్ ఉన్న కవరు ద్విచక్ర వాహనంలో లేకపోవడంతో, తిరిగి వచ్చిన దారిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుండి వెంకటాపూర్ గ్రామ వరకు వెతకగా ద్విచక్ర వాహనం నుండి పడిపోయిన పాస్పోర్ట్ వర్జినల్ దొరకలేదు, పాస్పోర్ట్ వర్జినల్ నెంబర్ ఎల్4075780 కలది. ఎవరికైనా దొరికితే కంకణాల బాలకృష్ణ, సెల్ నెంబర్6300642125 ఇవ్వగలరని కంకణాల బాలకృష్ణ విజ్ఞప్తి చేస్తున్నాడు.

## జాబ్ మేళలో తొక్కిసలాట

వరంగల్ తూర్పు నియోజకవర్గంలో నిర్వహించిన జాబ్ మేళాలో తొక్కిసలాట జరిగింది.వరంగల్ రైల్వే స్టేషన్ దగ్గరలోని ఎం.కె.నాయుడు హోటల్లో ఏర్పాటు చేసిన జాబ్ మేళాకు నిరుద్యోగ యువత భారీగా తరలిరావడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. మంత్రి రాక కోసం కార్యక్రమాన్ని కొంత సమయం వేచి ఉంటారు. అలాగే ప్రారంభ కార్యక్రమం, మంత్రులు ప్రసంగించి వెళ్లే వరకు నిలిపివేయడంతో ఈ క్రమంలో భారీగా చేరుకున్న నిరుద్యోగ యువతముందుకు వెళ్లే ప్రయత్నం చేశారు.

## సిఐటియు ఆధ్వర్యంలో మహనీయుల జయంతి వేడుకలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ ఏప్రిల్ 11:**మంచిర్యాల మందమర్రి మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో భారతీయ సామాజికొద్యమ నాయకులు,దేశంలో అట్టడుగు వర్గాల కోసం,

ఉద్యోగ,కార్మిక హక్కుల కోసం తమ జీవితాంతం కృషి చేసిన మహాత్మ జ్యోతి రావు పూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్, శ్రామిక మహిళా సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన ఉద్యమనేత విమల రణదివే గారి జయంతుల సందర్భంగా మందమర్రి మున్సిపల్ కార్యాలయం వద్ద ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు, సిఐటియు మంచిర్యాల జిల్లా అధ్యక్షులు అబ్బోజు రమణ లు పాల్గొని నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... దేశంలో చదువు కొందరికి మాత్రమే సొంతంగ ఉన్న రోజుల్లో అందరికీ చదువుకొనే హక్కుండలని జ్యోతి రావు పూలే తన భార్య అయిన సావిత్రి బాయికి చదువు నేర్పిన దేశంలోనే తొలి మహిళా టీచర్ గా నిలబెట్టి మహిళలకు,బాలికలకు చదువు నేర్పించడం జరిగిందన్నారు. మూర?పు మూఢత్వాలు రాజమేలుతున్న సమయంలో ప్రజలకు చదువు ఒక్కటే ఈ అణగారిన ప్రజలకు ఆయుధమై కాపాడుతుందని నమ్మి అందరికీ విజ్ఞానాన్ని అందించడంతో నేడు కోట్లాది మంది ఉన్నత స్థానాల్లో ఉండి గౌరవం పొందడం జరుగుతుందన్నారు.



డా.బిఆర్ అంబేద్కర్ భారతదేశ ప్రజలకు గౌరవం, హక్కుల కల్పన కోసం రాజ్యాంగ రచనలో ముఖ్య భూమిక పోషించడమే కాకుండా దేశంలో విషపూరితంగా వ్యాపించిన అంటరానితనంపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. అలాగే పరిశ్రమల్లో, ఇతర పని ప్రదేశాలలో పనిచేస్తున్న శ్రామిక మహిళలకు హక్కులు ఉండాలని, సమాన వేతన జీతభత్యాలు ఉండాలని అలుపెరుగని పోరాటాలను నిర్మించిన మహిళ ఉద్యమ నేత విమల రణదీవే జయంతులు స్మరించుకోవడం అంటే వారు చూపించిన విజ్ఞాన కాంతుల బాటలను,శ్రమ దోపిడి, సామాజిక అణచివేత, వివక్షలపై అలుపెరగని పోరాటాలను నిరంతరం కొనసాగిస్తూ ముందుకు వెళ్లడమే ఆ మహనీయులకు మనం ఇచ్చే ఘనమైన నివాళి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, కాసర్ల రాజలింగు, మున్సిపల్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి, దూలం శ్రీనివాస్, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం సిఐటీయు రాష్ట్ర అధ్యక్షులు చల్లూరి దేవదాస్, సీఐటీయు బెల్లంపల్లి మండల కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, డివిజన్ నాయకులు పాయిరాల రాములు, రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి, మున్సిపల్ యూనియన్ స్థానిక నాయకులు మెడపట్ల నర్సయ్య, సంగి పోషం,చెన్న రాజం, భూమయ్య, రవి, లక్ష్మన్ అధికారులకు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్రహారంలో హనుమాన్ చిన్న జయంతి కి అన్ని ఏర్పాట్లు పూర్తి. ఈవో శ్రీనివాస్.

### 3 లక్షల రూపాయలతో భక్తులకు ఏర్పాట్లు.

### 50,000 మంది భక్తులు హాజరయ్యే అవకాశం.




**వేములవాడ టౌన్,( ప్రజాబలం ),** వేములవాడ అర్బన్ మండలం అగ్రహారం ఆంజనేయ స్వామి ఆలయంలో12-04-2025 శనివారం రోజు నిర్వహించే హనుమాన్ చిన్న జయంతికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి నాగారపు శ్రీనివాస్ తెలిపారు. తగిన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. హనుమాన్ చిన్న జయంతి ఉత్సవాలకు సుమారుగా 50వేల మంది భక్తులు హాజరై అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలలో భాగంగా ఉదయం నాలుగు గంటలకు సుప్రభాతం, నాలుగు గంటల 30 నిమిషాలకు సంకల్పం, మాన్య సూక్తాభిషేకం, బాల భోగం, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, 5:30 నుండి అభిషేకములు, అర్చనలు, ఉదయం 8 గంటలకు శ్రీవారి జెండా ఎత్తుట, ఉదయం 9:30 నుండి ఉత్సవమూర్తులకు అభిషేకం, నిత్య హ వనం, పూర్ణాహుతి, బలిహరణం, మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషములకు మహా నివేదన హారతి, 12 గంటల 30 నిమిషాలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం నాలుగు గంటలకు రథోత్సవం అష్ట బలులు, జి ష్ఠకుంభం, కూష్మాండబలి, గ్రామ బలి, సాయంత్రం గ్రామోత్సవం, రథముపై స్వామివారి ఊరేగింపు, రాత్రి 7 గంటలకు ప్రార్ధన, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద గోష్టి, రాత్రి 8 గంటలకు భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జరుగునని అగ్రహారం శ్రీ జోడి ఆంజనేయస్వామి వారిని దర్శించి స్వామి వారి కృప కటాక్ష వీక్షణములకు పాత్రులు కావాలని గౌరీశెట్టి మహేందర్ వ్యవస్థాపక వంశీ ధర్మకర్త అర్చకులు, సిబ్బంది, కార్యనిర్వాహణాధికారి నాగారపు శ్రీనివాస్ కోరారు.

## రాజన్న గుడి చెరువులో మహిళా మృతదేహం లభ్యం.



**వేములవాడ టౌన్,( ప్రజాబలం),** వేములవాడ రాజన్న ఆలయ గుడి చెరువులో ఒక గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నదని సమాచారం రాగా అట్టి మృతదేహాన్ని బయటకు తీసి చూడగా వయసు సుమారు 35-40 సంవత్సరాలుగా ఉంటుందని, దాదాపుగా నాలుగు నుండి ఐదు రోజుల క్రితం చనిపోయి ఉండవచ్చు అని, ఆమె బ్లాక్ కలర్ టాప్ వేసుకుంది. ఆమె యొక్క వివరాలు ఎవరికైనా తెలిసినచో వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ నందు సంప్రదించాలని, వేములవాడ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. లేదా8712656413 సెల్ నెంబర్ కు ఫోన్ చేయాలని టౌన్ సిఐ పేర్కొన్నారు.

# ప్రభుత్వ విప్ ఆది చొరవతో చురుగ్గా కొనసాగు తున్న మల్కపేట రిజర్వాయర్ కుడికాలువ మరమ్మతు పనులు.

## ఆది సూచనలతో త్వరలోనే కుడికాలువకు నీటి విడుదలకు ఏర్పాటు.

## కుడి కాల్వ ద్వారా సుమారు 20వేల ఎకరాలకు అందనున్న సాగునీరు.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, కోనరావుపేట, ( ప్రజాబలం ),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట మండలం మల్కపేట కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ 9 లో భాగంగా మల్కపేట నుండి వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామం వరకు గల మల్కపేట రిజర్వాయర్ కుడి కాలువ మరమత్తు పనులు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం వేసవిని దృష్టిలో ఉంచుకుని సాగు, త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది రాకుండా ఇట్టి కాలువలోకి నీటిని వదలడానికి గల అడ్డంకులు తొలగించడం జరుగుతుంది. కాల్వలో ఉన్న చెత్తా,చెదారం, పిచ్చి మొక్కలను తొలగించడం, కాల్వ పై మట్టి తీయకుండా వదిలేసిన దగ్గర మట్టి తీయడం, బ్రిడ్జిలు కట్టాల్సిన చోట ప్రత్యామ్నాయంగా సిమెంట్ పైపులతో నీటిని పంపేలా ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ఇందులో భాగంగా రామన్నపేట, సుద్దాల గ్రామాల మధ్యలో గల బ్రిడ్జిల కింద గల మట్టిని తొలగించి మధ్యలో కాలువ పైపులు వేయడం జరిగింది. నాగారం, పల్లి మక్త గ్రామాల మధ్యలో ప్రధాన రహదారిపై పైపులతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తూ, కాల్వలో వివిధ చోట్ల చేరిన మట్టిని తొలగించడం జరుగుతుంది.

# సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల వేములవాడలో లీగల్ లిటరసీ కార్యక్రమం.








**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలోని శాతరాజు పల్లి రోడ్డు లో ఉన్న తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రాథమిక హక్కులు మరియు కర్తవ్యాలపై లీగల్ లిటరసీ కార్యక్రమం ఉత్సాహపరిత వాతావరణంలో అత్యంత ప్రేరణత్మకంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమానికి అతిథులుగా రాధిక జైస్వాల్ ( సీనియర్ సివిల్ జడ్జి మరియు డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, కార్యదర్శి), చింటోజు భాస్కర్,( లోక్ అదాలత్ మెంబర్ ), నమేత రమేష్,( అడ్వకేట్), ఆడెపు వేణు, ( డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ మెంబర్ ), శ్రీ కుమార్ ( అడ్వకేట్) హాజరై, విద్యార్థులతో తమ అనుభవాలు పంచుకుంటూ, ఒక బాధ్యతాయుత పౌరుడిగా హక్కులు మరియు కర్తవ్యాలపై అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. కేవలం ఉపన్యాసాలతో కాకుండా, ఈ కార్యక్రమం విద్యార్థుల ప్రతిభను ప్రతిబింబించేలా మారింది. సాంస్కృతిక ప్రదర్శనలు, చైతన్య భరితమైన మాక్ పార్లమెంట్, ఆసక్తికరమైన ముట్ కోర్ట్, జ్ఞానంతో నిండి ఉన్న ఎక్స్ పో– అన్నిటిని విద్యార్థులు హృదయపూర్వకంగా ప్రదర్శించారు. అతిథులు, విద్యార్థుల సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం మరియు చురుకుదనాన్ని ప్రశంసిస్తూ అభినందించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. లావణ్య, వైస్ ప్రిన్సిపల్ బి. సుమలత, అధ్యాపక బృందం మరియు విద్యార్థినిలు ఉత్తేజపరిత భాగస్వామ్యం ప్రధాన పాత్ర పోషించాయి. ఈరోజు విద్య, జాగృతి మరియు పౌర బాధ్యత పట్ల చైతన్యాన్ని కలిగించిన ఒక స్ఫూర్తిదాయక సందర్భంగా నిలిచింది.

# మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి వేడుకలు.

## వేములవాడలో పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి.

## అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌకు వద్ద అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 198 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే దేశ మొదటి సంఘసంస్కర్తగా దేశంలో ఉన్న ఆ సమానత్వం తొలగించడం కోసం విద్యను ప్రధానమైన ఆయుధంగా భావించి, బడుగు, బలహీన వర్గాలకు విద్యను ఆయుధంగా అందించిన మహనీయుడని వారు కొనియాడారు. భారతదేశంలో స్త్రీలను వంటగదికే పరిమితం చేసిన మనువాద కుట్ర నుంచి స్త్రీలకు విముక్తి కలిగించే ఆయుధంగా విద్యను అందించడం కోసం సావిత్రిబాయి పూలేను మొదటి ఉపాధ్యాయురాలుగా తీర్చిదిద్దిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించుకోవడం చాలా గర్వంగా ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి శంకర్, సిరిగిరి రామచందర్, బొడ్డు రాములు, గుండ థామస్, గుడిసె మనోజ్ కుమార్, గసికంటి ప్రభాకర్, జింక శ్రీధర్, రాగుల రాంప్రసాద్, గుడిసె కిషన్, సామర్ల ప్రతాప్, ముద్రకొల గణేష్, జింక శ్రీకాంత్, కొమ్ము రణధీర్, నేదురి జనార్ధన్, శంకర్, మల్యాల శంకర్, కొమ్ము తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడలో ప్రైవేటు లాడ్జి యజమానులు బస కోసం వచ్చే వారి దృష్ట్యా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

లాడ్జిలలో బస చేసే వారి వివరాలు తప్పకుండా నమోదు చేయాలి.

ప్రైవేట్ లాడ్జిల కేంద్రంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

వేములవాడ ఏ.ఎస్.పి శేషాద్రిని రెడ్డి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం),** వేములవాడ పట్టణ పరిధిలోని స్థానిక ఫంక్షన్ హాల్లో వేములవాడ పట్టణ పరిధిలోని ప్రైవేట్ లాడ్జ్ యజమానులతో వేములవాడ ఏఎస్పి శేషాద్రిని రెడ్డి సమావేశం నిర్వహించి, లాడ్జిలలో బస చేయడానికి వచ్చిన వారి భద్రత దృష్ట్యా తీసుకోవలసిన చర్యలపై దిశ నిర్దేశం చేసిన ఏ ఎస్ పి.

ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రైవేట్ లాడ్జిలలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని, పోలీస్ శాఖ లాడ్జిలలో ఎప్పటికప్పుడు ఆకస్మికతనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, లాడ్జిలలో బస కోసం వచ్చే వారి ఆధార్ కార్డులు, ఇతర ఐడెంటిటీ కార్డులు తప్పకుండా తీసుకోవాలని, లాడ్జిలలో భద్రత దృష్ట సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, ఎవరైనా కొత్తవారు, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే పోలీసువారికి సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం.




**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** శుక్రవారం రోజున వేములవాడ పట్టణంలో బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే198 జయంతి వేడుకలను ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల మహేందర్ యాదవ్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని, ఈయన గొప్ప సంఘసంస్కర్త అని,1870 సంవత్సరంలోనే మొట్టమొదటి మహిళా బాలికల పాఠశాల ఏర్పాటు చేసి స్త్రీల అభ్యున్నతికి పాటుపడిన వ్యక్తి జ్యోతిరావు పూలే అని అన్నారు.

వేములవాడ పట్టణంలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు జిల్లా అధ్యక్షులు బత్తుల మహేందర్ యాదవ్, వేములవాడ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు మొగిలి కరుణాకర్, పట్టణ యువత అధ్యక్షులు బండారి గవాస్కర్, వేములవాడ మండల అర్బన్ అధ్యక్షులు పార్వతి మహేష్, బోయినపల్లి మండల అధ్యక్షులు దయ్యాల రాజశేఖర్, చంద్రగిరి సిద్ధార్థ, వాసం మల్లేశం యాదవ్, అనిల్ గౌడ్, రంజిత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేసిన మహనీయుడు మహాత్మ జ్యోతి బాపూలే ప్రిన్సిపల్ రోనాల్డ్ కిరణ్





**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ ఏప్రిల్ ఏప్రిల్ 11 :** కుల మతాల చిచ్చు రగులుతున్న తరుణంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషిచేసిన మహనీయుడు మహాత్మ జ్యోతి బాపూలే రావు అని లక్షెట్టిపేట గురుకుల పాఠశాల కళాశాల ప్రిన్సిపల్ రోనాల్డ్ కిరణ్ అన్నారు.శుక్రవారం మహాత్మ జ్యోతి బాపూలే జయంతిని పురస్కరించుకొని పాఠశాలలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ...ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలన్న తపన ఆయనలో రాగానే విద్య కోసం కృషి చేస్తున్న తరుణంలో ఎన్నో ఆటంకాలు ఎదురైనా కూడా భయపడకుండా కుల మతాల నేకతాటిపై తీసుకువచ్చి విద్యను అభివృద్ధికి గురిచేసిన గొప్ప వ్యక్తి అన్నారు.అంతేకాకుండా ఆయన సతీమణి సావిత్రి పూలే బాయ్ కూడా మహిళలకు కూడా విద్య రావాలనే ఉద్దేశంతో ఆమె కూడా చదువుకొని మహిళ లోకానికి విద్య నేర్పించిన ప్రథమ గురువు అని తెలిపారు.నేడు ప్రపంచంలో ఏ మూలన చూసినా పురుషులకన్నా మహిళలే ఎక్కువ సంఖ్యలో విద్యారంగంలో రాణించిన వారు ఉన్నారన్నారు. ప్రభుత్వం కూడా పేద విద్యార్థుల సంక్షేమ ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఏటాకోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికర మైన భోజనాన్ని అందించడం జరుగుతుందన్నారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని భవిష్యత్తులో రాణించాలన్నారు. పాఠశాల పీఎం శ్రీ ఎంపిక అయిందని తెలిపారు. ఇప్పటివరకు విద్యార్థులకు విహారయాత్రలు తీసుకువెళ్లామని అన్నారు.పాఠశాలను కూడా త్వరలో అత్యంత సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా కంప్యూటర్ విద్యను కూడా అందించడం జరుగుతుందన్నారు.అనంతరం పాఠశాలలో చిన్నారులు హర్యానా రాష్ట్రానికి సంబంధించిన గీతానికి నృత్యం చేసి వారి యొక్క ప్రతిభను చాటారు. హర్యానా నాట్యం చేయడంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయురాలు శైలజను అభినందించారు.ఈ కార్యక్రమంలో ఏటీపీ సాగర్ తో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆ 400 ఎకరాలు ముమ్మాటికి అటవీ భూమే:కేటీఆర్

హైదరాబాద్ ఆ 400 ఎకరాలు ముమ్మాటికి అటవీ భూమే కేటీఆర్ సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ఆ 400 ఎకరాలు ముమ్మాటికి అటవీ భూమే అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. రిజర్వ్ ఫారెస్ట్ అని ప్రత్యేకంగా డిక్లేర్ చేయకపోయినా అడవులకు ఉండాల్సిన లక్షణాలు ఉంటే యాజమాన్య హక్కులు ఎవరి పేరు మీద ఉన్నా దాన్ని అటవీ భూమిగానే గుర్తించాలని 1996లో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. అలాంటి భూముల లెక్కలు తీయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు కూడా ఇచ్చిందని గుర్తించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com